# ది క్రైమ్ న్యూస్

Crime News

తెలుగు దినపత్రిక

బుధవారం, మే 20, 2026 | సంపుటి - 20 | సంచిక 241 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## ఎబోలాపై అప్రమత్తమైన భారత్

### ప్రజలకు హెచ్చరిక చేసిన అధికారులు

న్యూఢిల్లీ : ఆఫ్రికాలోని కాంగో, ఉగాండా సహా పలు దేశాల్లో ఎబోలా వైరస్ వేగంగా విజృంబి స్తోంది. ఈ ప్రాణాంతక వ్యాధి కారణంగా ఇప్పటికే 100 మంది మృతి చెందారు. 390 అను మానిత కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. కాంగోలోని ఆరుగురు అమెరికన్లకు ఈ వ్యాధి సోకినట్లు పేర్కొ న్నారు. వీరిని క్వారంటైన్ కోసం సురక్షిత ప్రదేశానికి తరలించేందుకు అమెరికా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

2లో






## వీధికుక్కలను తరలించాల్సిందే

- ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు
- ప్రతి జిల్లాలో పూర్తిస్తాయిలో బర్త్ కంట్రోల్
- స్కూళ్లు, కాలేజీలు, బస్టాండ్లలో కుక్కలను లేకుండా చేయాలి
- గతంలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాల్సిందేనన్న సుప్రీం

న్యూఢిల్లీ : వీధికుక్కల బెడదను రూపు మాపాల్సిందేనని సుప్రీం మరోమారు స్పష్టం చేసింది. ఈ విషయంలో రాజీలేదని తెలిపింది. ఇది ప్రజల ప్రాబూల భద్రతకు సంబంధించిన అంశగా పేర్కొంది. బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కలను తొలగించాలంటూ గతంలో జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. గతంలో జారీ చేసిన ఆ ఉత్తర్వులను సవరించాలని చేసిన విజ్ఞప్తిని కూడా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

తరువాయి 2లో



## యుద్ధప్రాతిపదికన పాలమూరు - రంగారెడ్డి భూసేకరణ

- వీలైనంత త్వరగా సేకరణ జరగాలని ఆదేశం
- ప్రజాప్రతినిధులతో ప్రాజెక్టులపై సిఎం రేవంత్ సమీక్ష

**తెలంగాణ కేబినేట్ భేటీ 23కు వాయిదా ?**

**సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో నిర్ణయం**

**23న యాదగిరిగుట్టలో నిర్వహించే యోచన**

**అధికారికంగా ప్రకటించడమే తరువాయి**

హైదరాబాద్ : పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ పక్రియను దగ్గరుండి యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయించాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులు, ప్రజా ప్రతినిధులను ఆదేశించారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని సీఎం చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్డీలో సమావేశమయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి సీఎం కీలక సూచనలు చేశారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

2లో

## పాలమూరు ప్రాజెక్టులపై బిఆర్ఎస్ మోసం

- 90శాతం పూర్తి చేశామని అబద్ధాల ప్రచారం
- గత ప్రభుత్వ నిర్లక్ష్యం అంతాఇంతా కాదు
- మండిపడ్డ మంత్రి జూపల్లి కృష్ణారావు




2




## పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యం

- కెసిఆర్ హయాంలో జరిగిన తప్పులను సరిదిద్దుతాం
- అధికారులతో సమీక్షించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్ : పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దేవాదుల, ఎస్ఎల్‌బీసీ, సీతారామ ప్రాజెక్టులతో సమాన ప్రాధాన్యం ఇస్తామని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో పాలమూరు – రంగారెడ్డి పనులు 90శాతం పూర్తి అయ్యాయన్నది అసత్యమని అన్నారు. బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. భూసేకరణ లేకుండానే టెండర్లు పిలిచారని విమర్శించారు. మంగళవారం సచివాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. పాలమూరుకు కేసీఆర్ హయాంలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతామని చెప్పుకొచ్చారు. జూరాల ప్రాజెక్టులో పూడిక తొలగించి నిల్వ సామర్థ్యం పెంచుతున్నట్లు తెలిపారు. జూరాల అభివృద్ధికి ప్రతిపాదనలు చేశామని వివరించారు. వర్షాకాలానికి ముందే చెరువుల్లో పూడికతీత పనులు చేపడతామని స్పష్టం చేశారు.

తరువాయి 2లో

## విజయ్ ప్రభుత్వం కుప్పకూలడం ఖాయం

- సొంత బలం లేకపోవడమే అతిపెద్ద బలహీనత
- తమిళనాడు మాజీ సిఎం స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు



2లో

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

**ఉద్యోగులు, పెన్షనర్ల కోసం హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు**

**ఈ నెల 31 లోపు పోర్టల్‌లో ఉద్యోగుల వివరాలు నమోదు**

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కొత్తగా ఎంపాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసింది.

2లో




## తెలంగాణలో శాస్త్రీయంగా వ్యర్థాల నిర్వహణ

- సుస్థిర పట్టణాభివృద్ధి, సర్క్యులర్ ఎకానమీ దిశగా చర్యలు
- పక్కాగా ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమం
- బయో ఎరువులు, విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యం
- స్వచ్ఛ భారత్ మిషన్ జాతీయ సమీక్ష సమావేశంలో భట్టి

న్యూఢిల్లీ : తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన తెలంగాణ విజన్–2047 లక్ష్యాలకు అనుగుణంగా భవిష్యత్ అవసరాలకు సరిపోయే విధంగా, సుస్థిరంగా, సమగ్రంగా, పర్యావరణ హితంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి విధానాన్ని అనుసరిస్తోందని, ఇందులో కోర్ అర్బన్ రీజియన్, పెరి అర్బన్ రీజియన్, రూరల్ అగ్రికల్చరల్ రీజియన్‌ల సమతుల్య అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు.

తరువాయి 2లో

## మత్స్యకారులకు ప్రభుత్వం అండ

**మత్స్యకారుల సేవలో' పథకం కింద రూ.262 కోట్లు విడుదల**

**మన తీరంలో మనదే బోటు..మనదే వేట**

**పొరుగు రాష్ట్రాల మత్స్యకారులకు స్థానం లేదు**

**సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టీకరణ**



నెల్లూరు : మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మంగళవారం తుమ్మల పెంటలో 'మత్స్యకారుల సేవలో' పథకం కింద రూ. 262 కోట్ల నిధులను సీఎం విడుదల చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. చరిత్రలో తొలిసారి రూ. 262 కోట్లు మత్స్యకారుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. రూ. 3,256 కోట్లతో 9 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. 'బోటూ మనదే.. వేటా మనదే' అని సీఎం అన్నారు. తీరం మనదే.. బోటు మనదే.. వేటా మనదే.. రాజీలేదు. ఎవరైనా వస్తే రానిచ్చే పరిస్థితి లేదు. భయపడేది లేదు. ఎవరి కోసమో మన జీవనోపాధి కోల్పోవడమేంటి? మన తీరంపై మనకే హక్కులుంటా యన్నారు. పొరుగు రాష్ట్రాలు రావడానికి లేదు. బోటు చొరబడగానే కలెక్టర్‌కు మెసేజ్ వస్తుంది. మెసేజ్ రాగానే అప్రమత్తమవుతాం.. ఎవరినీ రానివ్వం అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

తరువాయి 2లో



## టిడిపికి అండగా మత్స్యకారులు

**అబద్ధాలు చెప్పం... ప్రచారాలు చేసుకోం**

**వ్యవసాయశ్ఖాఖ మంత్రి అచ్చన్నాయుడు**

నెల్లూరు : టీడీపీ స్థాపించిన నాటి నుంచి పార్టీకి, ఎన్టీఆర్, చంద్రబాబుకి ఎన్నెన్నో కష్టాలు వచ్చాయని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం ఇక్కడ మాట్లాడుతూ.. మత్స్యకారులు కుటుంబ సభ్యుల్లా పార్టీతో ఉన్నారని తెలిపారు. టీడీపీ అబద్దాలు చెప్పదని...

2లో



## కులాలు, మతాల మధ్య చిచ్చుతో రాజకీయం

### జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం : వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కులాలు మతాల పేరుతో విభజన రాజకీయాలు చేస్తున్నారని ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ హయాంలో దళితులపై జరిగిన దాడులు మర్చిపోలేనివని చెప్పుకొచ్చారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు చేతిలో హత్యకు గురైన దళితుడు సుబ్రహ్మణ్యం నాల్గోవర్ధంతి మచిలీపట్నం బలరాముని పేటలోని ఎస్సీ కాలనీలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ నాయకులు, కాలనీలోని దళిత ప్రముఖులతో మంత్రి కొల్లు రవీంద్ర సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగన్ హయాంలో ఒక్క దళితులనే కాదని.. బీసీలు, మైనార్టీలు కూడా పెద్దఎత్తున దాడులకు గురయ్యారని మంత్రి కొల్లు రవీంద్ర ప్రస్తావించారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు దగ్గర డ్రైవర్‌గా

2లో

# ఎబోలాపై అప్రమత్తమైన భారత్

ఎబోలా వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. ఎబోలా వ్యాప్తిని




జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం (ఎన్‌సీడీసీ) నిశితంగా గమనిస్తోందని, దేశంలోకి ఈ వ్యాధి ప్రవేశించ కుండా నిఘా పెట్టిందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో ఎబోలా వ్యాప్తి లేనప్పటికీ అంతర్జాతీయ ప్రయాణాలు, ప్రపంచ అనుసంధానం కారణంగా భారత్ అంటువ్యాధుల ముప్పు పట్ల అప్రమత్తంగా ఉండాలని దిల్లీలోని ఎయిమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సంజయ్ రాయ్ హెచ్చరించారు. ప్రస్తుతం దేశానికి ఎబోలా ముప్పు తక్కువగానే ఉందని, ఈ వ్యాధి వ్యాప్తిపై ఆందోళన చెందాల్సి అవసరం లేదని ఆయన సూచించారు.

# వీధికుక్కలను తరలించాల్సిందే

స్కూల్, కాలేజీ, రైల్వే స్టేషన్, బస్టాండ్ తదితర బహిరంగ ప్రదేశాల్లో కుక్కలను తొలగించాలంటూ జంతు ప్రేమికులు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు మంగళవారం విచారించింది. ఈ సందర్భంగా జంతు సంక్షేమ బోర్డు దాఖలు చేసిన అన్ని పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ సందర్భంగా తన తీర్పులో.. పలు కీలక అంశాలను సుప్రీంకోర్టు ప్రస్తావించింది. వీధి కుక్కల సమస్యను జంతు సంక్షేమ అంశంగా కాకుండా ప్రజల ప్రాణాల భద్రతకు సంబంధించిన అంశంగా పరిగణించాలని పిటిషనర్లకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా రూపొందించిన నియమావళిని సమర్థవంతంగా అమలు చేయడం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు సూచించింది. ప్రతి జిల్లాలో కనీసం ఒక పూర్తి స్థాయి యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. జనాభాను దృష్టిలో ఉంచుకొని అవసరమైతే జిల్లాలో ఈ కేంద్రాల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా నిబంధనలు కచ్చితంగా అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రజల భద్రత దృష్టిలో ఉంచుకుని స్కూళ్లు, కాలేజీలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లతోపాటు ఇతర ప్రదేశాల్లో కూడా ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా యాంటీ రేబిస్ మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. రహదారులపై సంచరించే పశువుల సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జాతీయ రహదారులపై తిరిగే జంతువుల సమస్యల పర్యవేక్షణ కోసం ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్‌ఏఐను కోరింది. రేబిస్ బారిన పడిన లేదా మానవుల ప్రాణాలకు ముప్పుగా పరిణమించే ప్రమాదకర కుక్కల విషయంలో చట్టబద్ధంగా అనుమతించిన చర్యలు తీసుకోవచ్చని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాల అమలు కోసం విధులు నిర్వహించే ఉద్యోగులకు తగిన రక్షణ కల్పించాలని ప్రభుత్వాలకు సూచించింది. విధులు నిర్వర్తించే క్రమంలో వారిపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది.

# విజయ్ ప్రభుత్వం కుప్పకూలడం ఖాయం

చెన్నై : ప్రముఖ సినీ నటుడు విజయ్ నేతృత్వంలో కొత్తగా ఏర్పడిన టీవీకే ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చని డీఎంకే అధినేత, మాజీ సీఎం ఎం.కె. స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. విజయ్ ప్రభుత్వం పూర్తిస్థాయి మద్దతు లేక అస్థిరంగా ఉందని, ఎప్పుడైనా కూలిపోయే అవకాశం ఉన్నందున డీఎంకే శ్రేణులు ముందస్తు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. డీఎంకే కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ..ప్రస్తుత ప్రభుత్వం ఏక్షణమైనా కూలిపోవచ్చుఅని, డీఎంకే పార్టీ కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. సొంతంగా 107 సీట్లు సాధించిన టీవీకే మిత్రపక్షమైన కాంగ్రెస్ 5 సీట్లు, సీపీఐ 2, సీపీఎం 2, వీసీకే 2 సీట్లు సాధించిన డీఎంకే మిత్రపక్షాల మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతు ఇస్తున్న తమ మిత్రపక్షాలైన వీసీకే, సీపీఐ, సీపీఎం, ఐయూఎంఎల్ మద్దతు నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నా, లేదా తమిళనాడు స్పీకర్ గానీ, కోర్టులు గానీ రెబెల్ ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేలను చివరికి అనర్హులుగా ప్రకటించినా రాజకీయ అస్థిరత ఏర్పడవచ్చని పేర్కొన్నారు. గతంలో ఎన్నికల పరాజయాల నుండి డీఎంకే ఎలా పుంజుకుందో గుర్తు చేశారు. 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటు మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ ఓటమి తాత్కాలికమైందని, తాము మళ్లీ విజయం సాధిస్తామని కార్యకర్తలకు భరోసానిచ్చారు. తమిళనాడులో సూర్యుడు (డీఎంకే గుర్తు) ఎప్పటికీ అస్తమించడు' అని స్టాలిన్ స్పష్టం చేశారు. ఓటమికి వ్యక్తిగత బాధ్యత తీసుకుంటానని, సోషల్ మీడియాలో పార్టీపై వచ్చే విమర్శలను తిప్పికొట్టాలన్నారు. ఈ విషయంలో టీవీకే చాలా ముందుందని పరోక్షంగా సూచించారు. ఒకప్పుడు మనం టీ దుకాణాల్లో మాట్లాడిన రాజకీయాలను ఇప్పుడు సోషల్ మీడియా వేదికలపై మాట్లాడాలని సూచించారు.

# టిడిపికి అండగా మత్స్యకారులు

ప్రచారాలు చేసుకోదన్నారు. ప్రజలకు ఏమి కావాలో అదే చేస్తుందని స్పష్టం చేశారు. 2014 – 2019 రాష్ట్రానికి, మత్స్యకారులకి స్వర్ణయుగమన్నారు. 2019 ఎన్నికల్లో ఓ దుర్మార్గుడి మాయ మాటలు నమ్మామని.. కులాల్లో చిచ్చుపెట్టారని అన్నారు. చిన్న ఏమరుపాటుతో రాష్ట్రం 25 ఏళ్లు వెనక్కి తీసుకువెళ్లారని విమర్శించారు. ప్రపంచంలో ఏపీని అసహ్యించుకునేలా చేశారని మండిపడ్డారు. చంద్రబాబు మళ్లీ సీఎం అయ్యాక.. పరిశ్రమలు వస్తున్నాయని మంత్రి తెలిపారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి ఎవరు చేశారో ఆలోచించాలన్నారు. వైసీపీ పేరు, ఆ నాయకుడి పేరు చెప్పనని... అవి చెబితే దరిద్రం చుట్టుకుంటుందంటూ వ్యాఖ్యానించారు. ఆ ఐదేళ్లలో ఏ సబ్సీడీలు ఇచ్చారో చెప్పాలని ఛాలెంజ్ విసిరారు. బీమా సొమ్ము, ఆయిల్ సబ్సీడీ డబ్బులు బకాయిలు పెట్టారని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల మర బోట్ల ఆగడాలని పూర్తిగా అరికట్టామని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# లూలు మార్కెట్‌లో పనికిరాని ఆహారపదార్థాలు

## ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులతో బట్టబయలు

హైదరాబాద్,మే19 : నగరంలో కూకట్‌పల్లిలోని లులు హైపర్ మార్కెట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజారోగ్యానికి హాని కలిగించే విధంగా ఉన్న దాదాపు 150 కిలోల ఆహార పదార్థాలను వారు సీజ్ చేశారు. మంగళవారం ఈ హైపర్ మార్కెట్‌లో తనిఖీలు చేపట్టిన అధికారులకు.. పలు ఆహార పదార్థాల్లో పురుగులు ఉండటాన్ని గుర్తించారు. అలాగే నాసిరకం ఆహార పదార్థాలు నిల్వ చేసినట్లు కనుగొన్నారు. కిచెన్ అపరిశుభ్రంగా ఉండడాన్ని అధికారులు గుర్తించారు. పాడై పోయిన కూరగాయలతోపాటు పరిసర ప్రాంతాలలో పురుగులు సంచరిస్తున్నట్లు ఈ తనిఖీల్లో అధికారులు గమనించారు. గడువు సమీపించిన ఆహార పదార్థాలపై తప్పుదారి పట్టించే విధంగా లేబుళ్లు అతికించినట్లు గుర్తించారు. గడువు ముగిసిన ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్‌తో ప్యాక్డ్ ఫుడ్ విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ హైపర్ మార్కెట్ నుంచి బయటకు వెళ్లే డ్రైనేజ్ కూడా మాంసాహార వ్యర్థాలతో మూసుకుపోయినట్లు ఈ తనిఖీల్లో తేలింది. కల్తీ, అధిక కృత్రిమ రంగుల అనుమానంతో పలు ఆహార పదార్థాల నమూనాలను కూడా అధికారులు సేకరించారు.

# తెలంగాణ కేబినేట్ భేటీ 23కు వాయిదా ?

హైదరాబాద్,మే19 : రాజధాని వెలుపల మరోమారు తెలంగాణ కేబినెట్ సమావేశం జరగనుందని సమాచారం. గతంలో మేడారంలో కేబినెట్ నిర్వహించిన సిఎం రేవంత్ రెడ్డి తాజాగా ఇప్పుడు యాదగిరిగుట్టలో కేబినేట్ నిర్వహించేందుకు ఆదేశంచినట్లు తెలుస్తోంది. ఈ నెల 21 జరగాల్సిన కేబినేట్ సమావేశాన్ని 23న నిర్వహించాలని, అదికూడా యాదాద్రిలో నిర్వహించనున్నట్లు సమాచారం. 21 నుంచి సరస్వతీ అంత్య పుష్కరాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాజకీయాలు, పాలనా నిర్ణయాల్లో ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహణ అత్యంత ఆసక్తికరంగా మారింది. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం కాకుండా, కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేసే యోచనలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి ప్రధాన కారణం ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసరలో ప్రారంభం కానున్న 'సరస్వతి అంత్య పుష్కరాలు' కావడం గమనార్హం. అదే సమయంలో, ఈ కేబినెట్ భేటీని కేవలం వాయిదా వేయడమే కాకుండా, హైదరాబాద్ వెలుపల మరో ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టలో నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు సమాచారం. 'బాసర సరస్వతి అంత్య పుష్కరాలు' ఈ నెల 21వ తేదీన ప్రారంభం కానున్నాయి. గోదావరి నది తీరాన వెలసిన బాసర క్షేత్రంలో జరిగే ఈ అంత్య పుష్కరాలకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ చరిత్రాత్మక వేడుకకు రాష్ట్ర మంత్రివర్గంలోని మెజార్టీ మంత్రులు హాజరు కానున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం, పుష్కరాల పనులను పర్యవేక్షించడం మంత్రులకు విధిగా మారింది. మంత్రులంతా పుష్కరాల పనుల్లో, అధికారిక పర్యటనల్లో నిమగ్నమవ్వడం, బాసరకు వెళ్లనుండటంతో.. అదే రోజు నిర్వహించాలనుకున్న కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేయడమే ఉత్తమమని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. దీంతో ఈ నెల 23వ తేదీన ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట లో కేబినెట్ సమావేశాన్ని నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి యోచిస్తున్నారు. రాజధాని హైదరాబాద్‌లోని సచివాలయానికే పరిమితం కాకుండా, ప్రజలకు, పుణ్యక్షేత్రాలకు దగ్గరగా పాలనను తీసుకెళ్లాలనే ఆలోచనలో భాగంగానే ఈ వ్యూహాన్ని రచిస్తున్నారు. యాదగిరి లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్న ఈ పవిత్ర క్షేత్రంలో కేబినెట్ భేటీ నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మిక, రాజకీయ సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లవచ్చని సీఎం భావిస్తున్నారు. గతంలో ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన సమ్మక్క – సారలమ్మ జాతర సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గ సహచరులతో కలిసి మేడారంలో కేబినెట్ సమావేశాన్ని నిర్వహించారు. అక్కడికక్కడే జాతర ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలు, నిధుల విడుదలపై కీలక నిర్ణయాలు తీసుకుని రికార్డు సృష్టించారు. ఇప్పుడు అదే తరహా వ్యూహాన్ని యాదగిరిగుట్ట లోనూ అమలు చేయాలని చూస్తున్నారు. దీనివల్ల స్థానిక సమస్యలపై తక్షణమే స్పందించే అవకాశం లభిస్తుందని నమ్ముతున్నారు. బాసర అంత్య పుష్కరాల కారణంగా ఈ నెల 21న జరగాల్సిన కేబినెట్ వాయిదా పడటం, దానిని ఈ నెల 23న యాదగిరిగుట్టకు మార్చాలని యోచించడం అందులో భాగమే. అయితే ఈ మార్పుపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

ఈ కొత్త హెల్త్ స్కీమ్ అమల్లో భాగంగా రాష్ట్ర ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అన్ని ప్రభుత్వ శాఖలకు అత్యవసర ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకం ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు వైద్య భద్రత కల్పించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది. ఉద్యోగుల ఆరోగ్య సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించింది. ఫైనాన్స్ శాఖ సూచనల ప్రకారం ప్రతి ఉద్యోగి, పెన్షనర్ తమ కుటుంబ సభ్యుల వివరాలతో సహా పూర్తి డేటాను తప్పనిసరిగా సమర్పించాలి. భార్య, భర్త, పిల్లలు, ఆధారపడిన కుటుంబ సభ్యుల వివరాలు కూడా నమోదు చేయాలని స్పష్టం చేసింది. ఈ సమాచారం భవిష్యత్తులో ఆరోగ్య సేవలు, క్యాష్‌లెస్ చికిత్స వంటి ప్రయోజనాల అమలుకు ఉపయోగ పడనుంది. అన్ని శాఖల అధికారులు ఉద్యోగుల వివరాలను పోర్టల్‌లో మే 31వ తేదీలోపు అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. నిర్ణీత గడువులోపు సమాచారం నమోదు చేయని పక్షంలో భవిష్యత్తులో ఆరోగ్య పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య భద్రతను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అమల్లో ఉన్న వైద్య పథకాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించి, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కొత్త విధానాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త హెల్త్ స్కీమ్‌తో ఉద్యోగులు, పెన్షనర్లు అత్యవసర వైద్య సేవలను సులభంగా పొందుతారని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాయి. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# పాలమూరు ప్రాజెక్టులపై బిఆర్ఎస్ మోసం

హైదరాబాద్ : బీఆర్ఎస్ నేతలకు పాలమూరు ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. 2015లో అప్పటి సీఎం కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని... రెండేళ్లలో పూర్తి చేస్తామన్నారని గుర్తు చేశారు. లక్ష కోట్ల ప్రాజెక్టును పదేళ్లలో రూ.25 వేల కోట్లు మాత్రమే ఖర్చు పెడితే 90 శాతం ఎలా పూర్తి అయినట్లు అని ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టు తర్వాత మొదలుపెట్టిన కాళేశ్వరం ప్రాజెక్టును లక్ష కోట్లు ఖర్చు చేసి ఎలా పూర్తి చేశారని నిలదీశారు. పాలమూరు ప్రాజెక్టులపై గత ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. గట్టు, కల్వకుర్తి, జూరాల, కోయిల్ సాగర్, భీమా అన్ని ప్రాజెక్టుల విషయంలో పక్షపాతం చూపారని మంత్రి మండిపడ్డారు. కల్వకుర్తి పంపులు బాగు చేయలేకపోయారన్నారు. పాలమూరు ప్రాజెక్టు నీటి కేటాయింపులు సాధించలేకపోయారని తెలిపారు. కృష్ణా నీటిని పదేళ్లు ఏపీకి తాకట్టు పెట్టారని ఆరోపించారు. రాయలసీమను రతనాల సీమ చేస్తామని చెప్పింది బీఆర్ఎస్ కాదా అని ప్రశ్నించారు. గద్వాల్‌లోని ర్యాలంపాడు రిజర్వాయర్‌ను పదేళ్లలో రిస్టోర్ చేయలేదన్నారు. పాలమూరు ప్రాజెక్టుల విషయంలో సీఎం రేవంత్ రెడ్డితో స్వయంగా ఎమ్మెల్యేలు, మంత్రులు కలిసి చర్చించామని చెప్పారు. సీఎం కూడా పాలమూరు వాసి కాబట్టి.. ప్రాజెక్టుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టామని, పనులను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కల్వకుర్తి కింద చేపట్టనున్న గొల్లపల్లి రిజర్వాయర్‌ను చేపట్టవద్దని బీఆర్ఎస్ నేతలు ఆందోళనలు చేస్తున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు.

# తెలంగాణలో శాస్త్రీయంగా వ్యర్థాల నిర్వహణ

ఘన వ్యర్థాల నిర్వహణ అనేది ఇకపై కేవలం చెత్త సేకరణకు పరిమితం కాదని, అది వాతావరణ మార్పులకు ప్రతిస్పందన, పర్యావరణ సుస్థిరత, సర్క్యులర్ ఎకానమీ, ఉపాధి కల్పన, ఆర్థిక ఉత్పాదకతలతో నేరుగా అనుసంధానమై ఉందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పట్టణ పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అధ్యక్షతన ప్రారంభమైన రెండు రోజుల 'స్వచ్ఛ భారత్ మిషన్–అర్బన్ 2.0' జాతీయ సమీక్ష సమావేశానికి తెలంగాణ రాష్ట్రం తరఫున ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు హాజరయ్యారు. మొదటి రోజు సమావేశంలో దేశంలోని పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, వ్యర్థాల శాస్త్రీయ ప్రాసెసింగ్, పాత చెత్త కుప్పల తొలగింపు, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, పీపీపీ విధానాలు, కొత్త ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. రాష్ట్రాలు, నగరాలు అమలు చేస్తున్న అనుభవాలు, ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకోవడంపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ విధానాలు, సుస్థిర పట్టణాభివృద్ధి చర్యలు, స్వచ్ఛత కార్యక్రమాలు, సర్క్యులర్ ఎకానమీ దిశగా చేపడుతున్న కార్యక్రమాలను ఉప ముఖ్యమంత్రి సమావేశంలో వివరించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకు వచ్చిన ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు–2026 దేశంలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలో కీలక మార్పుకు దారితీస్తున్నాయని తెలిపారు. కొత్త నిబంధనలు సంప్రదాయ చెత్త సేకరణ, డంపింగ్ విధానాలకే పరిమితం కాకుండా, 4–వే సోర్స్ సెగ్రిగేషన్, వికేంద్రీకృత వ్యర్థాల ప్రాసెసింగ్, పాత డంప్‌యార్డుల శాస్త్రీయ శుద్ధి, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ, సర్క్యులర్ ఎకానమీ, వార్డు స్థాయి బాధ్యత, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఈ దిశగా నిబంధనలు అమలులోకి రాకముందే పలు చర్యలు ప్రారంభించిందని వివరించారు. రాష్ట్రంలోని కోర్ అర్బన్ ప్రాంతాల్లో దాదాపు 9,596 ఎలక్ట్రిక్ స్వచ్ఛ ఆటో టిప్పర్లను ప్రవేశపెట్టే ప్రక్రియను తెలంగాణ ప్రభుత్వం చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఈ వాహనాల ద్వారా మున్సిపల్ కార్యకలాపాల్లో కార్బన్ ఉద్గారాలు తగ్గడంతో పాటు, శుభ్రమైన రవాణా విధానానికి మార్గం సుగమం అవుతుందని అన్నారు. వీటిని 4–వే సోర్స్ సెగ్రిగేషన్‌కు అనుగుణంగా విభజిత చెత్త నిల్వ స్థలాలతో రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఖీఖీ కోడ్ ఆధారిత పర్యవేక్షణ ద్వారా ఇంటింటి చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం వికేంద్రీకృత, పంపిణీ ఆధారిత వ్యర్థాల ప్రాసెసింగ్ వ్యవస్థలకు ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తడి చెత్తను ఉత్పత్తి అయిన ప్రాంతాల సమీపంలోనే ప్రాసెస్ చేయడం, పొడి చెత్తను శాస్త్రీయంగా వేరు చేసి రీసైక్లింగ్ మరియు సర్క్యులర్ ఎకానమీ వ్యవస్థల్లోకి తీసుకురావడం, ల్యాండ్‌ఫిల్ ప్రాంతాలకు కనిష్ట వ్యర్థాలు మాత్రమే చేరేలా చేయడం ప్రభుత్వ విధానమని వివరించారు. తడి చెత్తను నగరాల్లో దూర ప్రాంతాలకు తరలించడం వ్యయభారంతో కూడుకున్నదిగా ఉండటమే కాకుండా, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా కూడా సుస్థిర విధానం కాదని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.అందుకే వికేంద్రీకృత తడి చెత్త ప్రాసెసింగ్ కేంద్రాల ద్వారా స్థానిక స్థాయిలోనే వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. డంప్‌యార్డుల శాస్త్రీయ శుద్ధి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిన అంశమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ డంప్ యార్డ్ విషయంలో ఐఐటీ బాంబే సాంకేతిక సహకారం, సలహా సేవలను పొందుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. దీని లక్ష్యం మొక్కుబడి చర్యలకే పరిమితం కాకుండా, దీర్ఘకాలిక పర్యావరణ నిర్వహణ వ్యూహాన్ని రూపొందించడం, నిరంతర పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడమని పేర్కొన్నారు. అలాగే ఆటోనగర్ డంప్ సైట్‌లో సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 22 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను బయోమైనింగ్ ద్వారా ప్రాసెస్ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 30 శాతం వ్యర్థాలు ప్రాసెస్ అయ్యాయని వివరించారు. స్వాధీనం చేసుకున్న భూమిని మళ్లీ డంపింగ్ కోసం కాకుండా, భవిష్యత్తులో పార్కులు, క్రీడా సదుపాయాలు, ప్రజా వినియోగ మౌలిక సదుపాయాలుగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన?ప్రగతి ప్రణాళిక కింద పట్టణ స్థానిక సంస్థలు, జిల్లా యంత్రాంగాలు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత స్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. కార్యక్రమాలు విడివిడిగా చేపట్టిన పారిశుద్ధ్య చర్యలు కాదని, తెలంగాణ విజన్?2047కు అనుగుణంగా పట్టణాల సమ్మిళిత అభివృద్ధికి దోహదపడే సమగ్ర కార్యాచరణలో భాగమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. 2047 నాటికి భారత్‌ను 30?35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్య సాధనలో, తెలంగాణ రాష్ట్రం తన 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ సహా జాతీయ పరిశుభ్రత, పట్టణ పారిశుద్ధ్య ర్యాంకింగ్స్‌లో తెలంగాణ రాష్ట్రం నిరంతరం మెరుగైన ప్రదర్శన కనబరుస్తోందని, ఇది పౌరులు, పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక సంస్థలు, ప్రభుత్వం కలిసి చేస్తున్న కృషికి నిదర్శనమని తెలిపారు. పరిశుభ్రత అనేది కేవలం నగరాల రూపురేఖలకు సంబంధించిన విషయం మాత్రమే కాదని, అది ప్రజారోగ్యం, మానవ గౌరవం, జీవన ప్రమాణాలతో ముడిపడి ఉందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. వ్యర్థాల నిర్వహణను పారిశుద్ధ్య కార్యక్రమంగా మాత్రమే కాకుండా, ఆర్థిక విలువ సృష్టించే ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. పరిశుభ్రత ప్రజల జీవనశైలిలో భాగం కావాలంటే చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జపాన్ తరహాలో మొదటి తరగతి నుంచే పాఠశాలల్లో పరిశుభ్రత, వ్యర్థాల వేర్పాటు, పర్యావరణ బాధ్యత వంటి అంశాలను ఆచరణాత్మకంగా బోధించే అంశాన్ని అన్ని రాష్ట్రాలు పరిశీలించాలని ఆయన సూచించారు. ప్రజలు, స్థానిక సంస్థలు, పారిశుద్ధ్య కార్మికులు, పరిశ్రమ భాగస్వాములు, వివిధ సంస్థల సహకారంతో తెలంగాణ సుస్థిర పట్టణ నిర్వహణ, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ, సర్క్యులర్ ఎకానమీ అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విశ్వాసం వ్యక్తం చేశారు. సమావేశంలో పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోఖన్ సాహు, కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి శ్రీనివాస్ కటికితల,స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్ రూపా మిశ్రా లతో సహా సంబంధిత కేంద్ర ప్రభుత్వ అధికారులు, తెలంగాణ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ముఖ్యమంత్రి కార్యదర్శి మానిక్ రాజ్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో పాటు వివిధ రాష్ట్రాల పట్టణాభివృద్ధి శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# యుద్ధప్రాతిపదికన పాలమూరు - రంగారెడ్డి భూసేకరణ

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ భేటీలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాకేశ్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు ప్రభుత్వం అండ

మత్స్యకారులకు ఎల్లప్పుడూ ఈ ప్రభుత్వం అండగా ఉంటుంది. వేట నిషేధ సమయంలో రూ.20 వేలు ఆర్థిక భరోసా ఇస్తున్నాం. చరిత్రలో తొలిసారిగా రూ.260 కోట్లు మత్స్యకారుల ఖాతాల్లో వేశాం. గతేడాది 1,21,433 కుటుంబాలకు రూ.243 కోట్ల సాయం అందించాం.ఇవాళ 1,30,796 కుటుంబాలకు రూ.262 కోట్ల ఆర్థిక సాయం అందించాం. 2014–19లో మత్స్యసంపద ఉత్పత్తి 19.18శాతం పెరిగింది. కానీ, వైకాపా హయాంలో నాలుగు రెట్లు పడిపోయింది. వ్యవసాయం, నిర్మాణ రంగం తర్వాత.. మత్స్య సంపదపైనే ఎక్కువ మంది ఆధారపడ్డారు. దేశంలో రొయ్యల ఉత్పత్తిలో 80శాతం ఏపీ నుంచే ప్రపంచానికి ఎగుమతి అవుతున్నాయి. సముద్రపు నీటితో సీవీడ్ కల్చర్ చేస్తే డబ్బులే.. డబ్బులు. మగవాళ్లు వేటకు వెళ్తే.. మహిళలు సీవీడ్ పండించాలి. మహిళలకు ఆదాయం పెంచే మార్గాలు సూచిస్తున్నా.. పాటించండి. మత్స్యకారుల జీవితాలు మెరుగుపడాలి. వారి జీవితాల్లో వెలుగు నింపే బాధ్యత ఈ ప్రభుత్వానిదని సీఎం అన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులకు ఇబ్బందులు ఉండవన్నారు. జువ్వలదిన్నె హార్బర్‌ను త్వరలో పూర్తి చేస్తామని వెల్లడించారు. 'జువ్వలదిన్నె హార్బర్ మీ సొంతం.. నకిలీ ప్రచారాలు నమ్మొద్దన్నారు. చేపలు తింటే డయాబెటిస్ రాదన్నారు. 'మీ చేపల ఉత్పత్తులకు మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తా' అని అన్నారు. 200 మెకనైజ్డ్ బోట్ల మంజూరుతో పాటు రాయితీ ఇస్తామన్నారు. ఆక్వాను ఎక్కువ చేయాలని సీఎం పేర్కొన్నారు. వైసీపీ హయాంలో మత్స్యకారుల సాయాన్ని రూపాయి కూడా పెంచలేదని సీఎం విమర్శించారు. 2019–24 మధ్య జగన్ విధ్వంసకర పాలన చేశారని మండిపడ్డారు. 18 నెలల్లో తిరుపతి నుంచి బుల్లెట్ వాహనాలు తయారీ మొదలవనుందని తెలిపారు. ప్రస్తుతం స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ మాట్లాడుతున్నట్లు వెల్లడించారు. టీడీపీ డీఎన్ఏలో బీసీలు ఉన్నారని.. మనది తిరుగులేని అనుబంధమని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. పరిశ్రమలు, అభివృద్ధిని గొడ్డలి పార్టీ ఓర్వలేకపోతోందన్నారు. సాగర్ డిఫెన్స్ ప్రాజెక్ట్‌పై దుష్ప్రచారం చేస్తోందని అన్నారు. సాగర్ డిఫెన్స్ ప్రాజెక్ట్‌లో స్థానికులకే ఉద్యోగాలు అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, ఫరూఖ్ తదితరులు పాల్గొన్నారు.

# కులాలు, మతాల మధ్య చిచ్చుతో రాజకీయం

పనిచేసిన దళితుడు సుబ్రహ్మణ్యంను చంపి శవాన్ని డోర్ డెలివరీ చేశారని ధ్వజమెత్తారు.నాడు ఆ కేసును తారుమారు చేసేందుకు జగన్ అనేక ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ కేసును నిష్పక్షపాతంగా విచారిస్తుంటే సాక్షులను ట్యాంపర్ చేసే ప్రయత్నాలు చేశారని చెప్పుకొచ్చారు. మాస్క్ అడిగిన పాపానికి డా. సుధాకర్‌ని పిచ్చోడిని చేసి చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. శాండ్‌లో అవినీతి జరుగుతోందని ప్రశ్నించిన ఓం ప్రకాష్‌ను ఉరివేసి చంపేశారని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు స్వేచ్ఛ వచ్చిందని తెలిపారు. జగన్ హయాంలో హత్యకు గురైన బీసీ సోదరుడు తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించామని అన్నారు. నేడు మళ్లీ జగన్ కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహించారు. అధికారులకు కులాలు అంటగట్టి దూషిస్తున్నారని మండిపడ్డారు. రోడ్డు ప్రమాదంలో ఓ పాస్టర్ చనిపోతే రాజకీయం చేయాలని చూశారని... వీటన్నింటినీ ప్రజలు గమనించాలని కోరారు. అన్నివర్గాలు సంఘటితమై ముందుకు సాగాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.

# పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యం

పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేస్తామని తెలిపారు. 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. 1226 గ్రామాలకు తాగునీరు అందిస్తామని తెలిపారు. 15 రోజుల్లో మరోసారి ప్రగతి సమీక్ష నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు. ఆయా ప్రాజెక్టుల పురోగతిపై సమగ్ర నివేదికలు ఇవ్వాలని అధికారులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

# కవాడీగూడాలో దారుణ ఘటన

### స్పా సెంటర్‌లో భార్యను హత్య చేసిన భర్త

హైదరాబాద్,మే19 : గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కవాడిగూడలో కట్టుకున్న భార్యను భర్త అతి కిరాతకంగా చంపేశాడు. గొడవ పడి స్పా సెంటర్‌కు వచ్చిన భార్యపై భర్త కత్తితో దాడి చేసి హత్య చేశాడు. అనంతరం నిందితుడు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. బంగి దేబోరా అనే మహిళ తన భర్తతో కలిసి బహదూర్‌పూర్ కిషన్‌బాగ్‌లో నివసిస్తోంది. కవాడిగూడలోని స్పా సెంటర్‌లో మృతురాలు బ్యూటీషియన్‌గా పనిచేస్తోంది. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి.మంగళవారం ఉదయం కూడా భర్తతో గొడవపడిన దేబోరా.. విధుల కోసం స్పా సెంటర్‌కు వెళ్లింది. భార్య గొడవపడటంతో ఆగ్రహానికి గురైన భర్త.. కవాడిగూడ రత్నదీప్ బిల్డింగ్‌లోని నాలుగో అంతస్తులో ఉన్న స్పా సెంటర్‌కు వెళ్లాడు. తన వెంట తెచ్చుకున్న కత్తితో భార్యపై విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన మహిళ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. హత్య అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఆపై అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. హత్యపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలికి చేరుకుని బంగి దేబోరా మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## మంటలు చెలరేగి కారు దగ్ధం

అదిలాబాద్,మే19 : అదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని రహదారిపై మంగళవారం కారు అగ్నికి ఆహుతైంది. అదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన స్థానికులు కారులో ఉన్న ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకురావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అనంతరం మంటలు వేగంగా వ్యాపించి కారు పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

# మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు

### మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి

కామారెడ్డి,మే19 : కామారెడ్డి పట్టణంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాల క్రితం కామారెడ్డి నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా, వర్షాకాలం మినహా మిగిలిన అన్ని కాలనీల్లోనూ నీటి ఎద్దడి ఏర్పడేదని అన్నారు. ఆ రోజుల్లో ప్రజలు ఖాళీ బిందెలతో రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపే వారని చెప్పారు.ఈ నీటి సమస్యను శాశ్వతంగా తీర్చడమే తమ ధ్యేయంగా ముందుకెళ్తున్నట్లు చెప్పారు. కామారెడ్డి పట్టణానికి 10 వాటర్ ట్యాంకులు ఉన్నాయని, అమృత్ 2.0 పథకంలో భాగంగా 9 వాటర్ ట్యాంకులు పూర్తయ్యాయని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, డీఈ హనుమంతరావు, ఏఈ వినోద్, కౌన్సిలర్లు వాజిద్, జావేద్, అంజద్, బబ్లు, నాయకులు, కాళ్ల గణెలిష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఐకేపీ వీవోఏలకు కనీస వేతనాలు ఇవ్వాలి

### సమ్మె నోటీస్ ఇచ్చిన వివోఏలు

కామారెడ్డి,మే19 : తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఐకేపీ వీవోఏలకు కనీస వేతనాలు అందించాలని సిరికొండ మండల సమైఖ్య ఆధ్వర్యంలో ఏపీఎం సువర్ణకు, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్లలో మంగళవారం వీవోఏలు సమ్మె నోటీసులు అందజేశారు. ఐకేపీ వవీవోఏలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీని వర్తింపజేయాలని, అర్హులైన వీవోఏలను గుర్తించి సీసీలుగా పదోన్నతి కల్పించాలని, రూ.20 లక్షల బీమా వర్తింపజేయాలని, గ్రామాల్లో ఉచిత ట్యాబ్ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని, ఐడి కార్డు అందజేయాలని, జీవో నెంబర్ 58 సవరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే దశలవారీగా సమ్మెకు దిగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మున్ సింగ్, జ్యోతి, సీహెచ్ లక్ష్మి, ఎస్ లక్ష్మి, సునీత, సారా, లావణ్య, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి కోసం మహిళకు వేధింపులు

### కాంగ్రెస్ నేతపై పోలీసుల కేసు నమోదు

కామారెడ్డి,మే19 : ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తానని నమ్మబలికి, దానికి ప్రతిఫలంగా తన కోరిక తీర్చాలంటూ ఓ మహిళను వేధించిన ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితురాలు ఫిర్యాదు మేరకు రాజంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం రాజంపేట మండల కేంద్రం చెందిన ఒక మహిళకు ఇందిరమ్మ ఇండ్లు కావాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన సదరు నాయకుడిని సంప్రదించింది. అయితే ఇల్లు మంజూరు చేయాలంటే తన కోరిక తీర్చాలని, తనకు లొంగిపోవాలని అతడు ఆమెను తీవ్రంగా వేధించడం ప్రారంభించాడు. బాధితురాలి రాతపూర్వక ఫిర్యాదు మేరకు సదరు కాంగ్రెస్ నాయకుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో మహిళపై అసభ్యంగా ప్రవర్తించినందుకు, పలువురిని డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణ రావడంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన బెస్ట్ చంద్రంను పార్టీ అధిష్టానం మేరకు వాటి నుండి సస్పెండ్ చేశామని రాజంపేట మండల అధ్యక్షుడు కృష్ణారావు తెలిపారు.

# డిజిటలైజేషన్‌తో మారుతున్న జర్నలిజం

### ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

### ఆధునికి సాంకేతికతపై జర్నలిస్టులకు శిక్షణ

### మీడియా అకాడమీ చర్చలో సీనియర్ జర్నలిస్టుల వెల్లడి



హైదరాబాద్,మే19 : నేటి డిజిటల్ యుగంలో జర్నలిజం రంగం వేగంగా మారుతున్న నేపథ్యంలో మీడియా వృత్తిదారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ముందుకు సాగాలని పలువురు సీనియర్ జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. తెలంగాణ, మీడియా అకాడమీ, చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నాంపల్లిలోని మీడియా అకాడమీ భవనంలో మంగళవారం నిర్వహించిన జర్నలిస్టుల చర్చా కార్యక్రమంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు, అకాడమికి అనుబంధ సభ్యులు పాల్గొని మీడియా రంగ భవిష్యత్ దిశ, డిజిటలైజేషన్, మీడియా చట్టాలు, శిక్షణ కార్యక్రమాలు, జర్నలిస్టుల సంక్షేమ అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సమాచార,పౌర సంబంధాల శాఖ ప్రత్యేక ప్రధాన కమిషనర్ జి. ముకుంద్ రెడ్డి, కార్యక్రమంలో పాల్గొని జర్నలిస్టులను అభినందించారు. జర్నలిజం డిగ్రీ చదివే రోజుల్లో పత్రికల ఎడిటోరియల్స్ చదవడం ద్వారా సివిల్ సర్వీసులపై ఆసక్తి పెరిగిందని, అదే తన విజయానికి పునాది అయిందని తెలిపారు. నేడు మీ అందరి ముందుకు రావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. సమావేశంలో ఐ. వెంకట్ రావు మాట్లాడుతూ మీడియా అకాడమీ చేపడుతున్న కార్యక్రమాలను అభినందిస్తూ మరిన్ని పుస్తకాలను అకాడమీకి అందజేస్తానని తెలిపారు.మాజీ ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్ మాట్లాడుతూ జర్నలిజం తనకు ధైర్యం, గుర్తింపు ఇచ్చిందని పేర్కొంటూ అకాడమీకి కృతజ్ఞతలు తెలిపారు. ఉడుముల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక జర్నలిజానికి అనుగుణంగా అకాడమీ డిజిటల్ క్లాసులు, ఇంక్యుబేటర్ ఏర్పాటు చేయాలని, గ్యాగ్ ఆర్డర్ వంటి అంశాలపై చర్చలు నిర్వహించాలని సూచించారు. దేవులపల్లి అమర్ మాట్లాడుతూ 16 మంది వెటరన్ జర్నలిస్టుల వీడియోలను పుస్తకాల రూపంలో తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు సభ్యులు మీడియా రంగంలో కృత్రిమ మేధస్సు ప్రభావం పెరుగుతోందని, జర్నలిస్టులు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఆధునిక శిక్షణా కార్యక్రమాలు, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాములు, డెస్క్ జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణలు నిర్వహించాల్సిన అవసరం ఉందని సూచించారు. అకాడమీ భవనంలోని డిజిటల్ సదుపాయాలు, ఆధునిక ఆడిటోరియం, బోర్డు రూమ్, లైబ్రరీ, కంప్యూటర్ రూమ్ వంటి వసతులను మరింత సమర్థవంతంగా వినియోగించి జర్నలిస్టులకు ప్రయోజనం కలిగించాలని అభిప్రాయపడ్డారు. పాత పత్రికలు, అరుదైన పుస్తకాలు, నిజాం కాలం నాటి ప్రచురణలు, తెలుగు గ్రంథాలు తదితరాలను డిజిటలైజ్ చేసి భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. పలువురు సీనియర్ జర్నలిస్టులు తమ వద్దనున్న విలువైన పుస్తకాలను మీడియా అకాడమీ లైబ్రరీకి విరాళంగా అందిస్తామని తెలిపారు. సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ మీడియా చట్టాలలో కాలానుగుణ మార్పులు అవసరమని, సోషల్ మీడియాకు ప్రత్యేక ప్రవర్తనా నియమావళి తీసుకురావాలని పేర్కొన్నారు. మహిళా జర్నలిస్టులు మరియు గ్రామీణ ప్రాంత జర్నలిస్టుల కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జర్నలిజం అనేది సమాజానికి అద్దం పట్టే వృత్తి అని, భయపడకుండా నిజాయితీతో వార్తలను ప్రజలకు అందించాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. మీడియా అకాడమీ 1996 నుండి జర్నలిస్టుల అభివృద్ధికి విశేష సేవలు అందిస్తోందని, పుస్తక ప్రచురణలు, మోనోగ్రాఫ్‌లు, శిక్షణా కార్యక్రమాలు మీడియా రంగానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని అభినందించారు. చర్చా కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు శ్రీ కె. రాంచందర్ మూర్తి, కేశవరావు దాసు, ఎస్. నాగేష్ కుమార్, డి. అమర్, బండారు శ్రీనివాస్ రావు, రవీందర్ ఎం.పీ., దిలీప్ రెడ్డి, మాడభూషి శ్రీధర్, ఎం. సుబ్బారావు, జగన్, ఆర్.వి. రామారావు, ఎస్. వినయ్ కుమార్, వై. నరేందర్ రెడ్డి, విరాహత్ అలీ తదితరులు పాల్గొని మీడియా రంగంలో వస్తున్న మార్పులు, డిజిటలైజేషన్, జర్నలిస్టుల శిక్షణ, మీడియా చట్టాలు, సోషల్ మీడియా ప్రభావం, పుస్తక ప్రచురణలు, అకాడమీ భవిష్యత్ కార్యాచరణపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ చేపడుతున్న కార్యక్రమాలను పలువురు ప్రశంసించారు. జర్నలిస్టుల సంక్షేమం, శిక్షణ, డిజిటలైజేషన్, మీడియా ఆధునీకరణ దిశగా అకాడమీ మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన ప్రముఖులందరిని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు శాలువాలతో సీనియర్ జర్నలిస్టులను సత్కరించారు.

# కరీంనగర్ పిఎంజె దొంగతనం కేసు

### ధర్మపురిలో దొంగలు బసచేసిన లాడ్జి సీజ్

కరీంగనర్,మే19 : కరీంనగర్‌లోని పీఎంజే నగల దుకాణం దొంగతనం కేసు ధర్మపురిలో మరో కీలక అంశాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. దొంగతనానికి పాల్పడ్డ నిందితులు ఈ నెల 1 నుండి 3న ఉదయం 6 గంటల వరకు ధర్మపురిలో బస చేసిన విజయలక్ష్మి లాడ్జ్‌ను ఉన్నతాధికారుల ఆదేశాలతో మున్సిపల్, పోలీస్ శాఖలు సంయుక్తంగా సీజ్ చేసారు. ఇంతకాలం ఈ లాడ్జ్ నిబంధనలు ఉల్లంఘిస్తూ నడుస్తుంటే అధికారులకు కనిపించలేదా..? దొంగలు బస చేసిన తర్వాతే అక్రమాలు గుర్తొచ్చాయా..? ధర్మపురి వంటి ఆధ్యాత్మిక క్షేత్రంలో ప్రతీ రోజు వందలాది మంది భక్తులు, యాత్రికులు బస చేస్తుంటారు. అలాంటి ప్రాంతంలో వసతి గృహాలు నిబంధనల ప్రకారం నడుస్తున్నాయా..? అతిథుల పూర్తి వివరాలు నమోదు చేస్తున్నారా..? సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా..? పోలీస్ వెరిఫికేషన్ జరుగుతోందా..? వంటి అంశాలపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ ఉండాలని అంటున్నారు. కానీ ఘటన జరిగిన తర్వాత మాత్రమే అధికార యంత్రాంగం ఒక్కసారిగా కదలికలోకి రావడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఒక లాడ్జ్‌ను సీజ్ చేయడం ద్వారా సమస్య పరిష్కారం కాదని పలువురు పేర్కొంటున్నారు. ధర్మపురిలో అనుమతులు లేకుండా, సరైన భద్రతా ప్రమాణాలు పాటించకుండా నడుస్తున్న ఇతర వసతి గృహాల పరిస్థితి ఏంటని పలవురు ప్రశ్నిస్తున్నారు. దొంగలు రెండు రోజుల పాటు బస చేసినా ఎవరూ అనుమానం వ్యక్తం చేయకపోవడం, వారి కదలికలపై సరైన నిఘా లేకపోవడం భద్రతా వ్యవస్థల వైఫల్యానికే సంకేతంగా కనిపిస్తోంది. ఒక సంఘటన తర్వాత తాత్కాలిక హడావిడి చేయడం కంటే, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వ్యవస్థను బలోపేతం చేయడమే ముఖ్యమని ప్రజలు సూచిస్తున్నారు. ధర్మపురి ప్రతిష్ఠ, భక్తుల భద్రత దృష్ట్యా ఇప్పుడు అవసరమైంది ఒక్క లాడ్జ్‌పై చర్య కాదని కఠినమైన సమీక్ష నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

# యూజిసి నెట్ దరఖాస్తులకు నేడే చివరి రోజు

### దరఖాస్తు చేయని వారు ఆన్‌లైన్‌లో చేసుకునే అవకాశం

న్యూఢిల్లీ,మే19 : యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ 2026 పరీక్షలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కీలక హెచ్చరిక జారీ చేసింది. జూన్ 2026 సెషన్‌కు సంబంధించిన ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రక్రియ మే 20తో ముగియనున్నట్లు వెల్లడించింది. ఇంకా దరఖాస్తు చేయని అభ్యర్థులు వెంటనే అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి అప్లై చేయాలని సూచించింది. యూజీసీ నెట్ 2026 పరీక్షలు జూన్ 22 నుంచి 30 వరకు కంప్యూటర్- బేస్డ్ టెస్ట్ మోడ్‌లో జరగనున్నాయి. మొత్తం 85 స్జబెక్టులకు ఈ పరీక్ష జరుగుతుంది. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత, అలాగే పీహెచ్‌డీ అడ్మిషన్లకు ఈ పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుంది. అభ్యర్థులు దరఖాస్తు నింపి, ఫీజు చెల్లించిన తర్వాత తప్పనిసరిగా కన్ఫర్మేషన్ పేజ్‌ను డౌన్‌లోడ్ చేసుకుని భద్రపరచుకోవాలని ఎన్‌టీఏ సూచించింది. ఫీజు చెల్లింపు తర్వాత మాత్రమే దరఖాస్తు పూర్తి అయినట్లుగా పరిగణిస్తామని స్పష్టం చేసింది. పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు మే 20 చివరి తేదీ. మే 22 నుంచి మే 24 వరకు సవరణలు చేసుకునే వీలుంటుంది. ఈ సమయంలో అభ్యర్థులు తమ దరఖాస్తులోని వివరాలను సవరించుకునే అవకాశం ఉంటుంది. అడ్మిట్ కార్డులు జూన్ 15న విడుదలయ్యే అవకాశం ఉందని ఎన్‌టీఏ తెలిపింది. పరీక్ష కేంద్ర సమాచారం అభ్యర్థులకు జూన్ 10 నాటికి తెలుస్తుంది. అభ్యర్థులు అధికారిక ద్వారా అప్లై చేసుకోవచ్చు.

## దశల వారీగా సమస్యల పరిష్కారానికి చర్యలు

### ఐటీడీఏ పీవో మంద మకరంద హామీ

ఆదిలాబాద్,మే19 : దశల వారీగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో మంద మకరంద అన్నారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం ఖైరదట్వా గ్రామంలో జన్ భాగీదారి అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరంద ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రోడ్డులు, ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని ఆదివాసీ నాయకులు పీవోను కోరారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లలు ఉన్నత చదువులు అభ్యసిస్తేనే ప్రయోజకులుగా ఎదుగుతారన్నారు. పంచాయతీ అభివృద్ధికి సంబంధించిన అంశాలు సమన్వయంతో చర్చించి తీర్మానం చేయాలని, తీర్మానం ప్రణాళికాబద్ధంగా ఉండాలని, ప్రభుత్వ పథకాలను వందశాతం అమలు చేసిన అధికారులకు బహుమతి ప్రకటిస్తామని తెలిపారు. ఐటీడీఏ పరిధిలో ఉన్న సమస్యలు దశలవారీగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనక సత్యనారాయణ, ఉప సర్పంచ్ విశ్వజిత్, అడిషనల్ డీఎంహెచ్ఓ కుడ్మెత మనోహర్, డీఎల్ పీవో ప్రభాకర్, తాహసిల్దార్ జాడి రాజలింగం, ఎంపీ డీవో పూల్లారావ్,ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ జిల్లాలో మండుటెండలు

### జనం బయటకు రాలేక నానా తిప్పలు

ఆదిలాబాద్,మే19 : ఆదిలాబాద్ జిల్లాలో భానుడి ప్రతాపం కొనసాగుతున్నది. సోమవారం 44.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా.. మంగళవారం కూడా అదే పరిస్థితి నెలకొంది. మండుటెండల తో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు. ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఎండ తీవ్రత.. సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగుతున్నది. ఎండకు వడగాలులు తోడవడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులు జనసంచారం లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు గొడుగులు, టోపీలు, తలకు టవల్స్ చుట్టుకుంటున్నారు. మంచినీరు, మజ్జిగ, లస్సీ ఇతర చల్లని పానీయాలు తీసుకుంటున్నారు. మరో నాలుగు రోజులపాటు ఎండ తీవ్రత ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని.. ఉదయం, సాయంత్రం పనులు చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

# వాట్సాప్ మీసేవలో మరిన్ని జీహెచ్‌ఎంసీ సేవలు

### అందుబాటులోకి కొత్తగా తొమ్మిది పౌర సేవలు

### డిజిటల్ సేవలను మరింత విస్తరించిన ప్రభుత్వం

హైదరాబాద్,మే19 : జీహెచ్‌ఎంసీకి సంబంధించిన పౌర సేవలను కొత్తగా మీసేవ వాట్సాప్, చాట్‌బాట్ ద్వారా తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రజలకు మరింత సౌకర్యం, అందుబాటు, పారదర్శకత కల్పించే దిశగా ఈ సేవలను విస్తరించారు. ఈ మేరకు ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నాయకత్వంలో మీసేవ ద్వారా పౌర సేవలను మరింతగా తీర్చిదిద్దుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఉాష్ట్ర ప్రభుత్వ డిజిటల్ సేవల ప్రధాన వేదికగా ఉన్న మీసేవను వాట్సాప్, చాట్‌బాట్ ద్వారా మరింత విస్తరించారు. ఈ అదనపు డిజిటల్ ఛానల్‌ను 2025 నవంబర్ 18న ప్రారంభించారు. కొత్తగా జీహెచ్‌ఎంసీ ప్రాపర్టీ అసెస్‌మెంట్ రివిజన్, జనన ధ్రువీకరణ సవరణ, మరణ ధ్రువీకరణ సవరణ, బర్త్ హోమ్, డెత్ హోమ్, ప్రాపర్టీ డోర్ నంబర్ సవరణ, ప్రాపర్టీ పేరు సవరణ, ప్రాపర్టీ ట్యాక్స్ సేవలు, ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ సేవలను వాట్సాప్ మీసేవలో చేర్చారు. ఉాష్ట్రవ్యాప్తంగా పౌరులు ఈ సేవలను వాట్సాప్ ద్వారానే పొందవచ్చని ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం తెలిపింది. సేవలు పొందేందుకు ముందుగా 8096958096 నంబర్‌ను మొబైల్‌లో పేరుతో సేవ్ చేసుకోవాలి. అనంతరం వాట్సాప్‌లో ఆ నంబర్‌కు సందేశం పంపాలి. అవసరమైన సేవ పేరు టైప్ చేసి, మెనూలో కనిపించే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఫారంలో అడిగిన వివరాలు, చెల్లింపు పూర్తిచేస్తే దరఖాస్తు వెంటనే వాట్సాప్ ద్వారా నమోదవుతుంది. వాట్సాప్ ఆధారిత మీసేవ వేదికకు ప్రారంభం నుంచి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని ప్రభుత్వం వెల్లడించింది. జనన ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పోలీస్ చలాన్, విద్యుత్ బిల్లు, బీఐఈ ఫలితాల సేవలను ప్రజలు ఎక్కువగా వినియోగిస్తున్నట్లు తెలిపింది. రోజువారీ పరిపాలన సేవలకు వాట్సాప్‌పై ప్రజల ఆధారపడటం పెరుగుతోందని పేర్కొంది. డిజిటల్ సేవలను నిరంతరం విస్తరించడం, ప్రభుత్వ వ్యవస్థల విశ్వసనీయతను బలోపేతం చేయడం, పౌరులకు సులభమైన అనుభవం కల్పించడం తమ లక్ష్యమని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది.

# జలమండలిలో భారీ తిమింగలం

### జనరల్ మేనేజర్ కుమార్ ఇళ్లపై ఎసిబి దాడులు

### సోదాల్లో కుప్పలు తెప్పలుగా నగదు, నగలు స్వాధీనం

హైదరాబాద్ : హైదరాబాద్ జలమండలిలో భారీ తిమింగలం పట్టుబడింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన జనరల్ మేనేజర్ కుమార్ నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించగా భారీ ఎత్తున నగదు, నగలు, ఆస్తుల చిట్టాలు బయటపడ్డాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఈ తనిఖీలు చేపట్టారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే ఏసీబీ అధికారులు బృందాలుగా ఏర్పడి.. హైదరాబాద్‌తో పాటు మొత్తం 8 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. మల్లాపూర్‌లోని కుమార్ ఇంట్లో ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో తనిఖీలు ప్రారంభించారు. జీఎం కుమార్ బంధువుల ఇళ్లలోనూ సోదాలు కొనసాగాయి. ఈ తనిఖీల్లో భారీగా నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కుప్పలుగా ఉన్న నోట్ల కట్టలు చూసి అధికారులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఇంట్లో ఎక్కడ చూసినా నోట్ల కట్టలే దర్శనమివ్వడంతో.. ఆ నగదు లెక్కింపునకు కౌంటింగ్ మెషీన్లను అధికారులు వినియోగించారు. దాదాపు రూ.1.20 కోట్ల నగదు,1.5 కిలోల బంగారు ఆభరణాలు, 2.5 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. నిజామాబాద్‌లో 3 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో మూడు ప్లాట్‌లు, 6 ఓపెన్ ప్లాట్‌లను అధికారులు గుర్తించారు. బ్యాంకు లాకర్లను ఓపెన్ చేసి మరిన్ని ఆస్తులను గుర్తించేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమయ్యారు. మల్లాపూర్‌లోని కుమార్ నివాసంలో 2 కార్లను సీజ్ చేశారు. మార్కెట్ విలువ ప్రకారం ప్రాథమికంగా 100 కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. గత నెలలో తన కుమార్తె వివాహాన్ని కుమార్ అంగరంగ వైభవంగా ఎంతో డబ్బులు వెచ్చించి మరీ జరిపించాడు. వివాహం కోసం కొన్ని కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఆ డబ్బులు ఎలా సంపాదించారనే దానిపై కుమార్ వద్ద నుంచి ఏసీబీ అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

# ధాన్యం కొనకపోవడంతో రైతులకు తిప్పలు

### ప్రభుత్వ తీరుపై మండిపడ్డ బిఆర్ఎస్ నేత

కరీంగనర్,మే19 : రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటను కొనుగోలు చేయకుండా అరిగోస పెడుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ జిల్లా హుజరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయకుండా ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాల్ వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం కనీసం పండించిన పంటను కూడా కొనుగోలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కల్లాల మీదే ధాన్యం కొనుగోలు చేసేవారని గుర్తు చేశారు. ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న ప్రైవేట్ వ్యాపారులు కొర్రీలు పెడుతూ ఒక్కో బస్తా మీద నాలుగు నుంచి ఐదు కిలోల తరుగు తీయడంతో పాటు ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర చెల్లించడం లేదని అన్నారు. ప్రభుత్వం వహిస్తున్న అలసత్వం వల్ల రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, పలువురు రైతులు మానసిక క్షోభకు గురై ఆత్మహత్యకు కూడా పాల్పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఎద్దు ఏడ్చిన యవుసం రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడిన చరిత్ర లేదనే సత్యాన్ని గ్రహించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి వెంటనే రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని, లేని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# సంపాదకీయం

## దేశంలో రొయ్యల మార్కెటింగ్ పెంచాలి !

మనదేశంలో సరైన విధానాలు లేక పంటలు పండించిన రైతులు నానా యాతన పడుతున్నారు. సరైన మార్కెటింగ్ ఉండదు. సరైన రవాణా సౌకర్యం ఉండదు. సరైన వేదికలు ఉండవు. మదనపల్లి టమోటాలు పండించినా అవి ప్రజలకు చేరవు. నిజామాబాద్ పసుపు ప్రజలకు భారంగా మారింది. గుంటూరు, వరంగల్, ఖమ్మం మిర్చికి పేరొందినా ధర మా÷–తరం ప్రజలకు ఘాటెక్కిస్తుంది. వడ్లు, మక్కలు, శనగలు పండించినా వాటిని ప్రజలకు చేరువ చేసే యంత్రాంగం ఉండదు. దేశంలో ఏ మూల ఏం పండినా అది మారుమూల ప్రజలకు చేరవేసే సమర్థ వంతమైన మెకానిజం దేశంలో ఇంకా బలపడలేదు. అందుకే రైతులు తమ పండించిన పంటలను దేశంలో ఎక్కడైనా అమ్ముకునే వీలు కలగడం లేదు. వ్యాపారులు కూడా వాటిని కొనుగోలు చేసి, ప్రజలకు చేరవేయడం లేదు. మనదగ్గర మక్కలు పండితే ధరలు రావు. కానీ విదేశీ కంపెనీ కెల్లాగ్ వారు కార్న్ ఫ్లేక్స్ మాత్రం వందల్లో డబ్బులు పోసి పావుకిలో కొంటాం. అదే మన మక్కను వాల్యూ యాడెడ్ చేసి అమ్ముకో లేక పోతున్నాం. తాజాగా ఆక్వా రైతుల పరిస్థితి అదేవిధంగా ఉంది. విజినరీ చంద్రబాబు కేంద్రానికి లేఖ రాసి ఆక్వా రైతులను ఆదుకోవాలన్నారే తప్ప, అందుకు మార్గాలను మాత్రం అన్వేషించడం లేదు. సైనికులకు సరిహద్దుల్లో సరైన ఆహారం దొరకడం లేదని ఆరోపణలు ఉన్నాయి. సైన్యం మెనూలో ఆక్వాను చేర్చాలని చంద్రబాబు కోరారు. ఇది మంచి ఆలోచనగానే గుర్తించాలి. అలాగే ప్రజలకు కూడా ఆక్వాను నేరుగా సరఫరా చేయగలగాలి. ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధిలో గణనీయ స్థాయిలో భాగస్వామ్యమవుతున్న చేపల, రొయ్యల రైతులకు ఆపన్నహస్తం అందించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖలు రాసి సరిపెడితే ఎలా అన్నది ఆలోచించాలి. తన పరిధిలోని సమస్యల పరిష్కారానికి కూడా చిత్తశుద్ధి చూపించట్లేదు. డబుల్ ఇంజిన్ సర్కార్ ఈ నిర్వాకం ఆక్వా రైతులను అధోగతి పట్టిస్తోంది. ట్రంప్ సుంకాలు, ధరల పతనం, వ్యాధులు, మేత రేట్ల మోత, పెట్రో ఛార్జీల పెంపు.. ఆక్వా రైతును ఒకదాని వెంట మరొక సమస్య చుట్టుముట్టి గుక్కతిప్పుకోనీయడంలేదు. మరోవైపు రూ.వేల కోట్ల విదేశీ మారకద్రవ్యం, పన్ను ఆదాయాలను తమ బొక్కసంలో వేసుకుంటున్న కేంద్ర ప్రభుత్వానికి, ఇబ్బందులతో సతమతమవుతున్న ఆక్వా రైతులకు ఆదుకోడానికి అస్సలు చేతులు రావట్లేదు. ట్రంప్ అమెరికా అధ్యక్షుడు కాగానే బాదిన సుంకాలతో మొట్టమొదట నష్టపోయింది రొయ్య రైతులు. మన రొయ్యలపై అమెరికా 60 శాతం వరకు దిగుమతి సుకం బాదింది. ఇక్కడ ధరలు 20–30 శాతం పడిపోయాయి. అమెరికా సుంకాల ప్రభావం మన రాష్ట్రం నుంచి ఏటా జరుగుతున్న రూ.25 వేల కోట్ల విలువైన ఆక్వా ఎగుమతులపై పడింది. సుంకాలు తగ్గించేలా మోడీ ప్రభుత్వం ట్రంప్‌తో చర్చలు జరిపి చర్యలు తీసుకోవాలని రైతులు ఆందోళనలు చేపట్టినా ఫలితం కానరాలేదు. ఆక్వా రైతులను ఆదుకోవడానికి ఎపిలో కూటమి ప్రభుత్వం కూడా పెద్దగా పట్టుపట్టడం లేదు. ఒకటికి రెండు సార్లు లేఖలు రాయడం తప్ప టిడిపి ప్రభుత్వం చేసిందేమీ లేదు. అంతలోనే ఫీడ్ కంపెనీలు ఇష్టానుసారం ఏకపక్షంగా ధరలు పెంచేందుకు తెగబడగా రైతాంగం నుంచి తీవ్ర నిరసనలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగి తాత్కాలికంగా ఆపించింది. ఫిబ్రవరిలో ఒకసారి ఫీడ్ ధరలను కిలోపై రూ.4 పెంచాయి. కేంద్రం కొన్ని రకాల పన్నులు తగ్గించిన సందర్భంలో కంపెనీలు నామమాత్రంగా ధరలు తగ్గించి, కొన్ని రోజులకే పెంచాయి. తిరిగి కిలోపై రూ.10 వరకు పెంచుతున్నట్లు ప్రకటించి వెనక్కి తగ్గాయి. ఎపి ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం ప్రకారం ఫీడ్ ధరలను కంపెనీలు తమకు తాము పెంచడానికి వీల్లేదు. ప్రభుత్వం సమక్షంలో రైతులు, కంపెనీల మధ్య సంప్రదింపులతో జరగాలి. వరి, ఆహార ధాన్యాల కంటే చేపలు, రొయ్యల సాగుతో అధిక ఆదాయం వస్తుందని ఊదరగొట్టాయి. దాంతో రొయ్యల సాగు 4.7 లక్షల ఎకరాలకు విస్తరించింది. అనధికారిక సాగు ఇంకా ఎక్కువే ఉంటుంది. ఆక్వా సాగు రోజు రోజుకూ కాస్ట్లీ అయింది. రైతులు ఆ వైపు మళ్లడంతో గాలివాటుగానూ తయారైంది. వ్యాధులు, ప్రకృతి విపత్తులు తరచు నష్టాలు కలిగిస్తున్నాయి. తరచు ధరల పతనం, అదనంగా ట్రంప్ సుంకాల ప్రభావం, తాజాగా యుద్ధం కారణంగా పెట్రోలు, డీజిల్‌కు కొరత. అంతలోనే వాటి ధరల పెంపు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. కూటమి సర్కార్ తాము ఫీడ్ ధరలు తగ్గించామని, యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే ఇస్తున్నామంటోంది. పెరిగిన ఫీడ్ ధరలతో పోల్చితే ప్రభుత్వం తగ్గించింది చాలా తక్కువ. విద్యుత్ సబ్సిడీకి సైతం పలు ఆంక్షలు అమలవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలోని ఫీడ్ ఛార్జీలు సహా ఇతర సమస్యలను పరిష్కరించి ఆక్వారైతులను, ఆ రంగంపై ఆధారపడ్డ లక్షలాది మందిని ఆదుకోవాల్సి ఉంది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఇప్పుడు దేశీయంగా వీటిని ప్రజలకు చేరువ చేయాలి. 140 కోట్లకు పైగా ఉన్న మన దేశ ప్రజలకు సమతుల్య ఆహారం అవసరం. ఇందులో చేపలు, రొయ్యలు కూడా చేర్చాలి. అందుకు ప్రభుత్వాలు కార్యాచరణ చేయాలి. ప్రజల ఆహారం లో మన పంటలు చేరేలా ప్రణాళికలు సిద్ధం చేస్తే, ఏ పంటయినా అమ్ముడు పోతుంది. మనదేశంలోని అన్ని పట్టణాలకు రొయ్యలు చేరేలా చేయాలి. అలా చేయకుండా ఎన్ని ప్రకటనలు గుప్పించినా లాభం లేదు. ఇప్పటికీ హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు సక్రమంగా రొయ్యలు చేరడం లేదు. రైతులు పండించే పంటలకు సరైన మార్కెటింగ్ వ్యవస్థ లేనంత కాలం ఇలాంటి సంక్షోభాలు ఎదుర్కోవాల్సిందే. అందుకు ప్రభుత్వాలదే బాధ్యత.

# ఎబోలా అరికట్టే చర్యలు బలోపేతం




### ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే వారిపై ఆంక్షలు

### వీసాలను తాత్కాలికంగా నిలిపివేసిన అమెరికా

వాషింగ్టన్ : ఎబోలా వ్యాప్తిని నివారించడానికి ముందుజాగ్రత్త చర్యలను బలోపేతం చేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. దీనిలో భాగంగా వ్యాధి వ్యాప్తి చెందిన ఆఫ్రికా ప్రాంతాల నుండి వచ్చే విమాన ప్రయాణికులను పరీక్షించడంతో పాటు, వీసాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా రాయబార కార్యాలయం వెల్లడించింది. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డి ఆర్ సి) లో ప్రాణాంతకమైన ఎబోలా వ్యాప్తిని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు హెచ్ ఒ) అత్యవసర పరిస్థితిగా ప్రకటించిన నేపథ్యంలో, యుఎస్ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సిడిసి) ఈ నివారణ చర్యలను చేపట్టింది. విమానాశ్రయాలలో స్క్రీనింగ్‌తో పాటు, గత 21 రోజులలోపు ఉగాండా, డి ఆర్ సి, దక్షిణ సూడాన్‌లకు ప్రయాణించిన అమెరికా యేతర పాస్‌పోర్ట్ హోల్డర్లపై ప్రవేశ ఆంక్షలను అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఉగాండాలోని కంపాలాలో ఉన్న అమెరికా రాయబార కార్యాలయం అన్ని వీసా సేవలను తాత్కాలికంగా నిలిపివేసి, ప్రభావితమైన దరఖాస్తుదారులకు సమాచారం అందించింది. డి ఆర్ సి లో ఉన్న ఒక అమెరికన్ సిబ్బందికి ఎబోలా వైరస్ సోకినట్లు డబ్ల్యుహెచ్ ఒ ప్రతినిధి సతీష్ పిళ్ళై ధృవీకరించారు. ఆ వ్యక్తికి పరీక్షల్లో పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో, చికిత్స నిమిత్తం జర్మనీకి తరలించేందుకు యత్నిస్తున్నామని అన్నారు. అలాగే అతనితో పరిచయం ఉన్న మరో ఆరుగురిని క్వారంటైన్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రజలకు తక్షణ ప్రమాదం తక్కువగానే ఉందని అంచనా వేస్తున్నామని, అయితే మారుతున్న పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తున్నట్లు సిడిసి తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ వ్యాధి వ్యాప్తిపై ఆందోళన వ్యక్తం చేస్తూనే, ప్రస్తుతానికి ఇది ఆఫ్రికాకే పరిమితమైందని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఈ ఎబోలా సంక్షోభంపై ట్రంప్ ప్రభుత్వం స్పందిస్తున్న తీరుపై అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ ఒ) నుండి అధికారికంగా వైదొలగడం, గతంలో ఎబోలా నివారణలో కీలక పాత్ర పోషించిన 'యుఎస్ ఎఐడి' (యుఎస్ ఎఐడి) నిధులలో కోత విధించడం ప్రస్తుత నియంత్రణ ప్రయత్నాలపై ప్రతికూల ప్రభావం చూపిందనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం తీసుకుంటున్న ప్రయాణ నిషేధాలు కేవలం నాటకమేనని, ట్రంప్ ప్రభుత్వం ఈ విషయంలో చాలా వెనుకబడి వ్యవహరిస్తోందని జార్జ్‌టౌన్ యూనివర్శిటీ నిపుణులు మాథ్యూ కావనాగ్ విమర్శించారు. గతంలో ప్రభుత్వ ఏజెన్సీల సమన్వయం వల్ల వ్యాధిని వేగంగా అరికట్టగలిగారని, కానీ ఇప్పుడు వందలాది కేసులు నమోదై, తీవ్రంగా వ్యాపించిన తర్వాతే చర్యలు చేపట్టడం అమెరికా వ్యూహాత్మక వైఫల్యమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తాము స్థానిక ఆరోగ్య సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని, తక్షణ ప్రతిస్పందన చర్యల కోసం 13 మిలియన్ డాలర్ల సహాయాన్ని సమీకరించినట్లు సిడిసి ప్రకటించింది.

# ఆదానీపై అమెరికాలో కేసులు కొట్టివేత

### ఆధారాలు లేవని తేల్చిన న్యాయశాఖ

న్యూయార్క్,మే19 : అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీలపై ఉన్న కేసులను అమెరికా న్యాయ శాఖ పూర్తిగా కొట్టివేసింది. యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) సహా పలు ఏజెన్సీలు ఈ కేసులను కొట్టివేశాయి. ఈ కేసులో ఎలాంటి ఆధారాలు లేవని, లంచాలు ఇచ్చినట్లుగా కూడా రుజువులు లేవని తేల్చింది. భారతదేశంలో ఒక సోలార్ పవర్ అమ్మకాల కాంట్రాక్టును గెలుచుకోవడానికి రూ. 2,000 కోట్లకు పైగా లంచాలు ఇచ్చారని, అలాగే పలు దశల్లో అమెరికన్ పెట్టుబడిదారుల నుంచి డబ్బు వసూలు చేశారని అదానీపై అమెరికాలో కేసులు నమోదయ్యాయి. అమెరికాలో ఇటువంటి ఆరోపణలను పూర్తిగా కొట్టివేయడం ఒక అసాధారణ చర్య అని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎస్ఈసీ దాఖలు చేసిన కేసును పరిష్కరించుకోవడానికి అదానీ 6 మిలియన్ డాలర్లు చెల్లించడానికి అంగీకరించినట్లు కోర్టు పత్రాలు చూపిస్తున్నాయి. సాగర్ అదానీ కూడా 12 మిలియన్ డాలర్లు చెల్లించడానికి అంగీకరించారు. తఎల్‌పీజీ దిగుమతులకు సంబంధించి ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలను అదానీ గ్రూప్ ఉల్లంఘించిందని ఆరోపిస్తూ యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ యొక్క ఆఫీస్ ఆఫ్ ఫారిన్ అసెట్స్ కంట్రోల్ (ఓఎఫ్ఏసి) దాఖలు చేసిన కేసు కూడా పరిష్కరించబడింది. ఈ ఒప్పందం 275 మిలియన్ డాలర్లకు కుదిరింది. అదానీ గ్రీన్ ఎనర్జీ మరియు అమెరికాకు చెందిన అజూర్ కంపెనీ, తమ సౌర విద్యుత్‌ను కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ) తో ఒక ఒప్పందం కుదుర్చుకున్నాయి. రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు ఎస్ఈసీఐ నుంచే విద్యుత్‌ను కొనుగోలు చేసేలా ప్రభావితం చేయడానికి గౌతమ్ అదానీ నేరుగా జోక్యం చేసుకున్నారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో అదానీ జరిపిన సమావేశంపై కూడా ఆరోపణలు ఉన్నాయి. నరేంద్ర మోడీకి అత్యంత సన్నిహితుడైన అదానీకి, ఎస్ఈసీ పంపిన సమన్లను జారీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిరాకరించింది.

# శాండియాగో ఇస్లామిక్ సెంటర్‌లో కాల్పులు

### ముగ్గురు మృతి..పోలీసుల దర్యాప్తు

శాన్ డియాగో,మే19 : అమెరికాలో మరోసారి కాల్పుల ఘటన కలకలం రేపింది. శాన్ డియాగోలోని ఒక ఇస్లామిక్ సెంటర్‌లో జరిగిన కాల్పుల్లో ముగ్గురు మరణించారు. మసీదు, ఇస్లామిక్ పాఠశాల ఉన్న సముదాయంలో ఈ దాడి చోటుచేసుకుంది. జాతి విద్వేషం, మతపరమైన ద్వేషమే ఈ ఘటన వెనుక కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దక్షిణ కాలిఫోర్నియాలో సోమవారం జరిగిన ఈ ఘటనలో దాడికి పాల్పడిన ఇద్దరు యువకులు కూడా తుపాకీ గాయాలతో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వారు తమను తామే కాల్చుకున్నట్లు భావిస్తున్నామని శాన్ డియాగో పోలీస్ చీఫ్ స్కాట్ వాల్ వెల్లడించారు. ఇది ఇస్లామిక్ సెంటర్‌లో జరిగిన దాడి కావడంతో, జాతి వివక్షాపూరిత నేరంగా దర్యాప్తు చేస్తున్నాం అని ఆయన మీడియాకు తెలిపారు. దుండగుల వయస్సు 17, 19 సంవత్సరాల మధ్య ఉండొచ్చని అధికారులు పేర్కొన్నారు. మృతులలో ఒకరు ఇస్లామిక్ సెంటర్‌లో భద్రతా సిబ్బందిగా పనిచేస్తున్నారని, ఆయన సమయానికి స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని పోలీసులు తెలిపారు. మరణించిన ముగ్గురూ పెద్దవారేనని, పాఠశాలలో ఉన్న పిల్లలకు ఎలాంటి గాయాలు కాలేదని వెల్లడించారు. ఇస్లామిక్ సెంటర్ ఇమామ్ తాహా హసన్ మాట్లాడుతూ, తమ కేంద్రం ముస్లింలతో పాటు ముస్లిమేతరులు కూడా ప్రార్థనలు, విద్య కోసం వచ్చే ప్రదేశమని చెప్పారు. ప్రార్థనా స్థలాలపై ఇలాంటి దాడులు జరగడం అత్యంత దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టాడ్ గ్లోరియా మాట్లాడుతూ, శాన్ డియాగోలో జాతి విద్వేషానికి స్థానం లేదని, ముస్లిం సమాజానికి పూర్తి రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ, ఇది అత్యంత భయంకరమైన ఘటన అని పేర్కొన్నారు. యూఎస్ కాంగ్రెస్ సభ్యురాలు సారా జాకబ్స్, కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసమ్ కూడా ఈ దాడిని తీవ్రంగా ఖండించాయి. స్థానిక పోలీసులతో పాటు ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) కూడా దర్యాప్తులో పాల్గొంటుందని ఎఫ్‌బిఐ డైరెక్టర్ కాష్ పటేల్ తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో న్యూయార్క్ లోని ప్రధాన మసీదుల వద్ద భద్రతను కట్టుదిట్టం చేసినట్లు అధికారులు వెల్లడించారు.

# నగరంలో వరుస అత్యాచారాలు


### సినిమా షూటింగ్ పేరుతో మాయమాటలు

### యువతిపై ఇద్దరు యువకుల అత్యాచారం

హైదరాబాద్,మే19 : నగరంలో దారుణాలు వెలుగు చూస్తున్నాయి. అమ్మాయిలను మోసం చేసి అత్యాచారాలు చేస్తున్నారు. కేసులు నమోదవుతున్నా భయం లేకుండా తెగిస్తున్నారు. సికింద్రాబాద్‌లో ఓ యువతిపై ఇద్దరు యువకులు రెండ్రోజుల పాటు అత్యాచారం సాగించారు. ఇబ్రహింపట్నంలో ఓ బిటెక్ విద్యార్థినిపై తోటి విద్యార్థి అత్యాచారం చేశారు. వివరాల్లోకి వెళితే...సినిమా షూటింగ్ ఆశచూపి ఓ యువతిపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడటం తీవ్ర కలకలం రేపుతోంది. జూబ్లీహిల్స్ మెట్రో స్టేషన్ సమీపంలో ఇద్దరు యువతులు నివసిస్తున్నారు. సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారిలో ఓ యువతికి సినిమా షూటింగ్ ఉందంటూ యువకుడు మాయమాటలు చెప్పి నమ్మించాడు. సినిమా షూటింగ్ అనడంతో నమ్మిన యువతి.. యువకుడితో కలిసి సికింద్రాబాద్‌కు వెళ్లింది. సికింద్రాబాద్‌లోని గదికి తీసుకెళ్లిన యువకుడు.. తన స్నేహితుడితో కలిసి యువతిపై రెండు రోజుల పాటు లైంగిక దాడికి పాల్పడ్డాడు. నిందితులు ఈనెల 16న ర్యాపిడో బుక్ చేయించి తిరిగి యువతిని ఇంటికి పంపించేశారు. బాధితురాలి శరీరంపై గాయాలు ఉండటంతో స్నేహితురాలు ఆమెను గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించింది. అక్కడ వైద్యులు ఏం జరిగిందని ప్రశ్నించగా.. లైంగిక దాడి జరిగిన విషయాన్ని బాధితురాలు చెప్పింది. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఇద్దరు గుర్తుతెలియని యువకులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇకపోతే ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. మద్యం తాగించి బీటెక్ చదువుతున్న యువతిపై తోటి విద్యార్థి అత్యాచారం చేశాడు. దీంతో బాధితురాలు ఇబ్రహీంపట్నం పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు ఉడుతల విజయ్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని రిమాండ్‌కు తరలించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్‌కు చెందిన ఉడుతల ఉదయ్.. ఇబ్రహీంపట్నం సమీపంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. మే 14వ తేదీన తనతోపాటు చదువుతున్న యువతిని టీ తాగుదామని ఆహ్వానించాడు. ఇద్దరు కారులో దిల్‌సుఖ్‌నగర్‌కు వెళ్లారు. టీ తాగిన అనంతరం తిరుగు ప్రయాణంలో ఉడుతల విజయ్ మద్యం కొనుగోలు చేశాడు. ఆ తర్వాత బీడీఎస్ రోడ్డులోని నిర్మానుష్య ప్రదేశానికి కారులో ఆ యువతిని తీసుకెళ్లాడు. విద్యార్థినితో అతడు మద్యం తాగించాడు. మత్తులో ఉన్న ఆమెను తన గదికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు.

# చెడు వ్యసనాలతో చిన్నచూపు!

తిరుమల : ఋగ్వేదంలో ఎన్నో సూక్తాలు ఉన్నాయి. వాటిలో అక్షసూక్తం అని ఒకటుంది. దాంట్లో జూదగాణ్ని ఉద్దేశించి వేదం 'ఓ జూదరీ, నీకు విలువ ఉండదు... నీ జూదం కారణంగా నీ సంతానానికి గౌరవం ఉండదు. నీకు బంగారం కూడా ఇనుప వస్తువులా కనిపిస్తుంది. జూదం కారణంగా మొత్తం కుటుంబాన్ని నాశనం చేసుకున్న నిన్ను బంధువులు, స్నేహితులు... అందరూ సంతలో అమ్మకానికి పెట్టిన బక్కచిక్కిన ముసలి గుర్రంలాగా చూస్తూ నవ్వుకుంటారు తప్ప– ఒక్కరూ సహాయం చేయడానికి ముందుకు రారు. మానుకో ఆ వ్యసనాన్ని, కాపాడుకో కుటుంబాన్ని' అంటుంది. ఎంత మంచిమాట అది! మద్యపాన సేవనం ప్రమాదం, అనారోగ్య హేతువే కాదు సంఘంలో పరువు ప్రతిష్ఠలను సైతం అది దిగజారుస్తుంది. అందుకే చెడు వ్యసనాలను, దురాచారాలను ఏ సందర్భం లోనూ ఎవరూ ప్రోత్సహించ కూడదు. జూదం, వేట, స్త్రీ, మద్యపానం, దేశదిమ్మరితనం, నిద్ర... ఈ వ్యసనాలు కలిగిన ప్రభువులు శీఘ్రంగా వినాశనం చెందుతారని చాణక్యుడి సూక్తి. నిజానికి ఏ వ్యసనమైనా మనిషికి మేలు చేయదు. మనిషిలోని చెడుగుణాలు ఎప్పుడూ అతడి పతనానికే దారితీస్తాయి. 'మనసు స్వభావం చంచలత్వం. కేవలం అభ్యాసం ద్వారానే దాన్ని నియంత్రించగలం అని గీతలో శ్రీకృష్ణుడు ఉపదేశించాడు. నిత్యం బాహ్యవిషయాల వైపు పరుగులిడుతూ చెడు అలవాట్లకు బానిసైన మనసును సన్మార్గంలో పయనించేలా అభ్యాసం చేయాలి. మానసిక ప్రశాంతతను, బుద్ధిని, ఆరోగ్యాన్ని నిర్వీర్యం చేసే దేన్నయినా సరే మనిషి విడిచిపెట్టాలి అన్నారు స్వామి వివేకానంద. ఇలా చేస్తేనే మనిషి మనిషిగా మంచివాడుగా నిలబడతాడు.



ఆధ్యాత్మికం

# రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

- మక్కల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన వొడితల ప్రణవ్





**జమ్మికుంట, మే 19 (ది క్రైమ్ న్యూస్):** కాంగ్రెస్ అంటే రైతు ప్రభుత్వమని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ఐదు మండలాలకు సంబంధించిన రైతుల కోసం జమ్మికుంటలో ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు మార్క్‌ఫెడ్ ద్వారా సుమారు 72,500 బస్తాలు, 36,250 క్వింటాళ్ల మక్కలను కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. సోమవారం ఒక్కరోజే దాదాపు 10 వేల బస్తాల మక్కలను కొనుగోలు చేశామని తెలిపారు. రాబోయే రెండు మూడు రోజుల్లో ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న మక్కలను పూర్తిగా కొనుగోలు చేసి గోదాములకు తరలిస్తామని, అనంతరం కొనుగోలు ప్రక్రియ మరింత సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, ప్రభుత్వం మరియు అధికారులు ఎల్లప్పుడూ రైతుల వెంటే ఉంటారని భరోసా ఇచ్చారు. అనంతరం మార్క్‌ఫెడ్, జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ పాలకవర్గంతో సమావేశమై మక్కల కొనుగోలు వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# త్యాగం, నిరాడంబరత, విప్లవ చైతన్యాల సంగమం పుచ్చలపల్లి సుందరయ్య

- ఘనంగా 41వ వర్ధంతి స్మారక సభ... - చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాలి




**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి మే 19(ది క్రైమ్ న్యూస్):** కార్మికులు చేతుల్లోనే సమాజ మార్పు ఉంది. ఐకం, పోరాటం, త్యాగం - ఇవే మన విజయానికి మార్గం అని నినదించిన మహోన్నత విప్లవకారుడు, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ పితామహుడు, సీపీఐ(ఎం) తొలి ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య గారి 41వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించడం జరిగింది. అనంతరం సిపిఎం పార్టీ జిల్లా కార్యాలయంలో లో జరిగిన స్మారక సభకు సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి బానోత్, సీతారాం నాయక్ అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా విచ్చేసిన సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగయ్య ప్రసంగిస్తూ ఉద్వేగానికి లోనయ్యారు. 1913 మే 1న నెల్లూరు జిల్లా అలగానిపాడులో అగ్రకుల భూస్వామ్య కుటుంబంలో 'సుందరరామిరెడ్డి' గా జన్మించారు. కానీ కేవలం 8 ఏళ్ల చిరుప్రాయంలోనే కులవ్యవస్థను అసహ్యించుకుని, తన పేరులోని 'రెడ్డి'ని శాశ్వతంగా తొలగించుకున్న ధిక్కార స్వరం ఆయనది. 17 ఏళ్లకే మహాత్మా గాంధీ పిలుపుతో కళాశాల విద్యను త్యజించి స్వాతంత్ర్యోద్యమంలో దూకిన దేశభక్తుడు. 1934లో సోషలిస్టుగా, 1936లో కమ్యూనిస్టుగా మారి జీవితాంతం ఆ మాటకు కట్టుబడ్డారు" అని వివరించారు. తెలంగాణ సాయుధ పోరాట సారథి: "1946-51 మధ్య జరిగిన చారిత్రాత్మక తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి సుందరయ్య గారు వెన్నెముకగా నిలిచారు. నైజాం నవాబు, దొరలు, దేశ్‌ముఖ్‌ల వెట్టిచాకిరీకి, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా 'భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం' అనే నినాదంతో 3 వేల గ్రామాల్లో, 10 లక్షల ఎకరాలను పేదలకు పంచిపెట్టిన మహోద్యమం అది. 'గ్రామ రాజ్యం'లను స్థాపించి సమాంతర ప్రభుత్వాన్నే నడిపారు. ఆ పోరాట ఫలితంగానే తర్వాతి కాలంలో భూసంస్కరణల చట్టాలు వచ్చాయి" అని తెలిపారు. నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనం: "స్వతంత్ర భారతంలో రెండు సార్లు ఎంపీగా, ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచినా, 'సైకిల్ ఎమ్మెల్యే'గానే ప్రజల మధ్య తిరిగారు. పార్లమెంటుకు సైతం సైకిల్‌పైనే వెళ్లేవారు. తనకు వారసత్వంగా వచ్చిన వేల ఎకరాల భూమిని, ఆస్తులను పార్టీకి, పేదలకు రాసిచ్చేశారు. చివరివరకు సొంత ఇల్లు కూడా లేకుండా, పార్టీ ఆఫీసులోనే జీవితం గడిపారు. ప్రజాసేవ కోసం తన సహచరి, ఉద్యమకారిణి కామ్రేడ్ లీలావతి గారితో కలిసి సంతానం వద్దని నిర్ణయించుకున్న త్యాగధనుడు. ఒకసారి పార్టీ మహాసభలో కొందరు బహిరంగ మలవిసర్జన చేయడాన్ని చూసి, వారు వినకపోవడంతో తానే స్వయంగా చేతులతో శుభ్రం చేసిన మానవతామూర్తి ఆయన" అని సభికులు కళ్లు చెమర్చుకున్నారు. నేటి రాజకీయాలకు చెంపపెట్టు: సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ "నేడు పది తరాలకు సంపాదించుకునే రాజకీయాలు చూస్తున్నాం. కానీ సుందరయ్య గారు పది తరాలు బాగుపడాలని రాజకీయాలు చేశారు. అవినీతి, బంధుప్రీతి, కులతత్వం రాజ్యమేలుతున్న ఈ రోజుల్లో ఆయన నిజాయితీ, నైతిక విలువలు, నిబద్ధత యువతకు దిక్సూచి. మార్క్సిస్టు సిద్ధాంతాన్ని గాంధేయ విలువలతో మేళవించి 'కమ్యూనిస్టు గాంధీ'గా చరిత్రలో నిలిచిపోయారు. ఆయన రాసిన 'తెలంగాణ ప్రజల పోరాటం - దాని పాఠాలు', 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' గ్రంథాలు ప్రతి కార్యకర్త చదవాలి" అని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం 1 నుంచి 10వ తరగతి వరకు పాఠ్యపుస్తకాల్లో పుచ్చలపల్లి సుందరయ్య గారి జీవిత చరిత్ర, త్యాగాలను పాఠ్యాంశంగా చేర్చాలి. రైతు సమస్యలు: కేంద్రం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేసి, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం మీక్సాకి చట్టబద్ధత కల్పించాలి. కార్మిక హక్కులు: 4 లేబర్ కోడ్‌లను రద్దు చేసి, కార్మికులకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలి. డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు రామ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టి వెంకన్న జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి జిల్లా దూడ్డెలా రామూర్తి, పట్టణ కమిటీ సభ్యులు కుమ్మరి కుంట్ల నాగన్న చాగంటి భాగ్యమ్మ బానోత్ వెంకన్న తోట శ్రీను మందుల మహేందర్ లాలైయ్య గౌని వెంకన్న వీణ రజాక్ 15వ వార్డు కౌన్సిలర్ బానోత్ బాబు శాఖ కార్యదర్శి లు పార్టీ సభ్యులు తదితరులు పాల్గున్నారు.

# ధాన్యం కొనుగోళ్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు..

- క్షేత్రస్థాయిలో ప్రత్యేక అధికారులు విస్తృతంగా పర్యటించి కొనుగోళ్లలో వేగం పెంచాలి - నరసింహులపేట చిన్న గూడూరు మండలాలలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్..







**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి మే19(ది క్రైమ్ న్యూస్):** జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ నరసింహులపేట చిన్న గూడూరు మండలాలలో మంగళవారం కలెక్టర్ ఆకస్మిక విస్తృత పర్యటనలు చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో మక్కజొన్న, ధాన్యం, పెద్దనాగారం, వసురుతండలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్వయంగా తనిఖీ చేశారు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కేంద్రంలో సిబ్బంది నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తూ రికార్డులను సరిగా మెయింటైన్ చేయడం లేదనీ, ఇప్పటివరకు వచ్చిన ధాన్యం కొనుగోలు చేసిన ధాన్యం నాణ్యత ప్రమాణాలు, గన్ని సంచుల పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిఓ, అగ్రికల్చర్ అధికారులపై కఠిన చర్యలు తీసుకొని విధుల నుంచి తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా అన్ని మక్కజొన్న, ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల నిర్వహణ రవాణా తదితర అంశాలలో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే హెచ్చరించడం జరిగిందని అయినా కొన్నిచోట్ల నిర్లక్ష్యంగా ఉన్నారని అట్టి వారిని గుర్తించి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దాన్యం మ్యాచ్యుర్ వచ్చిన తర్వాతనే కూపన్ల ద్వారా కేటాయించాలని సూచించారు. రవాణా చేయు సందర్భంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకొని వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలని, హమాలీలను అధికంగా అందుబాటులో ఉంచుకోవాలని లోడింగ్, అన్లోడింగ్ విషయంలో వేగంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట జిల్లా సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై అధికారి రమేష్, మేనేజర్ నరసింహారావు, స్థానిక ఎంపీడీవో ఎమ్మార్వో తదితరులు ఉన్నారు.

# తెలంగాణ మోడల్ యునైటెడ్ నేషన్స్‌లో కమాన్‌పూర్ విద్యార్థుల ప్రతిభా కాంతులు

- రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం సాధించిన డి. చరిష్మా - బెస్ట్ మీడియా ప్రతినిధిగా కే. రవిత్రేణి ఎంపిక





**మంథని (ది క్రైమ్ న్యూస్) మే 17:** పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన "తెలంగాణ మోడల్ యునైటెడ్ నేషన్స్" కార్యక్రమంలో విశేష ప్రతిభ కనబరిచి పాఠశాలకు, జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. సర్వ శిక్ష అభియాన్ పాఠశాల విద్య శాఖ ఆధ్వర్యంలో, రాష్ట్ర సోషల్ ఫోరమ్ సహకారంతో మే 15 నుంచి17 వరకు హైదరాబాద్‌లోనిలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. రాష్ట్రంలోని పీఎం శ్రీ పాఠశాలల నుంచి ఎంపికైన విద్యార్థులు వివిధ దేశాల ప్రతినిధులుగా పాల్గొని అంతర్జాతీయ అంశాలపై చర్చలు జరిపారు. మానవ హక్కులు, మహిళల సాధికారత, బాలల హక్కులు, నాణ్యమైన విద్య, బాలల ఆరోగ్య సంరక్షణ వంటి కీలక అంశాలపై విద్యార్థులు తమ వాదనలు సమర్థంగా వినిపించారు. అంతర్జాతీయ సమావేశాల తరహాలో జరిగిన ఈ కార్యక్రమంలో కమాన్‌పూర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని డి. చరిష్మా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానాన్ని సాధించింది. "బెస్ట్ డెలిగేట్"గా ఎంపికైన ఆమెకు సమగ్ర శిక్ష డైరెక్టర్ రాధా మేడం చేతుల మీదుగా అవార్డు అందజేయడం విశేషంగా నిలిచింది. అలాగే, ఇంటర్నేషనల్ ప్రెస్ మీడియా ప్రతినిధిగా పాల్గొన్న కే. రవిత్రేణి తన చురుకైన ప్రతిస్పందన, సమర్థవంతమైన ప్రదర్శనతో "బెస్ట్ మీడియా ప్రతినిధి"గా గుర్తింపు పొందింది. ఈ ఇద్దరు విద్యార్థులను కమాన్‌పూర్ మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులు ఇల్లందుల విజయ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, వాదన నైపుణ్యాలు, ప్రపంచ సమస్యలపై అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచగలరని కమాన్‌పూర్ విద్యార్థులు మరోసారి నిరూపించారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: వొడితల ప్రణవ్

- ప్రజా సమస్యల పరిష్కారానికి వారధిగా జర్నలిస్టులు పని చేయాలి - జర్నలిస్ట్ కుటుంబానికి ప్రమాద భీమా పోస్టల్ బాండ్ అందజేసిన ఇంచార్జ్ వొడితల ప్రణవ్

**హుజురాబాద్ మే 19 (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని,ప్రజా క్షేత్రంలో పనిచేసే మీడియా మిత్రులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేయాలని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ కోరారు.మంగళవారం రోజున హుజురాబాద్ పట్టణంలోని హుజురాబాద్ క్లబ్ లో మీడియా సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు.దీనికి ముఖ్య అతిథిగా ప్రణవ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన చిర్ర సుదర్శన్ కుటుంబానికి ప్రమాద భీమా పోస్టల్ బాండ్ ద్వారా వచ్చిన ఇన్సూరెన్స్ బాండ్ ను బాధిత కుటుంబానికి ప్రణవ్ చేతుల మీదుగా అందజేశారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కుటుంబానికి పెద్ద దిక్కులా ప్రణవ్ వ్యవహరించడం అడిగిన వెంటనే యూనియన్‌లోఉన్న సభ్యులకు ఇన్సూరెన్స్ డబ్బులు కట్టడం ద్వారా ఒక కుటుంబానికి న్యాయం జరిగిందని భావోద్వేగానికి లోనయ్యారు. అలాగే హుజురాబాద్ పట్టణంలోని వివిధ పాఠశాలలో మంచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని,విద్యార్థులకు ప్రణవ్ చేతుల మీదుగా సన్మానం చేశారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ ఇలా అందరినీ ఒకే చోట కలవడం సంతోషంగా ఉందని విద్య, వైద్య విషయంలో ముందు ఉంటామని తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాయిత రాములు, ప్రధాన కార్యదర్శి రవీందర్, హుజురాబాద్ పట్టణ, మండల అధ్యక్షులు, మహిళ అధ్యక్షురాల్లు, జర్నలిస్టులు, సీనియర్ నాయకులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు..

- 18 లీటర్ల నాటుసారా, 600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం - ఆరుగురి పై కేసునమోదు







**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి మే19 (ది క్రైమ్ న్యూస్):** మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల బయ్యారం మండలంలోని బాల్య తండా, జగ్న తండా, జగ్గు తండా మరియు బయ్యారం గ్రామాలలో మరియు మహబూబాబాద్ మండలంలోని బోడగుట్ట తండ గ్రామాలలో మంగళవారం మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్, డి టీ ఎఫ్ మహబూబాబాద్ మరియు ఎస్ టి ఎఫ్- హైదరాబాద్ టీంలు సంయుక్తంగా దాడులు నిర్వహించడం జరిగింది. దాడుల్లో (06) గురు ముద్దాయిలపై కేసు నమోదు చేసి, (18) లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని (600) లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేయడం జరిగింది. తదుపరి ముద్దాయిలు 1. భూక్య చమిలి 2. తేజావత్ రాజి 3. జినుక ఉపేందర్ 4. కున్సోత్ సురేష్ 5. భూక్య దేవి 6. మూడు పత్రులను తాహసిల్దార్ బయ్యారం ముందు బైండోవర్ చేఅయినట్లు జి.చిరంజీవి ఎస్ హెచ్ ఓ మహబూబాబాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి దాడులలో ఎక్సైజ్. చిరంజీవి, నీరజ, అశోక్ కుమార్, నాగరాజు మరియు ఎక్సైజ్. కిరీటి, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# స్వర్గీయ శ్రీపాద రావు జ్ఞాపకార్థం ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో అంబలి పంపిణి





**మంథని (ది క్రైమ్ న్యూస్) మే 17:** వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు ఉపశమనం కలిగించే లక్ష్యంతో ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో అంబలి పంపిణి కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం రోజున స్వర్గీయ శ్రీపాద రావు జ్ఞాపకార్థం ప్రత్యేకంగా అంబలి పంపిణి నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఇనగంటి రామారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజలకు చల్లని అంబలి అందిస్తూ సేవాభావాన్ని చాటిన ఈ కార్యక్రమం స్థానికంగా ప్రశంసలు అందుకుంది. వేసవి కాలంలో దాహార్తిని తీర్చడమే కాకుండా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని చేపట్టిన ఈ కార్యక్రమం సామాజిక బాధ్యతను ప్రతిబింబించిందని పలువురు అభిప్రాయపడ్డారు. స్వర్గీయ శ్రీపాద రావు జ్ఞాపకార్థంగా నిర్వహించిన ఈ సేవా కార్యక్రమం ద్వారా ఆయన సేవాస్ఫూర్తిని స్మరించుకోవడం జరిగింది. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా యువత సామాజిక చైతన్యాన్ని పెంపొందించుకోవాలని స్థానిక పెద్దలు సూచించారు. ఈ సందర్భంగా అంబలి పంపిణి కార్యక్రమానికి సహకరించిన ఇనగంటి రామారావుకు ఛత్రపతి శివాజీ యువసేన సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగించాలని వారు ఆకాంక్షించారు.

# ఇంధన ధరల పెంపును ఉపసంహరించుకోవాలి

## ● మోదీ సర్కార్ వైఫల్యం వల్లే నీట్ పరీక్షా పత్రం లీక్ అయింది ● సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**బ్యూరో చీఫ్(ది క్రైమ్ న్యూస్):** కేంద్రం ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉప సంహరించుకోవాలని సుడ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ,కార్పోరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్,పలువురు కార్పొరేటర్లు కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడుతూ పెంచిన పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలను వెంటనే ఉప సంహరించుకోవాలని, ధరలు పెరగడం ద్వారా సామాన్య ప్రజలపై భారం పెరిగే అవకాశం ఉందన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం తమ ప్రభుత్వంలో ఎటువంటి భారాన్ని ప్రజలపై వేయమని, ధరలు పెంచబోమని మాయ మాటలు చెప్పి ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రక్రి ముగిసిన వెంటనే నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశ ప్రజలకు పెట్రో ధరల భారం కానుకగా ఇచ్చిందన్నారు. ఎన్నికలలో గెలిచిన వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలను అమాంతం పెంచుతూ ప్రజల నడ్డి విరిచే విధంగా కేంద్ర ప్రభుత్వ వ్యవస్థ ఉందన్నారు.డీజిల్, పెట్రోల్, ధరలు పెరగడం ద్వారా నిత్యవసర వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉందని వెంటనే ధరలు తగ్గించి పేద ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.నీట్ పరీక్షా పత్రం లీక్ కు సంబంధించి దేశ వ్యాప్తంగా 26 లక్షల మంది రాష్ట్రంలో 70 వేల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఇది ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే అని నరేందర్ రెడ్డి మండిపడ్డారు.ప్రధాని మోడీ కి మైకు దొరికితే చాలు మాటల గారడి చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యాఖ్యలు చేస్తారని పాలన మాత్రం చేత కాదని నరేందర్ రెడ్డి విమర్శించారు.నీట్ పరీక్షా పత్రం లీక్ పై బీజేపీ నాయకులు దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.దీనికి తెలంగాణలో ప్రజలు గెలిపించిన ఎనిమిది మంది పార్లమెంటు సభ్యులు సమాధానం చెప్పాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన లాగే బీజేపీ ప్రభుత్వం కూడా నడుస్తుందని బీఆర్ ఎస్ ప్రభుత్వంలో అన్నీ లీక్ లే అని రేవంత్ రెడ్డి ప్రభుత్వం పగడ్బందీగా పోటీ పరీక్షలు నిర్వహించి 70 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని నరేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్న సామాన్యుడిపై ఎటువంటి భారం వేయకుండా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అన్ని నెరవేరుస్తున్న మా ప్రభుత్వంపై కూడా ప్రధానమంత్రి విమర్శ హాస్యస్పదంగా ఉందన్నారు.దేశంలో అన్ని వర్గాల ప్రజలను దోచుకొని కార్పొరేట్లకు మాత్రమే లాభం చే కూర్చుతున్న ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం గద్దె దించే వరకూ తమ పోరాటం ఆగదని అన్నారు. ఈ విలేఖరుల సమావేశంలో తాజొద్దీన్, పిట్టల రవీందర్, కార్పోరేటర్లు మల్లికార్జున రాజేందర్, గంట శ్రీనివాస్, జగన్ రెడ్డి, పర్వతం మల్లేశం, వరాల నర్సింగం, నాయకులు చాడగొండ బుచ్చిరెడ్డి, టెల భూమయ్య, సరిల్ల ప్రసాద్, బాలరాజు, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, జీడి రమేష్, మ్యాకల నర్సయ్య, బత్తిని చంద్రయ్య, సుదర్శన్, మాసుం ఖాన్, శ్రీధర్ రెడ్డి, షెహెన్ష, భారీ, బషీర్, ఖలీల్, హనీఫ్ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ బోనాల ఉత్సవాల్లో దళితులపై వివక్షను తీవ్రంగా ఖండిస్తున్నాం

## ● కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కల్లేపల్లి అశోక్




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామంలో జరిగిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవాలలో దళితులపై వివక్షను తీవ్రంగా ఖండిస్తున్నామని, వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కల్లేపల్లి అశోక్ డిమాండ్ చేశారు.పెగడపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాల ఉత్సవాల సందర్భంగా దళిత సమాజానికి చెందిన భక్తులను గుడిలోకి రాకుండా అడ్డుకోవడం, వారి పట్ల వివక్ష చూపడం అత్యంత విచారకరం, అమానుషమని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కె వి పి ఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లేపల్లి అశోక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధునిక సమాజంలో ఇంకా ఇలాంటి కుల వివక్షా పూరిత సంఘటనలు జరగడం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటని పేర్కొన్నారు. భగవంతుని ముందు అందరూ సమానులే అనే భావనను తుంగలో తొక్కి, కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా దళితులను ఆలయ ప్రవేశం చేయకుండా నిరోధించడం రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాలరాయడమేనని మండిపడ్డారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 ప్రకారం అస్పృశ్యత ముమ్మాటికీ నేరమని ఆయన గుర్తుచేశారు. దళిత భక్తులను ఆలయంలోకి రాకుండా అడ్డుకున్న నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలని, బాధితులైన దళిత కుటుంబాలకు పోలీసు రక్షణతో ఆలయ ప్రవేశం కల్పించి, గౌరవప్రదంగా అమ్మవారి దర్శనం చేయించాలని ,ఈ ఘటనపై రెవెన్యూ మరియు పోలీస్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పూర్తిస్థాయి విచారణ జరపాలి. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి. కుల రహిత సమాజం కోసం పోరాడే ప్రతి ఒక్కరూ ఈ వివక్షను ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. బాధితులకు న్యాయం జరిగే వరకు కేవీపీఎస్ ఆధ్వర్యంలో పోరాటం ఆపబోమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వివిధ దళిత సంఘాల నాయకులు సిపెల్లి రవీందర్ మోదంపల్లి శ్రావణ్ సాతూరి అనిల్, కొంకటి లింగమూర్తి, మామిడిపల్లి బాపయ్య, అంబాల రాజేందర్, కుమ్మరి నవీన్, కుక్క అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయించాలి

## ● హౌసింగ్ సొసైటీకి 23 ఎకరాల స్థలాన్ని అప్పగించాలి ● జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్న జర్నలిస్టులకు తీరని అన్యాయం ● రాష్ట్ర క్యాబినెట్‌లో ఇళ్లస్థలాలపై వెంటనే ఆమోదం తెలపాలి ● టి యు డబ్ల్యూ జే టిజేఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ ● ఖమ్మంలో జర్నలిస్టుల నిరసన ప్రదర్శన




**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య ధోరణి జర్నలిస్టు వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా ఉన్నాయని, గత ప్రభుత్వం క్యాబినెట్ లో 23.2 ఎకరాల భూమిని ఖమ్మం జర్నలిస్టులకు కేటాయిస్తూ జీవో జారీ చేశారని , కానీ వాటిని అమలు చేయడంలో నేటి పాలక పక్షాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ టీజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఖమ్మం ప్రెస్ క్లబ్ నుంచి మయూరి సెంటర్ మీదుగా అమరవీరుల స్తూపం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అమరవీరుల స్థూపం వద్ద జర్నలిస్టులు నివాళులు అర్పించిన అనంతరం జరిగిన సభలో టి యు డబ్ల్యూ జె (టి జె ఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి మాట్లాడుతూ... జర్నలిస్టుల సమస్యలు పరిశీలిస్తామని అనేక వాగ్దానాలు చేసిన నేటి పాలకులు అధికారంలోకి వచ్చాక జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో ద్వంద వైఖరి అవలంబించడం బాధాకరం అన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి కూడా జర్నలిస్టులకు కేటాయించిన 23.2 ఎకరాల భూమిని హౌసింగ్ సొసైటీ ద్వారా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించడంలో కాలయాపన చేయడం మంచిది కాదన్నారు. ఈనెల 21న జరిగే క్యాబినెట్ సమావేశంలో సరైన నిర్ణయం తీసుకొని జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు వచ్చే విధంగా ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అనేక చీకటి జీవోలు జారీ చేస్తూ కోత విధించే విధంగా వ్యవహరించడం సరైంది కాదు అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు రామిశెట్టి విజేత, జిల్లా ఉపాధ్యక్షులు మంజుల ఉపేందర్, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కోశాధికారి బిక్కీ గోపి, నగర ప్రధాన కార్యదర్శి అమరవరపు కోటేశ్వరరావు, ఎలక్ట్రానిక్ మీడియా వీడియో గ్రాఫర్స్ అధ్యక్షులు నాగరాజు,ఎలక్ట్రానిక్ మీడియా నగర కార్యదర్శి కె .అశోక్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు పానకాలరావు, ముత్యాల కోటేశ్వరరావు, రేపాక యాదగిరి, పులి శ్రీను ,మూల జీవన్ రెడ్డి, నాయకులు మురళి, నరేష్, నల్లమోతు శ్రీను, ఉల్లోజు రమేష్, జక్కుల వెంకటరమణ, హుస్సేన్, ఈసంపల్లి వెంకటేశ్వర్లు, అప్పారావు, శ్రీధర్, ఎన్ రమేష్, సాయి, రామకృష్ణ, తోట గణేష్, పెంటి వెంకటేశ్వర్లు, ఉత్కంఠం శ్రీనివాస్, మహిళ జర్నలిస్ట్ రోజా, రవీందర్ ,నాయుడు, వేణుగోపాల్, శేఖర్, మధు, సుధాకర్, బాబు, లింగయ్య, సతీష్ ,మహేష్, నరసింహారావు, నాగేశ్వరరావు, గుండు శ్రీను, వెంకటేష్ ,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం ప్రమాణస్వీకారోత్సవం

## ● ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివ కుమార్ ● ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు





**కరీంనగర్ టౌన్, మే19 (ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ లోని రంగినేని గార్డెన్‌లో ఆటో కార్మిక సంక్షేమ సంఘం నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యుల ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంతో పాటు ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు "ట్రాఫిక్ అవగాహనా సదస్సు"ను కూడా నిర్వహించారు. ఈ వేడుకకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి (డిస్ట్రిక్ట్ జడ్జ్) శివ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై, నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఆటో డ్రైవర్ ఖచ్చితంగా అధికారిక డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండటం ప్రాథమిక విధి.ప్రతి డ్రైవర్ వెనుక ఒక కుటుంబం ఉంటుందని, మీ కోసం ఇంట్లో భార్యాపిల్లలు, తల్లిదండ్రులు ఎదురుచూస్తుంటారని గుర్తుంచుకోవాలి. డ్రైవర్లకు ఏమైనా ప్రమాదం జరిగితే వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం రహదారిపై వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ ముఖ్యాంశంగా పాటించాలని, దీనివల్ల ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. ఆటోకు సంబంధించిన అన్ని రకాల డాక్యుమెంట్లు, ఫిట్‌నెస్ పత్రాలు క్లియర్‌గా ఉంచుకోవాలి. పత్రాలు సక్రమంగా ఉంటేనే ప్రమాద సమయాల్లో ఇన్సూరెన్స్ (భీమా) పరిహారం లభిస్తుందని స్పష్టం చేశారు. వృత్తి పట్ల గౌరవంతో, ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తిస్తూ డ్రైవర్లందరూ క్రమశిక్షణతో మెలగాలని పిలుపునిచ్చారు.ఈ ఘనమైన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, వివిధ రంగాల ప్రముఖులు, ఆటో కార్మిక సంఘాల నాయకులు మరియు పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అధ్యక్షులు బోమ్మడి శ్రీనివాస్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి బండారి సంపత్ పటేల్, ఉపాధ్యక్షులు కోత్తూరి సత్యనారాయణ,కొత్తూరు రఘు,దండు అంజయ్య,కూకట్ల సంపత్, కోశాధికారి చిట్టుమల్ల నాగభూషణం,సహాయ కార్యదర్శులు వద్దకొండ శ్రీనివాస్, వాల్క రమేష్, మీర్చా అష్టత బేగ్, మారం సంపత్, ఇరుకుల్ల మహేష్, ప్రచార కార్యదర్శిలు మాటం శ్రీనివాస్, బీర రాజు, కార్యవర్గ సభ్యులు కూరాచీలం వేణు మాధవ్, వీర్ష పరమేష్,బోంగోని శ్రీనివాస్, కాల్వ మిధుబాబు, నునూరి ఎల్లయ్య ప్రమాణస్వీకారం చేశారు.

# హౌసింగ్ బోర్డ్ వరద కాలువ సమస్య పరిష్కరించాలి



**జమ్మికుంట మే 19 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో (6వ వార్డు) వరద కాలువ నిర్మాణం చేయకపోవడం వల్ల వర్షాకాలంలో హౌసింగ్ బోర్డ్ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు వర్షాలు పడితే చాలు కాలనీవాసులు భయం భయంగా బతికే పరిస్థితి ఉంది వరద కాలువ లేకపోవడం వల్ల వర్షాలు పడితే ఇండ్లలోకి నీరు చేరి నిత్యవసర వస్తువులు పూర్తిగా పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరద వస్తే కట్టుబట్టలతో ఇండ్ల నుండి బయటకు వచ్చే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు వర్షాలు వచ్చిన ప్రతిసారి ప్రజా ప్రతినిధులు అధికారులు వరద కాలువ నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చి వెళ్తున్నారని అధికారులు పనులు చేయడంలో జాప్యం చేస్తున్నారని తెలిపారు తమరు వరద కాలువ పనులకు నిధులు మంజూరు చేయించాలని కోరారు హౌసింగ్ బోర్డ్ ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచుకొని వరద కాలువ పనులు అయ్యేలా అధికారులకు సూచనలు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు బీజేపీ హౌసింగ్ బోర్డ్ కాలనీ 6వ వార్డుఅధ్యక్షులు ఎండి జాహిద నసీరోద్దీన్ తెలిపారు.

# 2026లో కమాన్‌పూర్ విద్యార్థిని ఘన విజయం

## రాష్ట్ర స్థాయిలో 3452 ర్యాంకు సాధించిన పొన్నం రాజ మేఘన

**మంథని, (ది క్రైమ్ న్యూస్):** గ్రామీణ ప్రాంత విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే రాష్ట్ర స్థాయిలోనూ తమ ప్రతిభను చాటగలరని కమాన్‌పూర్ గ్రామానికి చెందిన విద్యార్థిని పొన్నం రాజ మేఘన నిరూపించింది. తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 2026 పరీక్షలో కమాన్‌పూర్ గ్రామ నివాసులు పొన్నం పరశురాములు -- సువర్ణ దంపతుల కుమార్తె అయిన రాజ మేఘన రాష్ట్ర స్థాయిలో 3452 ర్యాంకు సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. ప్రస్తుతం సిర్పూర్ కాగజ్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ చదువుతున్న రాజ మేఘన, క్రమశిక్షణతో కూడిన చదువు, నిరంతర శ్రమ, స్పష్టమైన లక్ష్యంతో ఈ విజయాన్ని అందుకోవడం విశేషంగా నిలిచింది. తీవ్ర పోటీ నడుమ రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు పరీక్ష రాయగా, అత్యుత్తమ ర్యాంకు సాధించడం ఆమె ప్రతిభకు నిదర్శనంగా భావిస్తున్నారు. రాజ మేఘన విజయంపై గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ నేపథ్యం ఉన్నప్పటికీ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేస్తే విజయాన్ని సాధించవచ్చని ఆమె నిరూపించిందని పలువురు ప్రశంసిస్తున్నారు. ఈ సందర్భంగా రాజ మేఘన మాట్లాడుతూ, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, సమయపాలనతో కూడిన ప్రణాళికాబద్ధమైన చదువే తన విజయానికి కారణమని తెలిపింది. భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించి మంచి స్థాయికి చేరుకోవడమే తన లక్ష్యమని పేర్కొంది. కమాన్‌పూర్ గ్రామానికి చెందిన విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచడంతో గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది. గ్రామ ప్రజలు, విద్యార్థి సంఘాలు రాజ మేఘనకు అభినందనలు తెలుపుతూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాయి.

# ఓదెల మండలంలో రైల్వే ఓవర్ బ్రిడ్జిలకు( ఆర్ ఓ బి) అడుగులు


## రైల్వే లైన్ విస్తరణలో భాగంగా జాయింట్ ఇన్స్పెక్షన్
## ఓదెల, కొలనూర్, పొత్కపల్లి గ్రామాల్లో నిర్మాణానికి కసరత్తు
## గేట్ల వద్ద ట్రాఫిక్ సమస్యలకు చెక్
## త్వరలో గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు



ప్రతిపాదిత స్థలాలను పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా ఓదెల మండల పరిధిలో దక్షిణ మధ్య రైల్వే సంస్థ రైల్వే లైన్ విస్తరణ మరియు అభివృద్ధి పనులను వేగవంతం చేస్తోంది. ఇందులో భాగంగా లెవల్ క్రాసింగ్‌ల వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు (ఆర్‌ఓబీ), రోడ్డు అండర్ బ్రిడ్జిలు( ఆర్ ఐ బి), ఫుట్ ఓవర్ బ్రిడ్జ్( ఎఫ్‌ఓబి)ల నిర్మాణానికి చర్యలు ప్రారంభించింది. కాజీపేట - బల్లార్షా రైల్వే సెక్షన్ పరిధిలోని ఎల్‌సీ నంబర్ 28 29 (కిలోమీటర్ 315/5-7 314/30-32) ఓదెల మండలంలోని పొత్కాపల్లి, అలాగే ఎల్‌సీ 31 ఒ 32 ఓదెల, ఎల్‌సీ 34 కొలనూర్ మరియు ఎల్‌సీ 52 పెద్దంపేట గ్రామంఅంతర్గం మండలాల్లో ప్రతిపాదిత రోడ్డు ఓవర్ బ్రిడ్జల నిర్మాణానికి సంబంధించి సంయుక్త పరిశీలన (జాయింట్ ఇన్‌స్పెక్షన్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు, రైతులకు ప్రతిపాదిత అలైన్‌మెంట్ వివరాలను అధికారులు తెలియజేశారు. ప్రజల అభిప్రాయాలు, సూచనలు కూడా స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ సమ్రాట్ రాయ్, రోడ్ సెక్టార్ ప్రాజెక్టు రైల్వే భూ సేకరణ నిపుణులు పి. దేవరాజు, పెద్దపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి గంగయ్య, ఓదెల తహసీల్దార్ ధీరజ్, సుల్తానాబాద్ మరియు రామగుండం తహసీల్దార్లు, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఇరిగేషన్, మిషన్ భగీరథ శాఖల అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, రైతులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# పట్టణ వీధి వ్యాపారుల కమిటీలో సభ్యుల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం



**నల్గొండ జిల్లా ప్రతినిధి మే 19 (ది క్రైమ్ న్యూస్):**హాలియా పట్టణ మున్సిపాలిటీలో పట్టణ వీధి వ్యాపారుల కమిటీలో 5 మంది అనధికార సభ్యుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తూ మున్సిపల్ కమిషనర్ ప్రకటన విడుదల చేశారు. వీధి వ్యాపారుల (జీవనోపాధి రక్షణ మరియు వీధి వ్యాపారుల నియంత్రణ) చట్టం 2014 మరియు తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.ఎంఎస్ నం. 89, తేదీ 10-06-2020 ప్రకారం ఈ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీలో మొత్తం 11 మంది సభ్యులు ఉండగా, అందులో 5 మంది అనధికార సభ్యులను ఎంపిక చేయనున్నారు. వీరిలో: 4 మంది వివిధ వర్గాలకు చెందిన వీధి వ్యాపారులు 1 సభ్యుడు స్వచ్ఛంద సంస్థ లేదా సామాజిక ఆధారిత సంస్థ ప్రతినిధిగా ఉండాలని అధికారులు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను సంబంధిత ధృవపత్రాలతో కలిసి ఈ నెల 22వ తేదీ లోపు మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని కమిషనర్ సూచించారు.

# సొంత భూమిలోకి వెళ్లలేని రైతులు... ఓదెలలో దారుణం

- ఎకరం భూమి కోసం రైతుల కన్నీటి పోరాటం
- ప్రజావాణిలో మొర... స్పందిస్తారా అధికారులు?
- సర్వే చేసినా ఫలితం శూన్యం... బీడుగా మారిన పంట భూమి
- భూమి తమదే... కానీ సాగు చేసుకోలేని దుస్థితి
- హద్దురాళ్లు మాయమై... ఆశలు కూలిపోయాయి



**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రానికి చెందిన తాటికొండ రమేష్, తాటికొండ కృష్ణమాచారి అనే రైతుల ఆవేదన ప్రస్తుతం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. గ్రామ శివారులోని 943 సర్వే నంబర్ పరిధిలో వీరికి ఎకరా ఐదు గుంటల వ్యవసాయ భూమి ఉంది. భూమి పత్రాలు ఆ రైతుల చేతిలో భద్రంగా ఉన్నాయి కానీ భూమి మాత్రం అందరిని ద్రాక్ష అయింది. దీంతో అదే భూమిలోకి అడుగుపెట్టడానికే ఇప్పుడు వారు పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత రెండేళ్లుగా తమ భూమిని సాగు చేసుకునేందుకు ప్రయత్నిస్తే, ఇరుగుపొరుగున ఉన్న కొందరు అడ్డుకుంటున్నారని బాధిత రైతులు వాపోతున్నారు. ట్రాక్టర్లు, హార్వెస్టర్లు లోపలికి రానివ్వకపోవడమే కాకుండా, కూలీలను కూడా బెదిరించి వెనక్కి పంపిస్తున్నారని ఆరోపిస్తున్నారు. సహాయం చేయడానికి ముందుకొచ్చిన వారినీ ఇళ్ల వద్దకు వెళ్లి దుర్భాషలాడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెబుతున్నారు. వ్యవసాయం చేయడానికి మార్గం లేకపోవడంతో రెండు సంవత్సరాలుగా ఆ భూమి బీడుగా మారిపోయింది. పంట లేకపోవడంతో ఆదాయం ఆగిపోయి కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఈ భూవివాదంపై గతంలో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి హద్దురాళ్లు కూడా ఏర్పాటు చేసినట్లు సమాచారం. అయితే రాత్రికి రాత్రే ఆ గుర్తు రాళ్లను తొలగించారని బాధితులు ఆరోపిస్తున్నారు. దీంతో మళ్లీ భూమి హద్దులపై గందరగోళం నెలకొంది. ఈ సమస్యను నిన్న నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రైతులు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తమ సొంత భూమిని అనుభవించనీయకుండా అడ్డుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వెంటనే మళ్లీ సర్వే నిర్వహించి భూమికి స్పష్టమైన హద్దులు నిర్ణయించి, అందులోకి వెళ్లడానికి దారి చూపాలని కోరారు. రైతు తన సొంత భూమిలోనే సాగు చేయలేకపోతే బాధ్యత ఎవరిది? అధికారులు ఏర్పాటు చేసిన హద్దురాళ్లు ఎలా మాయమయ్యాయి? రైతులను బెదిరిస్తున్న వారిపై ఇప్పటివరకు చర్యలు ఎందుకు లేవు? రెండేళ్లుగా పంట కోల్పోయిన రైతులకు న్యాయం ఎప్పుడు? అనే ప్రశ్నలు గ్రామంలో వినబడుతున్నాయి. అన్నదాత తన సొంత భూమిలోనే పరాయి వాడిగా మారడం బాధాకరం. రైతుల సమస్యను అధికారులు అత్యవసరంగా పరిగణించి, వెంటనే భూమి సర్వే నిర్వహించడం, హద్దురాళ్లు పునరుద్ధరించడం, పోలీసు రక్షణ కల్పించడం, బెదిరింపులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం అవసరమని బాధిత రైతులతో పాటు గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

## ధర్మపురి పట్టణంలో సరైన అనుమతులు నిబంధనలు పాటించని లాడ్జ్‌ని సీజ్: సిఐ. రాంనర్సింహారెడ్డి

**ధర్మపురి, మే 19, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి పట్టణంలో సరైన అనుమతులు, నిబంధనలు పాటించని లాడ్జ్ ని సీజ్ చేసినట్లు ధర్మపురి సిఐ రాం నర్సింహారెడ్డి తెలిపారు. ధర్మపురి పట్టణంలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా లాడ్జీలు, గెస్ట్ హౌస్‌లపై జగిత్యాల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డిఎస్పి కె.పురుషోత్తం రెడ్డి సూచనలతో ధర్మపురి పోలీసులు విజయలక్ష్మి గెస్ట్ హౌస్‌లో ట్రేడ్ లైసెన్స్ లేకుండా గెస్ట్ హౌస్ నిర్వహించడం, వచ్చిన వారి వద్ద ఆధార్ కార్డులు మరియు పూర్తి వివరాలు సక్రమంగా నమోదు చేయకపోవడంపై సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. సరైన సీసీటీవీ వ్యవస్థ కీడా ఏర్పాటు చేయకపోవడం వంటి అనేక నిబంధనల ఉల్లంఘనలు గుర్తించినట్లు, ఈ నేపథ్యంలో విజయలక్ష్మి గెస్ట్ హౌస్‌పై తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ధర్మపురి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎ. రాంనర్సింహారెడ్డి ధర్మపురి మున్సిపల్ కమిషనర్ కి రిక్విజేషన్ ఇవ్వగా, ఈ రోజు ధర్మపురి మున్సిపల్ కమిషనర్ మరియు వారి సిబ్బంది విజయలక్ష్మి గెస్ట్ హౌస్ ను సీజ్ చేయడం జరిగినదని పేర్కొన్నారు. అదే విధంగా కమర్షియల్ భవనంలో డొమెస్టిక్ విద్యుత్ మీటర్లను ఉపయోగిస్తున్న విషయంపై కూడా చర్యలు తీసుకోవాల్సిందిగా ధర్మపురి ఏఈ ఎలక్ట్రికల్ ఆఫీసర్ కి సీఐ ధర్మపురి వారు రిక్విజేషన్ అందజేయడం జరిగిందని తెలిపారు. ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ వారు కూడా దానిపైన చర్య తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం కొన్ని లాడ్జీలు, గెస్ట్ హౌస్‌లు సరైన రికార్డులు నిర్వహించకుండా, గుర్తింపు కార్డులు తీసుకోకుండా, సంబంధిత వ్యక్తుల పూర్తి వివరాలు మరియు ఫోన్ నెంబర్లు నమోదు చేయకుండా నిర్వహించబడటం వల్ల అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఏర్పడుతుందని కావున ఇటువంటి నిర్లక్ష్య ధోరణులు శాంతి భద్రతలకు భంగం కలిగించడమే కాకుండా దుష్టశక్తులు, నేరగాళ్లు మరియు అనుమానాస్పద వ్యక్తులకు ఆశ్రయం కల్పించే ప్రమాదం ఉందని ఈ సందర్భంగా సిఐ హెచ్చరించారు. కావున



ధర్మపురి పరిధిలోని అన్ని లాడ్జీలు, గెస్ట్ హౌస్‌లు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ పొందడం, వచ్చిన వారి పూర్తి వివరాలు నమోదు చేయడం, ఆధార్ లేదా ఇతర గుర్తింపు కార్డులు తీసుకోవడం, సీసీటీవీ కెమెరాలను సక్రమంగా నిర్వహించడం మరియు ప్రభుత్వ నిబంధనలు పూర్తిగా పాటించడం అవసరమని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం కొనసాగుతుందని. ఈ సందర్భంగా పోలీసు అధికారులు స్పష్టం చేశారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి : సీపీఎం

**నల్గొండ, ప్రతినిధి మే 19 (ది క్రైమ్ న్యూస్):** పేద ప్రజలపై భారాలు మోపే పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నిడమనూరు మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా ఆటోను లాగుతూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శి కందుకూరి కోటేశ్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి పేద ప్రజలపై భారమయ్యాయని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. గ్యాస్ కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు అన్ని ధరలను పెంచి ప్రజలను కష్టాల్లోకి నెట్టేస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తూ ప్రభుత్వం తన పరిపాలనా బాధ్యతలను విస్మరిస్తోందని ఆరోపించారు. పాలనలో వైఫల్యం చెందుతూ ప్రజలకు పొదుపు సూక్తులు చెప్పడం సరికాదన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించకపోతే దేశ ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కోమాండ్ల గురువయ్య, నల్లబోతు సోమయ్య, ఆకారపు నరేష్, మలికంటి చంద్రశేఖర్, వెంపటి మహేష్,



కొంచెం శేఖర్, కోదండ చరణ్ రాజ్, వింజమూరి శివ, బొడ్డు లింగయ్య, గుప్తా శ్రీనివాస్ రెడ్డి, నడ్డి నాగరాజు, వెంకటమ్మ, సాంబయ్య, మేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహణ



**నల్గొండ, ప్రతినిధి మే 19 (ది క్రైమ్ న్యూస్):** దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, ఆదర్శ నాయకుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతిని నిడమనూరు మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండేటి శ్రీను, మండల కార్యదర్శి కందుకూరు కోటేష్ మాట్లాడుతూ ఆదర్శవంతమైన విలువలతో రాజకీయాలు చేయడం కమ్యూనిస్టులకే సాధ్యమని, దీనికి సుందరయ్య జీవితమే నిదర్శనమని అన్నారు. భూస్వామ్య కుటుంబంలో జన్మించినప్పటికీ భూస్వామ్య పెత్తందారీ విధానాలకు వ్యతిరేకంగా చిన్ననాటి నుంచే పోరాటం చేసిన మహానేత సుందరయ్య అని కొనియాడారు. తెలంగాణలో భూస్వామ్య, జమీందారీ, రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. వ్యవసాయ కార్మికులకు కూలీలు పెంచాలని, భూమిలేని పేదలకు భూములు పంచాలని డిమాండ్ చేస్తూ సంఘాలను ఏర్పాటు చేసి కూలీ, భూమి పోరాటాలు నిర్వహించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కోమండ్ల గురువయ్య, నల్లబోతు సోమయ్య, మల్లికంటి చంద్రశేఖర్, ఆకారపు నరేష్, వెంపటి మహేష్, ఇంజమూరి శివ, కొంచెం శేఖర్, ముత్యాల కేశవులు, కోదండ చరణ్ రాజు, గుప్త శ్రీనివాస్ రెడ్డి, నడ్డి నాగరాజు, బొడ్డు లింగయ్య, వెంకటమ్మ, సాంబయ్య, మేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం రావాలి

**జాతీయ హరిత దళం జిల్లా కో ఆర్డినేటర్ గూళ్ళ అంజన్ కుమార్**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పర్యావరణం పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం రావాలని జాతీయ హరిత దళం జిల్లా కో ఆర్డినేటర్ గూళ్ళ అంజన్ కుమార్ తెలిపారు. 99 రోజుల పర్యావరణ అవగాహన కార్యక్రమంలో భాగంగా లక్ష్యంతో కూడిన వేసవి శిబిరం పెద్దపల్లి మండలం అప్పన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో తెలంగాణ జాతీయ హరిత దళం సహకారంతో 99 రోజుల పర్యావరణ అవగాహన కార్యక్రమంలో భాగంగా లక్ష్యంతో కూడిన వేసవి శిబిరం ఘనంగా నిర్వహించారు. రక్షించడం-సంరక్షించడం- ప్రోత్సహించడం అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో స్థానిక పర్యావరణ సమస్యలపై చర్చలు నిర్వహించారు. ఉపరితల, భూగర్భ జలాల కొరత, జల వనరుల కాలుష్యం, గాలి కాలుష్యం, వ్యర్థాల నిర్వహణ సమస్యలు, ప్లాస్టిక్ కాలుష్యం, పరిశుభ్రత లోపం, పచ్చదనం తగ్గిపోవడం వంటి అంశాలపై అంజన్ కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెంపొందించేందుకు స్కిట్స్, డ్యాన్స్ కార్యక్రమాలు నిర్వహించగా యోగా, డ్రాయింగ్ పోటీలు ఏర్పాటు చేశారు. పోటీలలో విజేతలైన విద్యార్థులకు పెద్దపల్లి జిల్లా విద్యాధికారి జి. శారద గారు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పిఎం. షేక్, వేసవి శిబిరం పీఎం, ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం, జీవశాస్త్ర ఉపాధ్యాయులు శ్రీనివాస్, సురేందర్, వంగ అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో తాము భాగస్వాములు అవుతామని ప్రతిజ్ఞ చేశారు.

## నేటి సమాజంలో వ్యాపారం అనేది ఎప్పుడు కొత్త కాదు

**ఒకరికి ఒకరు వ్యాపారం అందించడమే నేడు నడుస్తున్న నెట్వర్**







**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** వార్షిక ఉత్సవంతో ఆత్మవిశ్వాసం నిండి బలం రెట్టింపయ్యింది, వ్యాపారాలు సూరినితో పోటీపడి దేదీప్యంగా వెలుగుతున్నాయి, మనసు లక్ష్యాన్ని ఖచ్చితంగా తాకుతుందని బాణం వదిన విల్లులా నిబ్బరంగా ఉంది. అనంత కాల వాహినిలో ఈ ఏడాది మొదటి వార్షికోత్సవ ఆనవాళ్లు మరువలేనివి, ఈ జీవితమే డబ్బుకు కొలమానం చిన్న చితకా సంపాదన విధానాలు ప్రతి సంపాదనకు తీయని బాధలు, ప్రతి సంపాదనకు ఎన్నో సాహసాలు ఎన్నో అనుభూతులు అనుభవాలు ప్రత్యక్ష, పరోక్ష ప్రభావాలు, డబ్బు నేటి ఐచ్ఛిక అవసరం మనుగడ అవశ్యం ఆశ, లక్ష్యం, గమ్యం ఎన్నుకునే దానికి అర్థం, పరమార్థం, అనేక వ్యాపార పరిచయాలు అర్థ, సమర్థ ప్రయత్నాలు ఆటుపోట్లు, ఎత్తు పల్లాలు మధుర స్మృతులు, మరువని జ్ఞాపకాలు బతుక నేర్పిన పాఠాలు ఎన్నుకునే అభ్యసనానుభవాలు బరువు బాధ్యతలు, బతుకు దెరువులు డబ్బుకు పరితపించే ప్రాధాన్యాలు భవిష్యత్తు ప్రణాళిక ముఖ్య ఘట్టాలు అన్నీ కీలకమే సంక్లిష్ట అనుభవమే బేరీజులు ముదింపులు గౌడ్స్ బిజినెస్ నెట్వర్క్ ఎలైట్ సొసైటీ కీలకమైన అంశం తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానాలు తప్పవు

**హాలియా మున్సిపాలిటీ అధికారుల హెచ్చరిక**





**నల్గొండ, ప్రతినిధి మే 19 (ది క్రైమ్ న్యూస్):** పురపాలక సంఘం హాలియా పరిధిలో వర్తక వ్యాపారులు మరియు దుకాణదారులు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ఉండాలని, తడి చెత్త మరియు పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని పలుమార్లు నోటీసులు, పత్రికల ద్వారా తెలియజేసినప్పటికీ కొందరు నిబంధనలు పాటించకుండా రోడ్లపై మరియు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీనిపై చర్యలు చేపట్టిన మున్సిపల్ అధికారులు మిర్యాలగూడ రోడ్ మరియు సాగర్ రోడ్ ప్రాంతాల్లో చెత్తను బహిరంగంగా వేస్తున్న వర్తక వ్యాపారులు, దుకాణదారులకు జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో హాలియా మున్సిపాలిటీ సానిటరీ ఇన్స్పెక్టర్ అంజయ్య, పర్యావరణ ఇంజనీర్ రవికుమార్, మున్సిపల్ సిబ్బంది మరియు జవాన్లు పాల్గొన్నారు.

## మొక్కజొన్న నిల్వ కోసం అదనంగా 5వేల మెట్రిక్ టన్నుల గోదాం సిద్ధం : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన మొక్కజొన్న నిల్వ కోసం ప్రస్తుతం అందుబాటులో ఉన్న గోదాములకు అదనంగా పెద్దపల్లి మండలం రంగాపూర్‌లో గల ఐజి గోదాంలో 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పెద్దపల్లి మండలంలోని రంగాపూర్‌లో గల ధాన్యం గోదాములను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, రేపటి నుంచి పెద్దపల్లి జిల్లాలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల నుంచి రంగాపూర్ ఐజి గోదాంకు మొక్కజొన్న తరలింపు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిల్వ ప్రక్రియలో ఎలాంటి అంతరాయం కలగకుండా తగినంత హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోలు, రవాణా, నిల్వ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. గోదాముల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించి నిల్వ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వరి, మొక్కజొన్న రైతుల అవస్థలు...

● మరోవైపు చెరువు మట్టి, మొరం అక్రమాలు ● కొనుగోలు కేంద్రాలలో అన్నదాతల అవస్థలు ● మిల్లర్ల దోపిడీపై, గుట్టల మట్టి అక్రమాలపై తగు చర్యలు తీసుకోవాలి ● మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి నియోజకవర్గంలో వరి మొక్కజొన్న రైతుల అవస్థలు చెరువు మట్టి మొరం అక్రమాలపై తగు చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పెద్దపల్లి నియోజకవర్గ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న అస్తవ్యస్తవ పరిస్థితి, మిల్లర్ల దోపిడీ, అలాగే చెరువులు--గుట్టల మట్టి అక్రమ తవ్వకాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర, గౌరవం, రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన తీవ్రంగా విమర్శించారు. మొక్కజొన్న రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే రోజులు తరబడి గడుపుతున్నారు. ఈ ఏడాది రైతులు నమ్మకంతో భారీ ఎత్తున మొక్కజొన్న సాగు చేసినప్పటికీ, ప్రభుత్వ నిర్లక్ష్యంతో కొనుగోళ్లు పూర్తిగా నత్తనడకన సాగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దపల్లి మార్కెట్ యార్డ్‌లో వందలాది మొక్కజొన్న కుప్పలు పేరుకుపోయినా, తూకాలు నత్త నడకగా సాగుతున్నాయన్నారు. రైతులు తమ పంట వద్దనే రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. ఎండలో, రాత్రివేళల్లో అక్కడే ఉండి పంటను కాపాడుకుంటున్న రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు.ఇప్పటికే వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఒకవేళ వర్షం పడితే రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందని హెచ్చరించారు. తడిసిన మొక్కజొన్నను కొనుగోలు చేయరని, నాణ్యత తగ్గిందని చెప్పి రైతులపైనే నష్టం మోపే ప్రమాదం ఉందన్నారు. నెలల పాటు కష్టపడి పండించిన పంట కళ్ల ముందే పాడై పోయే అవకాశం ఉండే పరిస్థితి ఉన్న ప్రభుత్వం మాత్రం కనీస స్పందన చూపకపోవడం బాధాకరమన్నారు. సంచుల కొరత పేరుతో రైతులనే బయట మార్కెట్‌లో అధిక ధరలకు బార్దాన్ కొనుక్కోమని అధికారులు ఒత్తిడి తెస్తున్నారని, ఒక సంచిపై సుమారు 9 రూపాయల నష్టం రైతుకు నేరుగా జరిగే పరిస్థితి ఉందని విమర్శించారు. వరి కొనుగోళ్లలో మిల్లర్ల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనప్పటికీ, రైస్ మిల్లుల అలాట్‌మెంట్‌లో జరిగిన జాప్యం వల్ల పెద్ద మొత్తంలో ధాన్యం ఇంకా కల్లాల్లోనే ఉందని తెలిపారు. రాబోయే వర్షాలతో రైతులు పంట నష్టపోయే పరిస్థితి నెలకొన్నదన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రమాణాలకు విరుద్ధంగా సంచికి అధిక తూకం వేస్తూ రైతుల ధాన్యాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. తరుగు పేరిట క్వింటాల్‌కు అదనంగా కిలోల కొద్దీ కోతలు పెడుతూ రైతును తీవ్రంగా మోసం చేస్తున్నారని ఆరోపించారు.గ్రేడ్-1 రకాల రైతులకు అన్యాయం ఎందుకు?గతంలో సన్న, సూపర్ ఫైన్ రకాల వరికి అదనపు ధర ఇచ్చేవారని, కానీ ఈసారి అన్నింటినీ 'కామన్' రకంగా చూపించి రైతులను నష్టపరిచారని ఆయన ప్రశ్నించారు. నాణ్యమైన పంట పండించిన రైతుకు ప్రోత్సాహం ఇవ్వాల్సిన ప్రభుత్వం, మిల్లర్లకు లాభం చేకూర్చే విధంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. "ఈ అదనపు ధాన్యం, తరుగు పేరిట కోసిన సొమ్ము ఎవరికి వెళ్తోంది? మిల్లర్లకా? అధికారులకా? లేక ప్రజాప్రతినిధులకా?" అని జిల్లా యంత్రాంగాన్ని నిలదీశారు.చెరువులు, గుట్టలను మింగేస్తున్న మట్టి మాఫియా పెద్దపల్లి నియోజకవర్గంలో చెరువులు, గుట్టల మట్టిని అక్రమంగా తరలిస్తూ మట్టి మాఫియా విచ్చలవిడిగా వ్యవహరిస్తోందని మాజీ ఎమ్మెల్యే ఆరోపించారు. వార్తా పత్రికల్లో వరుస కథనాలు వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. చెరువుల్లో నీరు ఉన్నా గండి కొట్టి నీటిని వదిలేసి మరీ ఇటుక బట్టీల కోసం మట్టిని తరలించడం అమానుషమన్నారు. రైతులకు ఉపయోగపడాల్సిన భూసారాన్ని కొందరు అక్రమార్కులకు అప్పగించడం దురదృష్ట కరమన్నారు. అనుమతులు లేకుండా గుట్టల తవ్వకాలు- గ్రామస్తులకు బెదిరింపులు శివపల్లి, చీమలపేట, పెగడపల్లి, పాలిథం, గోపయ్యపల్లి, తురకల మద్దికుంట, ఎదులాపూర్ ప్రాంతాల్లో ఎలాంటి మైనింగ్ అనుమతులు లేకుండా గుట్టలను తవ్వేస్తున్నారని ఆయన ఆరోపించారు. పెగడపల్లిలో హైకోర్టు స్టే ఉన్నప్పటికీ అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నాయని తెలిపారు. "మా ఊరి మట్టిని ఇవ్వం" అని ప్రశ్నిస్తున్న గ్రామస్తులను కేసులు పెడతామని, జైలుకు పంపిస్తామని బెదిరించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. మట్టి ఆదాయం గ్రామాలకు కాకుండా ఎక్కడికి? మట్టి తవ్వకాల ద్వారా వచ్చే సీనరేజ్ నిధులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఉపయోగపడాల్సి ఉండగా, వాటిని ప్రత్యేక ఖాతాల ద్వారా మళ్లించడం సరికాదని ఆయన విమర్శించారు. దీనివల్ల గ్రామాలకు రావాల్సిన నిధులు రాకుండా పోతున్నాయని, గ్రామీణాభివృద్ధి దెబ్బతింటోందన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రధాన డిమాండ్లు మొక్కజొన్న రైతులకు వెంటనే సరిపడా బార్దాన్ సరఫరా చేసి, ఆలస్యం లేకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. వరి ధాన్యం తూకంలో ప్రభుత్వం నిర్ణయించిన ప్రమాణాలకు విరుద్ధంగా సంచికి 42 కిలోల తూకం వేస్తూ , క్వింటాలుకు దాదాపు 5 కిలోల రైతుల ధాన్యాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. వెంటనే సంచికి 40 కిలోల 650 గ్రాములకే తుకాన్ని పరిమితం చేయాలన్నారు, మిల్లర్ల తరుగు దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. రైతు బాంధవులారా ఎట్టి పరిస్థితులను అదనపు తూకాన్ని ఒప్పుకోవద్దనీ కోరారు. గ్రేడ్-1 రకాల ధాన్యాన్ని పండించిన రైతులకు అన్యాయం ఎందుకు? రాత్రి వేళల్లో అక్రమంగా తిరిగే మట్టి లారీలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెరువు మట్టిని రైతులకే కేటాయించాలి. మైనింగ్ ఆదాయాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని కోరారు .ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు ఉప్పు రాజకుమార్, మార్కు లక్ష్మణ్, మోహన్ రావు,గుణపతి, జూపల్లి సందీప్ రావు, బోయిని రాజమల్లు,సలేంద్ర రాములు, కౌన్సిలర్ ఓదెలు, పెంచల శ్రీధర్, పూదరి చంద్రశేఖర్, దయాకర్, నాంసాని సరేష్ బాబు,దయాకర్, ముత్యాల రాజయ్య, పోసాని శ్రీనివాస్, గోపి,కాశి పాక వాసు, రేవల్లి తిరుపతి, సర్వేష్, చాంద్ పాషా, పల్లె మధు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేసిన భూంపెల్లి రాజయ్య





**మంథని, మే 19 (ది క్రైమ్ న్యూస్):** కమాన్‌పూర్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భూంపెల్లి రాజయ్య మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమాన్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కిష్టంపల్లె ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రత్యేకంగా కిష్టంపల్లెలో పేరుకుపోతున్న డ్రైనేజీ నీటిని బయటకు మళ్లించే సమస్యపై ఆయన మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. కిష్టంపల్లె నుంచి పిల్లిపల్లె రోడ్డులో ఉన్న కే.ఎన్ ఫంక్షన్ హాల్ వరకు డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరారు. ఈ సమస్య కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర అసౌకర్యాలు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా వర్షాకాలంలో పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోందని ఆయన వివరించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి శ్రీధర్‌బాబు సమస్యపై సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకునే దిశగా పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిసింది.

# ధమ్మ యోగా కేంద్రంలో 2వ బ్యాచ్ యోగా శిక్షణ ప్రారంభం

మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి పాల్గొనడం విశేషం



**నల్గొండ జిల్లా ప్రతినిధి మే 19 (ది క్రైమ్ న్యూస్):** హాలియా పట్టణంలోని శ్లోక స్కూల్ వేదికగా నిర్వహిస్తున్న ధమ్మ యోగా కేంద్రం ఆధ్వర్యంలోని 21 రోజుల ప్రత్యేక యోగా శిక్షణ తరగతులు ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. ప్రతిరోజూ ఉదయం 5:30 గంటల నుంచి 7:30 గంటల వరకు నిర్వహిస్తున్న ఈ యోగా సాధన కార్యక్రమంలో ప్రజలు ఆసక్తిగా పాల్గొంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం (19-05-2026) ప్రారంభమైన రెండో బ్యాచ్ శిక్షణ తరగతులకు ప్రత్యేక ఆకర్షణగా హాలియా మున్సిపాలిటీ చైర్మన్, ప్రజాహృదయ విజేత శ్రీ చింతల చంద్రారెడ్డి గారు హాజరై స్వయంగా యోగా శిక్షణలో సభ్యుడిగా చేరారు. ప్రజాసేవలో నిత్యం బిజీగా ఉండే వారు ఆరోగ్య పరిరక్షణ కోసం యోగా సాధన వైపు అడుగులు వేయడం హాలియా ప్రజలకు ఆదర్శంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. రెండో బ్యాచ్‌లో చైర్మన్ గారితో కలిపి మొత్తం 20 మంది సభ్యులు పాల్గొంటూ 21 రోజుల యోగా సాధన ప్రయాణాన్ని ప్రారంభించారు. "యోగేన చిత్తస్య పదేన వాచాం । మలం శరీరస్య చ వైద్యకేన" యోగా ద్వారా మనస్సు ప్రశాంతంగా, ప్రాణాయామం ద్వారా ఆరోగ్యం సిద్ధిస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే తమ లక్ష్యమని, ప్రతి ఒక్కరూ యోగాను జీవనశైలిగా మార్చుకోవాలని ధమ్మ యోగా కేంద్రం నిర్వాహకులు పిలుపునిచ్చారు. మరిన్ని వివరాలకు సంప్రదించండి: సెల్ : 7799295111

# పశువుల అక్రమ రవాణాపై నిఘా...

● చెక్ పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేసిన కరీంనగర్ సీపీ గౌష్ ఆలం ● ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందికి ఆదేశం





**కరీంనగర్ టౌన్, మే19(ది క్రైమ్ న్యూస్):** రానున్న బక్రీద్ పండగను పురస్కరించుకుని పశువుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా గట్టి నిఘా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా కరీంనగర్ జిల్లా పోలీస్ కమిషనర్ (సీపీ) గౌష్ ఆలం ఐ మంగళవారంనాడు కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్ చెక్ పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.?కరీంనగర్ రూరల్ డివిజన్ పరిధిలోని కొత్తపల్లి మండలం చింతకుంట, గంగాధర మండలం తుర్కాసినగర్, మరియు చొప్పదండి మండలంలోని ఆర్నకొండ వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్ పోస్టులను సీపీ స్వయంగా సందర్శించి, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. తనిఖీల్లో భాగంగా సీపీ గౌష్ ఆలం కింది అంశాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.క్షుణ్ణంగా వాహనాల తనిఖీ: చెక్ పోస్టుల గుండా వెళ్లే ప్రతి అనుమానాస్పద వాహనాన్ని, ముఖ్యంగా రవాణా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. చట్టవ్యతిరేకంగా పశువులను తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రికార్డుల పరిశీలన: చెక్ పోస్టులలో నిర్వహిస్తున్న తనిఖీ రిజిస్టర్‌లను నిశితంగా పరిశీలించి, ప్రతి వాహనం వివరాలను నమోదు చేయాలని సూచించారు. సీసీ కెమెరాల నిఘా: చెక్ పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును గమనించారు. నిరంతరం నిఘా కొనసాగేలా సాంకేతికతను ఉపయోగించు కోవాలన్నారు. చెక్ పోస్టుల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి కల్పించిన మౌలిక వసతులను సీపీ పరిశీలించారు. ఎండ తీవ్రత దృష్ట్యా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని, వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. చట్టాన్ని అతిక్రమించి పశువుల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సీపీ స్పష్టం చేశారు.ఈ తనిఖీల్లో సీపీ వెంట ట్రైనీ సోహం సునిల్, రూరల్ ఏసీపీ విజయకుమార్, ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్, ప్రదీప్ కుమార్, ఎస్సైలు సాంబమూర్తి, వంశీకృష్ణ, నరేష్ రెడ్డి స్థానిక పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కరెంటు షాక్‌తో మరణించిన మంజుల కుటుంబానికి 'మబ్బు అబ్బాస్ ఫౌండేషన్' ఆర్థిక సహాయం



**గుండాల మే 19(ది క్రైమ్ న్యూస్):** ఇటీవల కరెంటు షాక్‌కు గురై దురదృష్టవశాత్తూ మరణించిన కనగంటి మంజుల కుటుంబానికి మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ అండగా నిలిచింది. బాధితురాలి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్, ఆ కుటుంబానికి 5,016 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కష్టసమయంలో బాధిత కుటుంబానికి ధైర్యం చెప్తూ, ఫౌండేషన్ తరపున ఈ నగదును అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో,మాదిరెడ్డి అంజిరెడ్డి,మదూరి నరేష్ రెడ్డి, దొడ్డబోయిన, సురేష్ ఎలగందుల నవీన్, మలిపెద్ది విక్రమ్ రెడ్డి మల్లెపాక మదన్ మోహన్, మల్లె పాక పరుశరాములు తదితులు పాల్గొన్నారు.

## సహజంగా శరీరంలో కొలెస్ట్రాల్ కరిగించే ఆహారాలు ఇవే..

నేటి కాలంలో అనేక మంది చిన్న వయసులోనే కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడుతున్నారు. కొలెస్ట్రాల్ ప్రాథమికంగా ఒక రకమైన లిపిడ్. శరీరానికి అవసరమైన విధులు నిర్వర్తించడానికి ఇది చాలా అవసరం. ఈ కొలెస్ట్రాల్ ఈస్ట్రోజెన్, టెస్టోస్టెరాన్ వంటి హార్మోన్లను తయారు చేయడానికి సహాయపడుతుంది. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం.. ఈ రోజుల్లో చాలా మంది ఓట్ మీల్ తింటున్నారు. ఇందులో కొలెస్ట్రాల్‌ను కరిగించి నియంత్రించడంలో సహాయపడే కరిగే ఫైబర్ ఉంటుంది. ఇందులో మోనోశాచురేటెడ్ కొవ్వు కూడా ఉంటుంది. అలాగే కొన్ని రకాల పండ్లు కూడా కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. వీటిల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు గుండెను ఆరోగ్యంగా ఉంచడంతోపాటు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. యాపిల్స్‌లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇదిచెడు కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. కాబట్టి రోజూ యాపిల్స్ తప్పక తినాలి. అవి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. అలాగే, ప్రాసెస్ చేసిన ఆహారాలు, కేకులు, కుకీలు, పేస్ట్రీలు, జున్ను, నెయ్యి, వెన్న, చీజ్, జామ్ వంటి వాటికి కూడా దూరంగా ఉండాలి. మీగడ పాలు, దానితో చేసిన ఆహారం, నెయ్యి-వెన్న వీలైనంత తక్కువగా తీసుకోవాలి.అలాగే తగినంత నీళ్లు త్రాగాలి.దానితో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం తప్పనిసరి. సరైన ఆహారాల అలవాట్లు సగం జబ్బులను నయం చేస్తుంది.

# దివ్యాంగుల మధ్య చాతల అవినాష్ జన్మదిన వేడుకలు



**సుల్తానాబాద్, మే 19(ది క్రైమ్ న్యూస్):** సమాజంలో పుట్టినరోజు వేడుకల పేరిట లక్షలాది రూపాయలు వృథా ఖర్చు చేస్తూ ఆర్భాటాలు ప్రదర్శించే నేటి రోజుల్లో, సుల్తానాబాద్‌కు చెందిన చాతల అవినాష్ సరికొత్త సేవా దృక్పథాన్ని చాటారు. తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని వికాసం దివ్యాంగుల సెంటర్‌లో ఆయన ప్రత్యేక వేడుకలను నిర్వహించారు. నిష్కల్మష మనసు కలిగిన దివ్యాంగుల మధ్య ఆయన తన పుట్టినరోజును జరుపుకోవడం స్థానికంగా విశేష ఆదరణ పొందింది. ఈ సందర్భంగా చాతల అవినాష్ తన చేతుల మీదుగా సెంటర్‌లోని దివ్యాంగులకు పండ్లను పంపిణీ చేశారు. పండ్లు అందుకున్న దివ్యాంగులు ఎంతో హర్షం వ్యక్తం చేస్తూ, కరతాళధ్వనుల మధ్య ఆయనకు "హ్యాపీ బర్త్‌డే'' అంటూ మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేశారు. చాతల శివ మాట్లాడుతూ.. సమాజంలో ఎటువంటి వేడుకలైనా హంగు ఆర్భాటాలు లేకుండా, వ్యర్థమైన ఖర్చులు చేయకుండా ఇలాంటి అమాయకమైన దివ్యాంగుల మధ్య జరుపుకోవాలని పిలుపునిచ్చారు. వారి కడుపు నింపితే వచ్చే ఆనందం, తృప్తి మాటల్లో చెప్పలేనిదని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. అవినాష్ తీసుకున్న ఈ నిర్ణయం ఎందరికో ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు.ఈ ఆదర్శవంతమైన సేవా కార్యక్రమంలో చాతల శివతో పాటు పూసల వేణు, దేశెట్టి రమేష్, వికాసం సెంటర్ నిర్వాహకులు శ్రీనివాస్, సిబ్బంది , దివ్యాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీసీ కెమెరాలను ప్రారంభించిన హుజురాబాద్ ఏసిపి మాధవి





**జమ్మికుంట మే 19 (ది క్రైమ్ న్యూస్):** బిజిగిర్ షరీఫ్ దర్గాలో ఈనెల 28వ తారీకు నాడు జరిగే ఉరుసు ఉత్సవాల సందర్భంగా హుజరాబాద్ ఏసిపి మాధవి, జమ్మికుంట సిఐ రామకృష్ణ గౌడ్, బిజిగీర్ షరీఫ్ గ్రామ సర్పంచ్ రాచపల్లి వనజ-రాజయ్య కలిసి దర్గా కమిటీ వారు అమర్చిన పది సీసీ కెమెరాలు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించినారు.ఈ సందర్భంగా దర్గా కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ఇక్బాల్ ఏసీబీ మాధవి సిఐ రామకృష్ణ గౌడ్ సర్పంచ్ రాచపల్లి వనజ-రాజయ్య, వార్డు సభ్యుడు నయీముద్దీన్ కు శాలువాతో సన్మానించినారు.ఈ సందర్భంగా ఏసీపీ మాధవి మాట్లాడుతూ దర్గాకు వచ్చే భక్తుల భద్రత కోసం దర్గా వద్ద సీసీ కెమెరాలు అవసరమని దర్గా కమిటీ కు వివరించగా వారు తక్షణమే స్పందించి సీసీ కెమెరాలు అమర్చినందుకు దర్గా కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ఇక్బాల్ కు ఏసిపి శాలువాతో సన్మానించి అభినందించినారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ కరీం, కార్యనిర్వాహణ అధ్యక్షుడు మొహమ్మద్ తౌఫిక్ హుస్సేన్, సభ్యులు సర్వర్, అలీ షరీఫ్, అజ్మత్, రెహాన్, అయాన్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ మ్యాట్రిమోనీ ప్రొఫైల్స్‌తో మహిళలను మోసం చేస్తున్న నేరస్థుడి అరెస్ట్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** వివాహ సంబంధాల పేరుతో మహిళలను మోసం చేస్తున్న ఓ నేరస్థుడిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివిధ మ్యాట్రిమోనీ యాప్‌లలో నకిలీ ప్రొఫైల్స్ సృష్టించి మహిళలను మోసం చేస్తున్న ఘటనలపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. సైబర్ క్రైమ్స్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ టి. సాయిమనోహర్ తెలిపిన వివరాల ప్రకారం, పశ్చిమ గోదావరి జిల్లా ఉంద్రాజవరం ప్రాంతానికి చెందిన మంద వెంకట కామేశు అనే వ్యక్తి తెలుగు మ్యాట్రిమోనీ, రెడ్డి మ్యాట్రిమోనీ, బ్రాహ్మణ మ్యాట్రిమోనీ, కమ్మ మ్యాట్రిమోనీ తదితర మ్యాట్రిమోనీ యాప్‌లలో తాను ధనికుడు, స్థిరపడిన వ్యక్తినని చూపిస్తూ నకిలీ వివరాలతో ప్రొఫైల్స్ సృష్టించాడు. వివాహ సంబంధాల కోసం చూస్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకుని వాట్సాప్ కాల్స్, ఇన్‌స్టాగ్రామ్ చాట్స్ ద్వారా పరిచయం పెంచుకుని నమ్మకం సంపాదించేవాడు. తర్వాత అత్యవసర అవసరాలు ఉన్నాయని, వ్యక్తిగత సమస్యలు ఉన్నాయని నమ్మించి డబ్బులు పంపించాలని కోరడంతో పాటు క్రెడిట్ కార్డు వివరాలు, ఓటీపీలు, బ్యాంకు ఖాతా సమాచారం సేకరించి మోసాలకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. ఇలా మోసం చేసి సేకరించిన డబ్బును గోవాలో ఆన్‌లైన్ బెట్టింగ్, క్యాసినోలకు వినియోగించినట్లు దర్యాప్తులో తేలింది. నిందితుడిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మ్యాట్రిమోనీ మోసాలు, చీటింగ్ కేసులకు సంబంధించిన దాదాపు 20 కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయస్థానం జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. సైబర్ క్రైమ్ పోలీసులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తూ, మ్యాట్రిమోనీ, సోషల్ మీడియా వేదికలలో పరిచయం అయ్యే వ్యక్తులను పూర్తిగా ధృవీకరించకుండా నమ్మవద్దని సూచించారు. ఫోటోలు, ఉద్యోగం, విలాసవంతమైన జీవనశైలి ఆధారంగా మాత్రమే విశ్వసించవద్దని తెలిపారు. అలాగే ఓటీపీలు, బ్యాంక్ ఖాతా వివరాలు, డెబిట్ లేదా క్రెడిట్ కార్డు సమాచారం వంటి వ్యక్తిగత ఆర్థిక వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. సైబర్ నేరాలపై అనుమానం ఉన్న వెంటనే సమీప సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ లేదా 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు.

# కైదమ్మ కుంట చెరువు సుందరీకరణకు చర్యలు వేగవంతం

**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కైదమ్మ కుంట చెరువు, ఈర్ల చెరువుల సుందరీకరణ, పునరుద్ధరణ పనులను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఇరిగేషన్, సీఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. నెక్సస్ సెలెక్ట్ మాల్స్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న చెరువు పునర్జీవన కార్యక్రమంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ కైదమ్మ కుంట చెరువు, ఈర్ల చెరువుల పునరుద్ధరణతో ప్రాంత దశ దిశ మారుతుందని తెలిపారు. వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం భాగస్వామ్యంతో చేపడుతున్న ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మురికి కూపంలా మారిన చెరువును స్వచ్ఛమైన సుజల జలంతో ఆహ్లాదకరమైన ప్రదేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. చెరువు చుట్టూ చెట్లు నాటడం, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, చెరువు కట్ట బలోపేతం, అలుగు మరమ్మత్తులు, ఫెన్సింగ్ నిర్మాణం చేపడతామని తెలిపారు. అదేవిధంగా చెరువులో మురుగు నీరు కలవకుండా ప్రత్యేక యూజీడీ పైప్‌లైన్ నిర్మించి కలుషిత జలాలను మళ్లించే చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. చెరువు సుందరీకరణ పనులు నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువుల సంరక్షణలో ప్రజలు కూడా



భాగస్వాములు కావాలని, సామాజిక బాధ్యతతో చెరువులను పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ గులాం, సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం డీఈ శ్రీదేవి, ఏఈ ప్రతాప్, సీఎస్ఆర్ ప్రతినిధులు, స్థానిక నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, సుదేశ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# దోపిడీ జరిగిన 11 రోజుల్లోనే అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- ప్రజల్లో విశ్వాసం నింపిన కరీంనగర్ సీపీ గౌస్ అలంకి అభినందనలు
- శాంతిభద్రతల విషయంలో రాజీపడని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్

**కరీంనగర్ టౌన్, మే19(ది క్రైమ్ న్యూస్):** గత కొద్ది రోజుల క్రితం కరీంనగర్ నగరంలోని పీఎంజే జువెలరీలో జరిగిన భారీ నగల దోపిడీ కేసును కేవలం 11 రోజుల వ్యవధిలోనే చేధించి, అంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను, పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంచిన కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలం కి, పోలీసు బృందానికి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా నేడు పులి ఆంజనేయులు గౌడ్ పలువురు కాంగ్రెస్ నేతలతో కలిసి పోలీస్ కమిషనరేట్ లో కమిషనర్ గౌస్ ఆలంని ప్రత్యేకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. అనంతరం పులి ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా పనిచేస్తుందని స్పష్టం చేశారు. దొంగతనం జరిగిన 11 రోజుల్లోనే దుండగులను పట్టుకోవడం పోలీసు శాఖ చిత్తశుద్ధికి, ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై, పోలీసులపై ప్రతిపక్షాలు కావాలని దుష్ప్రచారం చేయాలని ఉబలాటపడటం సిగ్గుచేటని ఆయన ధ్వజమెత్తారు. పోలీసులు రేయింబవళ్లు కష్టపడి కేసును చేధిస్తుంటే, ప్రతిపక్ష నాయకులు మాత్రం ఇంట్లో కూర్చుని అసత్య ఆరోపణలు చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం పనిచేసే పోలీస్ వ్యవస్థపై పౌరులు, ముఖ్యంగా రాజకీయ నాయకులు గౌరవంగా, హుందాగా ప్రవర్తించాలని హితవు పలికారు. ప్రతిపక్షాలకు




చిత్తశుద్ధి ఉంటే పోలీసులను అభినందించాలే తప్ప, రాజకీయ లబ్ధి కోసం నిందలు వేయడం మానుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నేరస్తులు ఎంతటివారైనా తప్పించుకోలేరని, ఇదే ఘటన దానికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, తాడిజెర్రి సర్పంచ్ రామిడి రాజిరెడ్డి, కిసాన్ సెల్ వైస్ ప్రెసిడెంట్ నూనె గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వంగల విద్యాసాగర్, కుంబాల రాజ్ కుమార్, గంగుల దిలీప్ కుమార్, బండిపెల్లి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్

- గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి

**గోదావరిఖని క్రైమ్ (ది క్రైన్ న్యూస్):** సమాజంలో నేరాల అదుపు, ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తున్నట్లు గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనా రెడ్డి తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వినోబా నగర్, రెల్లివాడ, లెనిన్ నగర్ ప్రాంతాల్లో పోలీసుల ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 40 ద్విచక్ర వాహనాలను గుర్తించి, వాటి యజమానులకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా సీఐ ఇంద్రసేనా రెడ్డి మాట్లాడుతూ, స్థానిక ప్రాంతాల్లో యువత సంఖ్య ఎక్కువగా ఉన్నందున వారి భవిష్యత్తును నాశనం చేసే గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై ప్రత్యేక అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. సాంకేతికత పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు కూడా ఎక్కువవు తున్నాయని, ప్రజలు అపరిచిత లింకులను ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు, బ్యాంక్ ఖాతా వివరాల వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ చెప్పకూడదని సూచించారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా మహిళలను, బాలికలను వేధింపులకు గురిచేస్తూ, అసభ్యకర సందేశాలు పంపినా లేదా ఫోటోలను మార్ఫింగ్ చేసి పోస్టులు పెట్టినా కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ కోరారు. ఇటీవల కాలంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించడంతో పాటు వాహన పత్రాలను దగ్గర ఉంచుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి రోడ్డుపైకి పంపితే తల్లిదండ్రులపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుతం వేసవి సెలవుల నేపథ్యంలో ప్రజలు ఊర్లకు వెళ్లేటప్పుడు ఇళ్లకు తగిన రక్షణ ఏర్పాట్లు చేసుకోవాలని, విలువైన వస్తువులను ఇంట్లో వదిలి వెళ్లవద్దని సూచించారు. సమాజంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలంతా పోలీసులకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లో గోదావరిఖని వన్‌టౌన్ ఎస్ఐలు రమేష్, మనోహర్, అనూష, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్, అంతర్గాం ఎస్ఐ వెంకట స్వామి, స్పెషల్ పార్టీ సిబ్బంది మరియు స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





# ఆస్బెస్టాస్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా

## పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఆస్బెస్టాస్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలోని ఆస్బెస్టాస్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీని వివేకానంద నగర్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఆయన శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ ఆస్బెస్టాస్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ఎన్నికైన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని, కాలనీలో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. కాలనీలో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. అదేవిధంగా నూతన కార్యవర్గ సభ్యులు కాలనీ వాసులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యలపై స్పందించాలని సూచించారు. కాలనీని ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అసంపూర్తిగా ఉన్న పెండింగ్ పనులను త్వరలోనే పూర్తి చేసి, మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నరేష్, ఉపాధ్యక్షుడు నర్సిములు, ప్రధాన కార్యదర్శి మహ్మద్ హుస్సేన్, సంయుక్త కార్యదర్శి రఫిక్, ఖజాంచి పుష్పతో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# కోడి పందాలు ఆడితే ఉక్కుపాదం

## పెద్దపల్లి డిసిపి రామ్ రెడ్డి హెచ్చరిక

**శివపల్లి బోడా గుట్ట వద్ద కోడి పందాల ముఠా అరెస్ట్**

**14 మంది నిందితులు అదుపులోకి.. నగదు, వాహనాలు స్వాధీనం**

**సాహసోపేతంగా పనిచేసిన పోలీస్ సిబ్బందికి నగదు రివార్డులు**



**సుల్తానాబాద్, మే 19(ది క్రైమ్ న్యూస్):** కోడి పందాలు ఆడే వారిపై ఉక్కు పాదం మోపుతామని, మూగ జీవాలను హింసించడం చట్టరీత్యా నేరమని పెద్దపల్లి డిసిపి రామ్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలిగేడు మండలం శివపల్లి గ్రామ శివారులోని బోడా గుట్ట వద్ద రహస్యంగా, చట్టవిరుద్ధంగా కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు దాడి చేశారు. మూడు రోజుల పాటు రహస్యంగా రెక్కీ నిర్వహించి, పకడ్బందీ వ్యూహంతో 14 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుండి 6 పందెం కోళ్ళు, 6 కత్తులు, 13 మొబైల్స్, 1 ఎర్టిగా కారు, 7 ద్విచక్ర వాహనాలతో పాటు రూ. 40 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు డిసిపి తెలిపారు. అరెస్ట్ అయిన 14 మంది వ్యక్తులు కార్తీక్ రావు, శంకర్, రాజు (శివపల్లి), రాజు, నాగరాజు, అఖిల్ (పెద్దపల్లి), పవన్ (మందమర్రి గుడిపల్లి), రాకేష్, రవీందర్, సతీష్ (ఇందారం), మనోహర్, రహీం (గోదావరిఖని), మహేష్ (రామగిరి), సమాద్ (టేకుమట్ల జైపూర్)లను అరెస్ట్ చేసి మీడియా ముందు హాజరుపరిచారు. పెద్దపల్లి ఏసిపి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో పెద్దపల్లి, సుల్తానాబాద్ సిఐ లు రంజిత్ రావ్, కె. ప్రవీణ్, సుల్తానాబాద్ ఎస్సై చంద్రకుమార్, జూలపల్లి ఎస్సై సనత్ రెడ్డి, ఎలిగేడు ఎస్సై మధుకర్, బసంత్ నగర్ ఎస్సై శ్రీధర్, ఎస్సై నరేష్ , సిబ్బంది పాల్గొన్నారు. ప్రాణాలకు తెగించి ముఠాను పట్టుకున్న సిబ్బందికి త్వరలోనే నగదు రివార్డులు అందజేస్తామని డిసిపి ప్రకటించారు. కోడి పందాల వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని, ఎక్కడైనా పందాలు జరిగితే డయల్ 100కి సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు.

# ట్యాంక్ నిర్మాణంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం

**గత పాలకుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల అలసత్వం - మిషన్ భగీరథ తాగునీరు అందకుండా పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు**





**రామగిరి, మే 19(ది క్రైమ్ న్యూస్):-** రామగిరి మండలం కల్వచర్ల గ్రామం రాంనగర్ లోని 60 వేల లీటర్ల వాటర్ ట్యాంక్‌లోకి మిషన్ భగీరథ నీళ్లు నింపుతున్న సమయంలో ట్యాంక్ చుట్టూ లీకేజీలు బయటపడడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గత పాలకుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల అలసత్వం కారణంగా నిర్మించిన వాటర్ ట్యాంక్ పూర్తిస్థాయిలో పనికిరాని పరిస్థితికి చేరింది. ట్యాంక్ నిర్మాణ పనులు పూర్తయ్యాక నీటిని నింపి సరైన విధంగా పరీక్షలు నిర్వహించకుండా, పనులు పూర్తయ్యాయని చూపించి కాంట్రాక్టర్లు బిల్లులు తీసుకున్నట్లు గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు కూడా సరైన పర్యవేక్షణ చేయకపోవడంతో ఈ సమస్య మరింత తీవ్రమైంది. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా గ్రామ ప్రజలకు అందాల్సిన మిషన్ భగీరథ తాగునీరు అందకుండా పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లీకేజీలను పూర్తిగా మరమ్మతు చేసి, వాటర్వి ట్యాంక్‌ను వినియోగానికి అనుకూలంగా మార్చి గ్రామ ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# విశ్వేజి



## వడగాలులతో గుండె దడ!

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా, వడగాలులతో గుండె, ఊపిరితిత్తులు దెబ్బతినే ప్రమాదం ఉన్నదని అంటున్నారు. అధిక వేడి వాతావరణంలో శరీర ఉష్ణోగ్రత తనను తాను నియంత్రించుకునే లక్షణం చెదిరిపోతుందని చెబుతున్నారు. వడదెబ్బతో రక్తపోటు తగ్గుతుంది. ఫలితంగా, ముఖ్యమైన అవయవాలకు తగినంతగా రక్తం సరఫరా కాదు. గుండెపై ఒత్తిడి పెరిగి.. గుండెదడ లాంటి సమస్యలూ వస్తాయి. కొన్ని సందర్భాల్లో రక్త ప్రసరణ తగ్గి.. గుండె కండరాలు దెబ్బతినే అవకాశం కూడా ఉంటుంది. దీర్ఘకాలంలో హృదయ సంబంధ వ్యాధులు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. ఇక వడగాలులతో ఊపిరితిత్తులపై ఒత్తిడి పెరిగి.. శ్వాసకోస సమస్యలు చుట్టుముడతాయి. ముఖ్యంగా, ఆస్తమా లాంటి దీర్ఘకాలిక శ్వాస సంబంధ వ్యాధులతో బాధపడుతున్నవారిని మరింతగా ఇబ్బందిపెడతాయి. వీరిలో శ్వాస ఆడకపోవడం, గురక, దగ్గుకు కారణం అవుతుంది. ఉష్ణోగ్రతలు మరింత పెరిగితే.. ఊపిరితిత్తుల వాపు, న్యుమోనియాకూ దారితీస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సురక్షితంగా ఉండాలంటే..

పగటి వేళలో ప్రతి 20 %–% 30 నిమిషాలకు ఓసారి గ్లాసెడు నీళ్లు తాగాలి.
వేడి ఎక్కువగా ఉండే సమయాల్లో శ్రమతో కూడిన పనులకు దూరంగా ఉండాలి.
హృదయ, శ్వాసకోశ సమస్యలు ఉన్నవాళ్లు తమ లక్షణాలను నిశితంగా గమనిస్తుండాలి.
అవి తీవ్రమైతే వెంటనే వైద్యులను ఆశ్రయించాలి.

## బ్యూటీ సీక్రెట్

పాదాల పగుళ్లను తగ్గించడంలో పసుపు నూనె అద్భుతంగా పనిచేస్తుంది. కొబ్బరినూనె లేదా ఆముదం నూనెలో రెండు చుక్కల పసుపు నూనె కలిపి.. ఆ మిశ్రమంతో పాదాలను మృదువుగా మసాజ్ చేసుకోవాలి. ఈ టిప్‌ను రెగ్యులర్‌గా ఫాలో అయితే.. పగుళ్ల తగ్గడంతోపాటు పాదాలు కూడా మృదువుగా తయారవుతాయి.



## హార్మోన్ల సమస్యలు ఉన్న మహిళలు తీసుకోవాల్సిన ఆహారాలు ఇవే..!



నేటి తరుణంలో హార్మోన్ల అసమతుల్యతతో బాధపడే మహిళల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. మారిన జీవన విధానం,ఆహారపు అలవాట్లే ఈ సమస్యకు ప్రధాన కారణమని చెప్పవచ్చు. అయితే హార్మోన్ల అసమతుల్యత సమస్యలు ఎదుర్కొంటున్న చాలా మంది మహిళలు నేరుగా సప్లిమెంట్స్ లేదా హార్మోన్ బ్యాలెన్సింగ్ ఉత్పత్తులవైపు వెళ్లిపోతుంటారు. శరీరం ముందుగా సిద్ధంగా లేకపోతే అలాంటి ప్రయత్నాలు ప్రయోజనం ఇవ్వకపోగా సమస్యలను మరింత పెంచే అవకాశం ఉందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఈస్ట్రోజెన్ అధిక స్థాయిలకు సంబంధించిన లక్షణాలను తగ్గించాలంటే ముందుగా కాలేయం (లివర్) పనితీరును మెరుగుపరచడం చాలా అవసరమని వారు సూచిస్తున్నారు. శరీరంలో ఈస్ట్రోజెన్‌ను ప్రాసెస్ చేసి బయటకు పంపే ప్రధాన బాధ్యత లివర్‌దే. మొదట లివర్ ఈస్ట్రోజెన్‌ను విచ్ఛిన్నం చేస్తుంది. తరువాత దానిని శరీరం నుంచి బయటకు వెళ్లేలా ప్యాక్ చేస్తుంది. ఈ ప్రక్రియ మందగిస్తే ఈస్ట్రోజెన్ పూర్తిగా బయటకు వెళ్లకుండా మళ్లీ శరీరంలోనే తిరుగుతుందని, దీనినే ఈస్ట్రోజెన్ డామినెన్స్ అంటారని నిపుణులు వివరిస్తున్నారు.

ఫైబర్ సమృద్ధిగా అవసరం..

ఈ పరిస్థితిని సరిచేయడానికి ముందుగా గట్ హెల్త్‌పై దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు. రోజుకు 25 నుంచి 35 గ్రాముల ఫైబర్ తీసుకోవడం ద్వారా జీర్ణవ్యవస్థను మెరుగుపరచవచ్చని చెబుతున్నారు. ఇందుకు అరటి పండ్లు, మునగ ఆకులు, మెంతులు, అవిసె గింజలు వంటి ఆహారాలు ఉపయోగపడతాయని పేర్కొంటున్నారు. అయితే శరీరం ఎంతవరకు ఫైబర్‌ను తట్టుకోగలదో దాన్ని బట్టి మోతాదును నిర్ణయించుకోవాలని సూచిస్తున్నారు. అలాగే పెరుగు, కాంజీ, ఇంట్లో తయారుచేసిన పచ్చళ్ళ వంటి ఫెర్మెంటెడ్ ఫుడ్స్ కూడా గట్ ఆరోగ్యానికి మేలు చేస్తాయని చెబుతున్నారు. గట్ ఆరోగ్యం మెరుగైన తర్వాత లివర్‌కు అవసరమైన పోషకాలను అందించడం ముఖ్యం. గుడ్లు, షిటాకే మష్రూమ్స్‌లో ఉండే కొలిన్ లివర్ పనితీరుకు సహాయపడుతుంది. ఉల్లిపాయ, వెల్లుల్లిలో ఉండే సల్ఫర్ సమ్మేళనాలు డిటాక్సిఫికేషన్ ప్రక్రియకు మద్దతిస్తాయి. ఆకుకూరలు, ఉడికించిన పప్పుల్లో ఉండే సహజ ఫోలేట్ కూడా ఉపయోగకరమని పేర్కొంటున్నారు. సన్‌ఫ్లవర్ గింజల్లో ఉండే విటమిన్ బి6 కూడా హార్మోన్ల సమతుల్యతకు తోడ్పడుతుందని చెబుతున్నారు.

ఈస్ట్రోజెన్ ను మళ్లీ శోషించకూడదు..

అంతేకాకుండా శరీరంలో ఈస్ట్రోజెన్ మళ్లీ శోషించబడకుండా అడ్డుకోవడం కూడా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. నారింజ, యాపిల్ వంటి పండ్లలో ఉండే గ్లూకారిక్ యాసిడ్ ఈ ప్రక్రియలో సహాయపడుతుందని వెల్లడిస్తున్నారు. ఇది గట్‌లో ఉండే కొన్ని ఎంజైమ్స్‌ను అడ్డుకొని ఈస్ట్రోజెన్ మళ్లీ శరీరంలోకి వెళ్లకుండా సహాయపడుతుందని వివరిస్తున్నారు. ఇక ఈ అన్ని దశలను పాటించిన తరువాతే ఐ×వీ సప్లిమెంట్స్ గురించి ఆలోచించాలని సూచిస్తున్నారు. ఐ×వీ అనేది బ్రోకోలీ, కాలీఫ్లవర్, బ్రస్సెల్స్ స్ప్రౌట్స్ వంటి క్రూసిఫెరస్ కూరగాయల్లో ఉండే సంయోగం నుంచి ఉత్పత్తి అయ్యే పదార్థం. ఇది ఈస్ట్రోజెన్‌ను సురక్షిత మార్గంలో విచ్ఛిన్నం చేయడంలో సహాయపడుతుంది. అయితే గట్, లివర్, ఎలిమినేషన్ వ్యవస్థ సరిగా పనిచేయకముందే ఐ×వీ తీసుకుంటే శరీరంలో ఇప్పటికే ఉన్న బ్లాకేజ్ మరింత పెరిగి లక్షణాలు తీవ్రమయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

సప్లిమెంట్స్‌ను ఇలా తీసుకోవాలి..

అలాగే అవసరమైతే రోజుకు 1000 మిల్లీగ్రాముల ఐ×వీను కొవ్వు ఉన్న ఆహారంతో తీసుకోవచ్చని చెబుతున్నారు. అయితే అది కూడా శరీరం సిద్ధంగా ఉన్నప్పుడు మాత్రమే తీసుకోవాలని సూచిస్తున్నారు. అప్పటికీ సమస్యలు కొనసాగితే హార్మోన్ మెటబాలిజం ఏ దశలో ఇబ్బంది పడుతోందో తెలుసుకోవడానికి ప్రత్యేక పరీక్షలు చేయించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. అయితే చాలా మందికి ఆ దశ అవసరం ఉండదని, ముందుగా గట్, లివర్ ఆరోగ్యం మెరుగుపడితేనే ఈస్ట్రోజెన్ సంబంధిత సమస్యల్లో మంచి మార్పు కనిపిస్తుందని వివరిస్తున్నారు. మలబద్ధకం ఉన్నవారిలో ఈ సమస్యలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని కూడా నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## వేసవిలో శక్తినిచ్చే సూపర్ ఫుడ్స్ ఇవే!



చాలామంది వేసవికాలంలో ఎండ దెబ్బకు శరీరం డిహైడ్రేట్ అయ్యి శక్తిని కోల్పోయి నీరసంగా ఫీల్ అవుతూ ఉంటారు. అటువంటివారు సమ్మర్లో రోజంతా చురుకుగా ఉండడానికి శక్తినిచ్చే ఆరు రకాల సూపర్ ఫుడ్స్ ను తింటే మంచిదని డైటీషియన్లు చెప్తున్నారు. ఇక ఆ సూపర్ ఫుడ్స్ ఏంటి అనేది ప్రస్తుతం మనం తెలుసుకుందాం. అరటి పండ్లు అరటి పండ్లు మంచి పోషకాలతో కూడుకున్న ఆహారం. అరటి పండ్లలో పొటాషియం, కార్బోహైడ్రేట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మన శరీరానికి కావలసిన శీఘ్ర శక్తిని అందిస్తాయి. వీటిని ప్రీ వర్కవుట్ ఫుడ్ గా కూడా తీసుకోవచ్చు. గ్రీన్ టీ గ్రీన్ టీ కూడా మనకు శరీరానికి కావలసిన శక్తిని ఇస్తుంది. గ్రీన్ టీ తాగితే ఇది మన శరీరంలో అలసటను తగ్గించి జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది. వ్యాయామం చేసేటప్పుడు శక్తి స్థాయిలను కూడా ఇది పెంపొందిస్తుంది. కనుక ఈ సీజన్ లో గ్రీన్ టీ తాగడం ఎంతో మంచిది. పాలకూర పాలకూరలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఎవరైతే తక్కువ ఐరన్ స్థాయిలు కలిగి ఉంటారో వారు శక్తి హీనులుగా ఉంటారు. ఇక శక్తి వంతులుగా ఉండాలంటే కచ్చితంగా ఆహారంలో పాలకూరని భాగంగా చేసుకోవడం సూచించదగింది. చియా సీడ్స్ చియా సీడ్స్ ను కూడా మనం ఒక సూపర్ ఫుడ్ గా చెప్పుకోవాలి. చియా సీడ్స్ ను నానబెట్టి తీసుకోవడం వల్ల శక్తి వస్తుంది. ఇందులో ఉండే ఒమేగా త్రీ ఫ్యాటీ ఆసిడ్స్ మన శరీరానికి కావాల్సిన ఎనర్జీని ఇచ్చి ఎంతగానో దోహదం చేస్తాయి. డార్క్ చాక్లెట్ డార్క్ చాక్లెట్ చిన్న ముక్కను ప్రతిరోజు తింటే మన శరీరంలో రక్తప్రసరణ మెరుగుపడుతుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్లను శరీరానికి అందిస్తుంది. అలసటను తగ్గించి శక్తిని పెంచుతుంది. దృష్టిని కూడా మెరుగుపరుస్తుంది. ఓట్స్ ఓట్స్ లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఓట్స్ తిన్న తర్వాత మన శరీరంలో శక్తి పెరుగుతుంది. ఇక ఎండాకాలంలో అలసటతో బాధపడేవారు, శక్తి తక్కువగా ఉందని ఇబ్బంది పడేవారు,

## ఈ అలవాట్లను మార్చుకోకపోతే.. డాక్టర్లు కూడా మిమ్మల్ని రక్షించలేరు!

బరువు పెరగడం అనేది చాలా మందిని వేధించే సమస్య. కొందరికి ఇది ఆరోగ్య సమస్యల కారణంగా సంభవించినప్పటికీ, ఎక్కువ మందికి వారి రోజువారీ అలవాట్లే ప్రధాన కారణం. మనం చేసే చిన్న చిన్న పొరపాట్లు, నిర్లక్ష్యంగా తీసుకునే ఆహారం, జీవనశైలిలో మార్పులు క్రమంగా మన బరువును పెంచుకుంటూ పోతాయి. ఈ బరువు పెంచే అలవాట్లను గుర్తిస్తే, మనం ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చు. జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్: మొదటగా ఆహారం విషయానికి వస్తే, చాలా మంది సమయం లేకపోవడం లేదా ఇతర కారణాల వల్ల సరైన ఆహారం తీసుకోరు. దీనికి బదులుగా జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్ లేదా అధిక కేలరీలు ఉండే ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకుంటారు. పిజ్జాలు, బర్గర్‌లు, ఫ్రెంచ్ ఫ్రైస్ వంటి ఆహారాల్లో కేలరీలు, కొవ్వులు , చక్కెరలు అధికంగా ఉంటాయి. వీటిని తరచుగా తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు అందకపోయినా, అధిక మొత్తంలో కేలరీలు మాత్రం చేరుతాయి. ఇది క్రమంగా బరువు పెరగడానికి దారితీస్తుంది. భోజనం చేసే వేళల్లో మార్పులు: తరువాత, చాలా మందికి భోజనం చేసే వేళలు కూడా సరిగా ఉండవు. ఒకరోజు ఉదయం 8 గంటలకు తింటే, మరోరోజు 11 గంటలకు తినడం వల్ల జీర్ణక్రియ వ్యవస్థ గందరగోళానికి గురవుతుంది. అంతేకాకుండా, చాలా మంది రాత్రిపూట ఆలస్యంగా భోజనం చేస్తారు. రాత్రిపూట జీర్ణక్రియ నెమ్మదిగా జరుగుతుంది కాబట్టి, ఆహారం సరిగ్గా జీర్ణం కాక కొవ్వుగా మారే అవకాశం ఉంది. నిద్రపోయే ముందు భారీగా తినడం కూడా బరువు పెరగడానికి ఒక ముఖ్య కారణం. శీతల పానీయాలు: ఇక పానీయాల విషయానికి వస్తే, చాలా మంది శీతల పానీయాలు, చక్కెర కలిపిన జ్యూస్‌లు , ఇతర తీపి పానీయాలను ఎక్కువగా తాగుతారు. వీటిలో కేలరీలు చాలా ఎక్కువగా ఉంటాయి, కానీ పోషక విలువలు మాత్రం శూన్యం. వీటిని తాగడం వల్ల కడుపు నిండిన భావన కలగదు, కానీ శరీరానికి మాత్రం అధిక మొత్తంలో చక్కెర చేరుతుంది. ఇది ఇన్సులిన్ నిరోధకతకు దారితీసి, బరువు పెరగడానికి కారణమవుతుంది. నీరు తక్కువగా తాగడం కూడా బరువు పెంచే అలవాట్లలో ఒకటి. నీరు జీవక్రియను మెరుగుపరచడానికి మరియు ఆకలిని నియంత్రించడానికి సహాయపడుతుంది. కాబట్టి, తగినంత నీరు తాగకపోతే శరీరం డీహైడ్రేషన్‌కు గురవ్వడమే కాకుండా, బరువు కూడా పెరిగే అవకాశం ఉంది.


# మార్కెట్

## హైదరాబాద్‌లో భారత్ బయోటెక్

### కణ, జన్యు చికిత్స కేంద్రం

### జీనోమ్ వ్యాలీలో రూ.650 కోట్లతో ఏర్పాటు

హైదరాబాద్, మార్చి 20: హైదరాబాద్ ఆధారిత ఔషధ రంగ దిగ్గజం భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్.. ఇక్కడి జీనోమ్ వ్యాలీలో దాదాపు రూ.650 కోట్లతో ఓ కణ, జన్యు చికిత్స (సీజీటీ) కేంద్రాన్ని ప్రారంభించింది. ఇది వైరల్ వెక్టర్ ప్రొడక్షన్ ఫెసిలిటీ కూడా అని గురువారం సంస్థ ప్రకటించింది. అలాగే దేశంలోనే ఇది తొలి వర్టికల్లీ ఇంటిగ్రేటెడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కావడం గమనార్హం. 'సైంటిఫిక్ సవాళ్లను ఎదుర్కోవడంలో మా ఈ సెల్, జీన్ థెరపీ ఫెసిలిటీ ఓ నూతన శకానికి నాంది పలికింది' అని ఈ సందర్భంగా కంపెనీ ఓ ప్రకటనలో తెలియజేసింది. ప్రధానంగా క్యాన్సర్ వంటి జెనెటిక్ వ్యాధుల చికిత్సలో ఇక మంచి ఫలితాలు రాగలవన్న ఆశాభావాన్ని వెలిబుచ్చింది. ప్రస్తుతం జన్యు, కణ చికిత్సలు పెరిగిపోయాయని భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్లా తెలిపారు. తమకున్న అనుభవంతో వైద్య విధానాన్ని మరింత మెరుగుపరుస్తామన్న ఆయన వైరల్ వ్యాక్సిన్ల తయారీలో తమ ప్రతిష్ఠ ఈ సీజీటీతో మరింత పెరగగలదన్న విశ్వాసాన్ని కనబర్చారు. ఆంకాలజీ, అరుదైన వ్యాధుల చికిత్సలపై తాము దృష్టి పెట్టామని, అందులో భాగంగా తెచ్చినదే ఈ సీజీటీ అని భారత్ బయోటెక్ చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాచెస్ ఎల్లా అన్నారు. కాగా, ఈ కేంద్రం 50 వేల చదరపు అడుగుల్లో విస్తరించి ఉన్నది.




## అమ్మకానికి 28 హైవేలు!.. రూ 35,000 కోట్ల ఆస్తుల నగదీకరణకు మోదీ సర్కార్ ప్లాన్

న్యూఢిల్లీ : నిధుల సమీకరణ కోసం ఓవైపు ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాలను ఉపసంహరించుకుంటున్న మోదీ సర్కార్.. మరోవైపు జాతీయ రహదారుల ఆస్తులనూ వదలడం లేదు. ఈ ఆర్థిక సంవత్సరం (2026-27)లో 28 జాతీయ రహదారులను అమ్మేయాలని చూస్తున్నది మరి. 1,800 కిలోమీటర్లకుపైగా పొడవున్న ఈ నేషనల్ హైవేల ఆస్తుల నగదీకరణతో దాదాపు రూ.35,000 కోట్లను పొందాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్నట్టు సంబంధిత ప్రభుత్వ వర్గాల సమాచారం. ఇప్పటికే నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) అమ్మదగిన జాతీయ రహదారులను గుర్తించినట్టూ తెలుస్తున్నది. హర్యానా, యూపీల్లో.. విక్రయించాలనుకుంటున్న హైవేలలో ఎక్కువ భాగం హర్యానాలో ఉండగా, ఉత్తరప్రదేశ్ రెండో స్థానంలో ఉన్నట్టు ఓ ప్రభుత్వ అధికారి చెప్తున్నారు. కాగా, ప్రభుత్వ,



ప్రైవేట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్ (ఇన్విట్స్)తోపాటు టోల్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ (టీవోటీ) పద్ధతుల ద్వారా నగదీకరణకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. వాడుకలో ఉన్న రోడ్ల ద్వారానే కొత్త రహదారుల నిర్మాణానికి కాసులు రాబట్టాలన్నదే ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉద్దేశమని అంటున్నారంతా.

రూ.29,000 కోట్లు.. ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో హైవేల నగదీకరణతో ఖజానాకు రూ.29,000 కోట్లు వచ్చాయి. ఈ సంవత్సరం ఆరంభంలోనే తొలి ప్రభుత్వ ఇన్విట్ ద్వారా రూ.9,000 కోట్లకుపైగా నిధులను సమీకరించారు. 4 రాష్ట్రాల్లో 260కిపైగా కిలోమీటర్ల మేర ఉన్న 5 హైవేలను అమ్మేశారు. ఈ ఉత్సాహంతోనే మరిన్ని హైవేలను అమ్మకానికి తెస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ ఆర్థిక సంవత్సరం రూ.35,000 కోట్ల టార్గెట్‌ను కేంద్ర ప్రభుత్వం ఫిక్స్ చేసింది. అంతేగాక 2025-26 నుంచి 2029-30 మధ్య జాతీయ రహదారుల ఆస్తుల నగదీకరణతో రూ.4.42 లక్షల కోట్ల నిధులను సమీకరించాలన్న లక్ష్యాన్ని పెట్టుకోవడం గమనార్హం.

## పాన్ కార్డు పోయిందా? చింతించకండి..

### నిమిషాల్లో డూప్లికేట్ కోసం అప్లై చేయండి ఇలా!

పాన్ కార్డు పోగొట్టుకోవడం లేదా దొంగిలించబడటం అనేది ఈ రోజుల్లో చాలా సాధారణం అయిపోయింది. ఎన్నో ముఖ్యమైన పత్రాలతో పాటు పాన్ కార్డును కూడా ఎక్కడో పెట్టి మర్చిపోవడం లేదా అనుకోకుండా పోగొట్టుకోవడం సహజంగా జరుతుంది. కానీ పాన్ కార్డు లేకపోతే అనేక పనులు ఆగిపోతాయి. ముఖ్యంగా ఆర్థికపరమైన విషయాల్లో చాలా చిక్కులు ఎదురవుతాయి. అయితే మీరు అస్సలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు! పోగొట్టుకున్న పాన్ కార్డును తిరిగి పొందడం ఇప్పుడు చాలా సులభం. మీరు ఇంట్లో కూర్చొనే ఆన్‌లైన్‌లో డూప్లికేట్ పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. పాన్ కార్డు కేవలం ఒక ప్లాస్టిక్ ముక్క మాత్రమే కాదు, అది మీ గుర్తింపుకు చిహ్నం. ఈ రోజుల్లో పాన్ కార్డు ఒక ముఖ్యమైన పత్రంగా మారిపోయింది. గ్యాస్ కనెక్షన్ తీసుకోవాలన్నా, కొత్తగా బ్యాంకు ఖాతా తెరవాలన్నా, ఇంకా మరెన్నో ముఖ్యమైన పనులకు పాన్ కార్డు తప్పనిసరి. ఒకవేళ మీ పాన్ కార్డు పోతే, మీరు చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. అందుకే, పాన్ కార్డు పోగొట్టుకున్న వెంటనే డూప్లికేట్ కోసం దరఖాస్తు చేసుకోవడం చాలా ముఖ్యం. ఇప్పుడు డూప్లికేట్ పాన్ కార్డు కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలుసుకుందాం రండి.. డూప్లికేట్ పాన్ కార్డు కోసం




దరఖాస్తు చేసుకునే విధానం: అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించండి: మొదటగా మీరు (నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్) అధికారిక వెబ్‌సైట్‌కు వెళ్లాలి. వెబ్‌సైట్ చిరునామాను గూగుల్‌లో సెర్చ్ చేసి తెలుసుకోవచ్చు లేదా నేరుగా వెబ్‌సైట్‌కు వెళ్లడానికి ప్రయత్నించవచ్చు. వివరాలను నమోదు చేయండి: వెబ్‌సైట్‌లో డూప్లికేట్ పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే విభాగానికి వెళ్లండి. అక్కడ మీరు మీ పాన్ కార్డు నంబర్ (గుర్తుంటే), మీ 10 అంకెల ఆధార్ నంబర్ మరియు, మీ పుట్టిన తేదీని నమోదు చేయాలి. మీరు ఈ వివరాలను జాగ్రత్తగా , సరిగ్గా నమోదు చేయాలి.

# ఆంధ్రప్రదేశ్

## పవన్ కళ్యాణ్ ఆరోగ్యంపై కేంద్రమంత్రి ఆరా

### నేరుగా ఫోన్ చేసి పలకరించిన ప్రహ్లాద్ జోషి

అమరావతి,మే19 : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరోగ్యం గురించి కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి ఫోన్ చేసి ఆరా తీశారు. ఇటీవల పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స జరిగిన నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కొన్నిరోజుల క్రితం పవన్ కల్యాణ్‌కు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో ముక్కుకు సంబంధించిన శస్త్రచికిత్స జరిగిన విషయం తెలిసిందే. వైద్యుల సూచన మేరకు ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. 'మీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి. ఆరోగ్యం అన్నిటికన్నా ముఖ్యం. మీ ఆరోగ్యం బాగుంటేనే ప్రజల కోసం మరింత సమర్థంగా పని చేయగలుగుతారు' అంటూ పవన్ కల్యాణ్‌ను ఫోన్‌లో ప్రహ్లాద్ జోషి పరామర్శించారు. రాజకీయ బాధ్యతలతో పాటు వ్యక్తిగత ఆరోగ్యంపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. పవన్ కల్యాణ్ త్వరగా కోలుకొని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. 'నేను ఆంధ్రప్రదేశ్‌కు వచ్చినప్పుడు తప్పకుండా మిమ్మల్ని కలుస్తాను' అని డిప్యూటీ సీఎంకు చెప్పారు. అంతేకాకుండా పవన్ ఆరోగ్యం కోసం తాను తిరుపతి బాలాజీని ప్రార్థిస్తున్నానని ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు.

## ఫల్తా నియోజకవర్గంలో మమతకు షాక్

కోల్‌కతా,మే19 : పశ్చిమ బెంగాల్‌లోని ఫల్తా నియోజకవర్గంలో మమతా బెనర్జీకి షాక్ తగిలింది. 21 రీ పోలింగ్ జరగునున్న సమయంలో తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జహంగీర్ ఖాన్.. పార్టీ అధినేత మమతా బెనర్జీకి షాక్ ఇచ్చారు. మే 21న జరగనున్న రీపోలింగ్ నుంచి తాను వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మీడియా సమావేశం నిర్వహించిన ఆయన పలు కీలక విషయాలను వెల్లడించారు. నియోజకవర్గ ప్రజా ప్రయోజనాల దృష్ట్యా పోటీ నుంచి తాను తప్పుకుంటున్నట్లు జహంగీర్ ఖాన్ చెప్పారు. తాను ఫల్తా నియోజకవర్గ బిడ్డనని, ఈ ప్రాంతమంతా శాంతియుతంగా ఉండి అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నట్లు జహంగీర్ పేర్కొన్నారు. ఫల్తా అభివృద్ధికి ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రత్యేక ప్యాకేజీని ఇస్తున్నారని.. అందుకే తాను పోటీ నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. టీఎంసీ ఎమ్మెల్యే అభ్యర్థి నిర్ణయంతో మమతా బెనర్జీకి ఎదురుదెబ్బ తగిలినట్లు అయ్యింది. మరోవైపు మే 21న జరిగే ఎన్నికల్లో బీజేపీ తరఫున దేబాంగ్షు పాండా, కాంగ్రెస్ తరఫున అబ్దుర్ రజాక్ మొల్లా, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) తరఫున శంభు నాథ్ కుర్మి పోటీ పడనున్నారు. ఏప్రిల్ 29న రెండో దశ ఎన్నికల్లో భాగంగా ఫల్తా అసెంబ్లీ నియోజకవర్గానికి పోలింగ్ జరిగింది. మొత్తం 285 పోలింగ్ బూత్‌లలో ఓటు హక్కును వినియోగించు కునేందుకు ఓటర్లు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పలు బూత్‌ల వద్ద అల్లర్లు చోటుచేసుకున్నాయి. బీజేపీ అభ్యర్థి దేబాంగ్షు పాండా కూడా పలు ఆరోపణలు చేశారు. ఈవీఎంలపై ఉన్న బీజేపీ బటన్‌ను తెల్లటి జిగురుతో కప్పివేశారని, దీంతో ఓటర్లు తమ పార్టీకి ఓటు వేయలేకపోయారని ఆరోపించారు. ఈ మేరకు ఫల్తా నియోజకవర్గానికి మే 21న రీపోలింగ్ నిర్వహించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. కాగా, ఏప్రిల్ 23, ఏప్రిల్ 29 తేదీల్లో జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించింది.

## ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ స్వర్ణకాంత శర్మపై వ్యాఖ్యలు

### అరవింద్ కేజ్రీవాల్, సిసోడియాలకు కోర్టు ధిక్కరణ నోటీసులు

న్యూఢిల్లీ,మే19 : ఢిల్లీ హైకోర్టు జస్టిస్ స్వర్ణకాంత శర్మపై వ్యాఖ్యల కేసులో అరవింద్ కేజీవ్రాల్, మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్‌కు ఢిల్లీ హైకోర్టు షాక్ ఇచ్చింది. ముగ్గురికీ కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేసింది. జస్టిస్ స్వర్ణకాంత శర్మపై వ్యాఖ్యల కేసుపై జస్టిస్ నవీన్ చావ్లా, జస్టిస్ రవీందర్ దుడేజాలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. అరవింద్ కేజీవ్రాల్, మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్‌లకు ధర్మాసనం కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేసింది. వీరంతా నాలుగు వారాల లోపు సమాధానాన్ని దాఖలు చేయాలని కోర్టు ఆదేశించింది. విచారణను ఆగస్టు 4వ తేదీకి వాయిదా వేసింది.ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసును విచారిస్తున్న జస్టిస్ స్వర్ణకాంత శర్మను ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు, వారి మద్దతుదారులు టా÷-గ్గ÷ట్ చేశారు. సోషల్ మీడియాలో కొన్ని పోస్టులు, వీడియోలు పెట్టారు. ఓ విద్యాసంస్థలో జస్టిస్ స్వర్ణకాంత శర్మ మాట్లాడిన పాత వీడియోను ఎడిట్ చేసి, ఆమె ఓ రాజకీయ పార్టీకి అనుకూలంగా మాట్లాడుతున్నట్లుగా తప్పుగా ప్రచారం చేశారు. మె ఈ కేసును నిష్పక్షపాతంగా విచారించలేరని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఆ ప్రచారంపై జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఫైర్ అయ్యారు. తనపై సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం సాగించారనే ఆరోపణలపై గురువారం స్వచ్ఛందంగా కోర్టు ధిక్కరణ చర్యలను ప్రారంభించారు. అదే సమయంలో ఈ కేసు విచారణ నుంచి తప్పుకొంటున్నట్టు ప్రకటించారు.

## ఎపిలో వెయ్యి మినీ మార్టులు

### తక్కువ ధరలకే సరుకులు అందచేస్తాం

### పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

న్యూఢిల్లీ,మే19 : రాబోయే రోజుల్లో ఏపీలో వెయ్యి మినీ మార్టులు ఏర్పాటు చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రెండో రోజు దిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రానికి చెందిన పలు కీలక అంశాలపై వారితో చర్చించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మినీ మార్టుల ద్వారా మిల్లెట్స్ కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని మనోహర్ తెలిపారు. మినీ మార్టులలో మార్కెట్ ధరల కంటే తక్కువకు నాణ్యమైన సరకులు అందజేస్తామన్నారు. మరోవైపు.. అరకు కాఫీని దేశవ్యాప్తంగా అన్ని మిలిటరీ క్యాంటీన్లలో ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారని మంత్రి వివరించారు.

## భవనంపై నుంచి పడి కార్మికుడు మృతి

తిరుమల,మే19 : మూడంతస్తుల భవనంపై నుంచి పడి కార్మికుడు మృతి చెందిన ఘటన తిరుమలలో చోటు చేసుకుంది. అవధూత దత్తపీఠం వద్ద వాటర్ ట్యాంక్ మరమ్మతులు చేస్తుండగా.. కార్మికుడు ప్రమాదవశాత్తూ కాలుజారి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు తమిళనాడులోని తిరుపత్తూర్ వనియంబాడికి చెందిన మణికంఠన్ (35)గా గుర్తించారు. ఘటనపై తిరుమల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

### వేట నిషేధ భృతిని అందిస్తున్న సిఎం చంద్రబాబు

### మత్స్యకారుల సేవ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర




మచిలీపట్నం,మే19 : మత్స్యకారులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం అన్ని రకాలైన కార్యక్రమాలూ చేపడుతుందని రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాల్లో ఎక్కడా లోటు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేట నిషేధ భృతిని మత్స్యకారులకు తొలిసారిగా ప్రకటించింది సీఎం చంద్రబాబు నాయుడే అని ఈ సందర్భంగా గుర్తుచేశారు. మంగళవారం మచిలీపట్నం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'మత్స్యకారుల సేవ' కార్యక్రమానికి మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. తొలుత బియ్యం, నిత్యవసర వస్తువులతో పాటు డీజిల్ సబ్సిడీ కోసం నాడు నడకుదిటి నరసింహారావు కృషి చేశారని వివరించారు. మత్స్యకారులకు వేట నిషేధ భృతి ఏకంగా రూ.20వేలకు పెంచామని కొల్లు రవీంద్ర వివరించారు. తనకు మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసునన్నారు. రూ.4,000తో ప్రారంభించిన వేట నిషేధ భృతిని రూ.20 వేల వరకు పెంచిన ఘనత కూడా కూటమి ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. రూ.260 కోట్లు మత్స్యకార భరోసా పథకంతో మత్స్యకారుల ఖాతాల్లో జమ చేయడం హర్షణీయమన్నారు. మత్స్యకారుల జీవితాలను నాశనం చేసేలా వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ రెడ్డి జీవో నెం.217 తీసుకొస్తే.. దానిని కూటమి ప్రభుత్వం రాగానే రద్దు చేసిందని తెలిపారు. కృష్ణా జిల్లాలో 18 వేల మంది మత్స్యకారులకు వేట నిషేధ భృతిని అందించామని ఎక్సైజ్ శాఖ మంత్రి వివరించారు. డీప్ సీ బోట్స్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.1.20 కోట్లు కేటాయించినా.. ఇక్కడ సదుపాయాలు లేవన్నారు. సీ వీడ్ (సముద్రపు నాచు) పండించడం ద్వారా కూడా మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మచిలీపట్నంలో రూ.75 లక్షల వ్యయంతో పీతల హేచరీ ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు. మత్స్యకారులు 250 బోట్లతో ముఖ్యమంత్రి చంద్రబాబుకి ధన్యవాదాలు చెప్పడం హర్షణీయం అన్నారు. మత్స్యకారులను ఇంటికి పిలిచి విందు ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌కు ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర ధన్యవాదాలు తెలిపారు.

## ప్రభుత్వ ఆస్పత్రులకు రూ.919.13 కోట్లు విడుదల

### వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

అమరావతి,మే19 : ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు అనుబంధ ఆస్పత్రులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.919.13 కోట్లను విడుదల చేసింది. ఈ సందర్భంగా ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఓ ప్రకటన విడుదల చేశారు. బకాయిల చెల్లింపుల హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని స్పష్టం చేశారు. ట్రై-పార్టీ బిల్ డిస్కౌంటింగ్ విధానంలో నిధులు విడుదల చేసినట్లు వివరించారు. 785 ప్రైవేట్ ఆస్పత్రులు బిల్ డిస్కౌంటింగ్‌కు దరఖాస్తు చేసినట్లు తెలిపారు. ఆస్పత్రుల ఖాతాలకు ఇప్పటికే రూ.919.13 కోట్ల జమ చేశామని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ మేరకు ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు సీఈఓ చక్రధరబాబు.. మంత్రికి నివేదిక అందజేశారు. ఆస్పత్రుల విజ్ఞప్తి మేరకు వేగంగా బకాయిలు చెల్లించామని అన్నారు. ఏపీ సెంటర్ ఫర్గ్ ÷నాన్షియల్ సిస్టమ్స్ వెబ్ పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేశారని తెలిపారు. ట్రస్టు – ఆస్పత్రులు – పవర్గ్ ÷నాన్స్ కార్పొరేషన్ మధ్య ఒప్పందాలు జరిగాయని ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేట్ ఆస్పత్రులకు మొత్తం రూ.5,556 కోట్లు చెల్లించామని తెలిపారు. అదనంగా మరో రూ.919.13 కోట్లు విడుదల చేశామని అన్నారు. ఆరోగ్య సేవల బలోపేతానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

## రెస్టారెంట్‌లో కాల్పులు

### నలుగురు మృతి..8మందికి తీవ్ర గాయాలు

న్యూఢిల్లీ,మే19 : తుర్కియేలో దారుణం చోటుచేసుకుంది. 17 ఏళ్ల ఓ యువకుడు రెస్టారెంట్‌లో తుపాకితో కాల్పులకు తెగబడ్డాడు. ఈ కాల్పుల్లో నలుగురు చనిపోగా.. 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. దక్షిణ తుర్కియేలోని మెర్సిన్ సిటీలో సోమవారం ఈ ఘోరం చోటుచేసుకుంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. 17 ఏళ్ల ఓ యువకుడు సోమవారం రాత్రి టార్సస్‌లోని ఓ రెస్టారెంట్‌లోకి ప్రవేశించాడు. వెంట తెచ్చుకున్న షాట్ గన్‌తో రెస్టారెంట్‌లోని వారిపై కాల్పులకు తెగబడ్డాడు. అనంతరం అక్కడినుంచి పరారయ్యాడు. ఈ కాల్పుల్లో నలుగరు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ వారిని దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. చనిపోయిన వారిని రెస్టారెంట్ యజమాని, రెస్టారెంట్ సిబ్బంది, పశువుల కాపరి, ట్రక్ డ్రైవర్‌గా గుర్తించారు. వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీసు బృందాలు పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నాయి.

## వైసిపి ఆందోళనలకు స్పందన ఏదీ

### పార్టీ నేతలే ఎక్కడా పాల్గొనలేదు

### మండిపడ్డ మాజీమంత్రి సోమిరెడ్డి

నెల్లూరు : పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై వైసీపీ నేతలు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనలు పూర్తిగా విఫలమయ్యాయని టీడీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. ఈ ఆందోళనల్లో మీ పార్టీ వాళ్లే పాల్గొన లేదనే విషయం అందరికీ తెలిసిందేనన్నారు. సోమవారం మీరు చేపట్టిన ధర్నాలు చూసి.. మీ పార్టీ నేతలే నవ్వుకుంటున్నారని వ్యంగ్యంగా పేర్కొన్నారు. మంగళవారం రాజధాని అమరావతిలో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. పెట్రోల్, డీజిల్ ధరలు జగన్ ప్రభుత్వ హయాంలోనే పెంచారని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు మీరే ఆందోళన చేయడం ఏమిటని వైసీపీ నేతలను సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. మీ పార్టీ అధినేత వైఎస్ జగన్ రెడ్డి పెంచిన ధరలపై మీరే ఆందోళన చేస్తారా? అంటూ వైసీపీ నేతల తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. టీడీపీ ప్రభుత్వం కొలువుదీరి రెండేళ్లు అవుతుందని పేర్కొన్నారు. ఈ సమయంలో పెట్రోల్, డీజిల్‌పై తాము నయాపైసా పెంచామా? అని వైసీపీ నేతలను సూటిగా ఆయన ప్రశ్నించారు. అసలు విషయాలు తెలుసుకోకుండా వైసీపీ నేతలు రో÷–డడెక్కి ఆందోళన చేయడం సిగ్గు చేటని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అభివర్ణించారు. గతంలో మీ ప్రభుత్వం పెంచిన ధరలపై మీరే ఆందోళన చేయడాన్ని ప్రజలంతా గమనిస్తున్నారనే విషయాన్ని తెలుసుకోవాలంటూ వైసీపీ కేడర్‌కు ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్పష్టం చేశారు. అసలు వైసీపీకి రాజకీయ పార్టీగా ఉండే అర్హత లేదని ఆయన కుండ బద్దలు కొట్టారు. వైసీపీ హయాంలో అరాచకాలకు అంతే లేకుండా పోయిందన్నారు. మీ ప్రభుత్వ హయాంలో లిక్కర్ ధరలు పెంచడమే కాకుండా.. నకిలీ మద్యం ఇచ్చి వేలాది మంది ప్రజల ప్రాణాలు తీయలేదా? అంటూ వైసీపీ నేతలను నిలదీశారు. ఆ విషయాలు ఇంకా ప్రజలు మర్చిపోలేదనే విషయాన్ని తెలుసుకోవాలంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్పష్టం చేశారు.

## దేశంలో చాపకింద నీరులా మతమార్పిళ్లు

### నాసిక్ ఘటన మరువక ముందే మరో ఘటన

### యూపిలో నెట్‌వర్క్‌ను ఛేదించిన పోలీసులు

### పదిమంది నిందితుల అరెస్ట్..ముమ్మర దర్యాప్తు

లక్నో,మే19 : నాసిక్‌లోని ఓ బహుళజాతి కంపెనీలో బలవంతపు మత మార్పిళ్లు, లైంగిక వేధింపులు చోటుచేసుకోవడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అటువంటి మరో ఘటన ఉత్తర్‌ప్రదేశ్ లోని మీర్జాపుర్‌లో వెలుగులోకి వచ్చింది. జిమ్‌లలో చేరే మహిళలను లక్ష్యంగా చేసుకొని మత మార్పిళ్లు చేస్తున్న నెట్‌వర్క్‌ను పోలీసులు గుర్తించారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం.. మీర్జాపుర్‌లోని ఓ జిమ్ యజమాని మతం మారాలని బలవంతం చేస్తున్నట్లు ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసుపై విచారణ చేస్తుండగా.. దీని వెనుక పెద్ద నెట్ వర్క్ ఉన్నట్లు గుర్తించారు. నిందితులు రాష్ట్రంలోని వివిధ జిమ్‌లు, సోషల్‌మీడియాల్లో ముందుగా మహిళలతో పరిచయాలు పెంచుకొని.. అనంతరం మత మార్పిడి చేసుకోవాలని వారిపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. దాదాపు 50 మందికి పైగా మహిళలను లక్ష్యంగా చేసుకుని ఈ ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసులో సన్నో అనే మహిళ ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. ముందుగా జిమ్‌లలో చేరి అక్కడి యువతులతో పరిచయం పెంచుకుంటుందని.. అనంతరం తన స్నేహితులుగా పేర్కొంటూ పలువురు ముస్లిం యువకులను వారికి పరిచయం చేస్తుందని పేర్కొన్నారు. మరికొందరు మహిళలను నిందితులు ఇన్‌స్టాగ్రామ్‌లో ఫ్రెండ్ రిక్వెస్ట్‌ల ద్వారా పరిచయం పెంచుకొని.. వారిలో మతమార్పిడి ఆలోచనలు కలిగేలా బ్రెయిన్ వాష్ చేసేవారని పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్‌లలో వందలాది మంది మహిళల ఫొటోలు, వీడియోలు, చాట్‌లు ఉన్నాయని.. వాటిపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కేసు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ దృష్టికి వెళ్లడంతో ఆయన తీవ్రంగా స్పందించారు. నిందితులపై గ్యాంగ్‌స్టర్ చట్టం కింద కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కేసులో ఇప్పటివరకు 10మంది అనుమానితులను అరెస్ట్ చేశామని.. దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు పేర్కొన్నారు.

## మత్స్యకారులకు నిధులు విడుదల

### బోట్లతో హర్షం వ్యక్తం చేసిన జాలర్లు

విజయవాడ,మే19 : కృష్ణానదిలో మత్స్యకారులు బోట్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన గంగపుత్రులు బోట్ల ప్రదర్శన చేశారు. వరుసగా రెండో ఏడాది 'మత్స్యకారుల సేవలో' పథకం కింద నిధుల విడుదల చేయడంపై మత్స్యకార కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి. తమ సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనంగా కృష్ణానదిలో బోట్ల ర్యాలీతో మత్స్యకారులు ప్రభుత్వానికి మద్దతు తెలిపారు. వేట నిషేధ సమయంలో ఇబ్బంది పడకుండా ఒక్కో కుటుంబానికి రూ.20 వేల చొప్పున ప్రభుత్వం ఆర్థిక భరోసా ఇస్తోంది. గత ఏడాది 1,21,433 కుటుంబాలకు రూ.243 కోట్ల సాయం అందచేయగా.. ఈ ఏడాది 1,30,796 కుటుంబాలకు రూ.262 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది.

## దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డులో గందరగోళం

### కొనుగోళ్లు నిలిచి పోవడంతో రైతుల ఆందోళన

గుంటూరు,మే19 :గుంటూరు జిల్లా దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డులో వ్యాపారులు కుమ్మక్కై కొనుగోళ్లను నిలిపివేశారు. టెండరు ధర ప్రకారం కొనుగోలు చేయాలని వ్యాపారులకు రైతులు, అధికారులు తెల్చి చెప్పారు. దీంతో వ్యాపారులంతా ఏకమై పసుపు కొనుగోలు చేయకుండా వెళ్లిపోయారు. కొనుగోళ్లు నిలిచిపోవడంతో దూర ప్రాంతాల నుంచి పసుపు తీసుకొచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పసుపు ధర బాగుందని, మంచి లాభాలు వస్తాయని ఆశించామని రైతులు చెబుతున్నారు. వ్యాపారుల నిర్వాకంతో పసుపు రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బాగా పండిన పంటను ప్రభుత్వం సూచించిన ధరకు కాకుండా.. తమకు నచ్చిన ధరకు కొనుగోలు చేయాలని వ్యాపారులు చూస్తున్నారని రైతుల ఆరోపిస్తున్నారు.

## వినుకొండ ఆస్పత్రిలో పేలిన ఎసి

గుంటూరు,మే19 : వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ఏసీ పేలిన ఘటన కలకలం రేపింది. ఆసుపత్రిలోని ఒక గదిలో ఏర్పాటు చేసిన ఎయిర్ కండిషనర్ అకస్మాత్తుగా భారీ శబ్దంతో పేలినట్లు తెలుస్తోంది. ఘటన జరిగిన సమయంలో అక్కడ ఉన్న సిబ్బంది, రోగులు భయాందోళనకు గురయ్యారు. ఏసీ పేలుడు కారణంగా గదిలో స్వల్పంగా పొగ వ్యాపించింది. వెంటనే అప్రమత్తమైన ఆసుపత్రి సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేసి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. ఏసీ పేలడానికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు.

## మోడల్ స్కూల్స్‌లో కాంట్రాక్ట్ సిబ్బందికి ఊరట


### కాంట్రాక్ట్‌ను మరో 11 నెలలు పొడిగింపు

అమరావతి,మే19 : ఏపీ మోడల్ స్కూల్స్‌లో కాంట్రాక్ట్ సిబ్బంది సేవలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పొడిగించింది. 123 మంది ఫిజికల్ డైరెక్టర్లు, 120 మంది కంప్యూటర్ టీచర్ల సేవలను పునరుద్ధరించింది. 2026 జూన్ 1వ తేదీ నుంచి 2027 ఏప్రిల్ 30వ తేదీ వరకు 11 నెలల పాటు సేవలకు అనుమతి ఇచ్చింది. అకడమిక్ ఇయర్ 2026-27 కోసం కాంట్రాక్ట్ సిబ్బందికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఒక నెల విరామంతో సేవల కొనసాగింపునకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాల విద్యాశాఖ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. జీఓ ఆర్టీ నంబర్-51ను స్కూల్ ఎడ్యుకేషన్ శాఖ విడుదల చేసింది. ఈ మేరకు్గ ÷నాన్స్ శాఖ అనుమతితో ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# నేడు ఎన్టీఆర్ బర్త్‌డే

**అర్ధరాత్రికి డ్రాగన్ గ్లింప్స్ విడుదల**

యంగ్ టైగర్ ఎన్టీఆర్, సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవైటెడ్ పాన్-ఇండియా చిత్రం నుంచి ఎట్టకేలకు ఒక భారీ అప్‌డేట్ వచ్చేసింది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ పుట్టినరోజు మే 20 పురస్కరించుకుని, మేకర్స్ అభిమానుల కోసం ఒక అద్భుతమైన సర్ప్రైజ్ ప్లాన్ చేశారు. ఈ రోజు అర్ధరాత్రి సరిగ్గా 11:52 గంటలకి ఈ చిత్రం యొక్క ఫస్ట్ గ్లింప్స్ డిజిటల్ ఎ÷-లాట్‌ఫార్మ్‌తో పాటు, ఎంపిక చేసిన థియేటర్లలో భారీ ఎత్తున విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో గట్టి టాక్ వినిపిస్తోంది. సెన్సార్ బోర్డ్ వెబ్‌సైట్‌లో కూడా 'గ్లింప్స్ ఆఫ్ డ్రాగన్' పేరుతో సర్టిఫికేట్ పొందినట్లు సమాచారం రావడంతో అభిమానుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. ఈ రాత్రి గ్లింప్స్ ద్వారా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. సాధారణంగా వచ్చే టీజర్లు లేదా గ్లింప్స్‌లు ఒకటి లేదా రెండు నిమిషాలు మాత్రమే ఉంటాయి. కానీ, ప్రశాంత్ నీల్ ఈసారి భిన్నంగా ఏకంగా 4 నిమిషాల 35 సెకన్ల రన్ టైమ్‌తో ఈ గ్లింప్స్‌ను కట్ చేసినట్లు తెలుస్తోంది. సినిమా యొక్క కథా నేపథ్యాన్ని, ఆ ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయడం కోసమే ఇంత సుదీర్ఘమైన విజువల్స్‌ను ప్లాన్ చేశారట. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ హై బడ్జెట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ అనిల్ కపూర్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాలకు ఊపిరి పోసిన రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ క్రేజీ పాన్-ఇండియా విజువల్ వండర్ జూన్ 11, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.






# కాక్‌టెయిల్-2 విభిన్నమైన మూవీ

**హీరోయిన్ రష్మిక మందన్నా**

వైవిధ్యమైన పాత్రలో ప్రేక్షకుల్ని అలరిస్తూ మెప్పిస్తుంటుంది కథానాయిక రష్మిక. ప్రస్తుతం ఆమె 'కాక్‌టెయిల్ 2' సినిమాతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. హిందీ హీరో షాహిద్ కపూర్, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. హోమి అడజానియా దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను ఈ నెల 29న విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఈ చిత్రానికి సంబంధించిన మ్యూజికల్ ఈవెంట్‌ను నిర్వహించింది చిత్రబృందం. రష్మిక మాట్లాడుతూ.. 'కాక్‌టెయిల్ 2' చాలా భిన్నమైన చిత్రం. మీ ఊహకు కూడా అందదు. ముఖ్యంగా ఈ సినిమాలో కృతి అద్భుతంగా నటించింది. మాకు, షాహిద్‌కు మధ్య కెమిస్ట్రీ మరో స్థాయిలో ఉంటుంది. ఈ భిన్నమైన ప్రేమకథను అందరూ ఎంజాయ్ చేస్తారు. ఇప్పటి వరకూ మీరు చూసింది చాలా తక్కువ. ముందు ముందు మంచి సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి. వాటిని చూడడం కోసం నేను కూడా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా' అని చెప్పుకొచ్చింది. మడాక్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం జూన్ 19న థియేటర్లలోకి రాబోతుంది.



# బాలల చిత్రంగా సమ్మర్ హాలిడేస్

ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై 'సమ్మర్ హాలిడేస్' అనే బాలల చిత్రం రాబోతోంది. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసే అందమైన కథతో దర్శకుడు శ్రీకర్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, 'మన శంకర వరప్రసాద్ గారు' మూవీ ఫేమ్ బేబి ఖుషి కీలక పాత్రలు పోషిస్తున్నారు. మంగళవారం ఖుషి పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి బర్త్ డే పోస్టర్ రిలీజ్ చేశారు. ఖుషి 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాలో మెగాస్టార్ చిరంజీవి కూతురి పాత్రలో నటించి అందరిని ఆకట్టుకుంది. ఇందులో ఆ చిన్నారి కీలక పాత్రతో మెప్పించనుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.




# 23న భోపాల్‌లో పెద్ది సందడి

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న చిత్రం 'పెద్ది'. జూన్ 4న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రముఖ నగరాల్లో దీని స్పెషల్ ఈవెంట్‌ను నిర్వహించాలని టీమ్ భావిస్తోంది. తాజాగా ముంబయిలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరిగిన విషయం తెలిసిందే. దీని తర్వాత మే 23న మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఏఆర్ రెహమాన్‌తో లైవ్ కాన్సర్ట్‌ను నిర్వహించనున్నారు. భారీ స్థాయిలో జరగనున్న ఈ ఈవెంట్ కోసం టీమ్ పనులు ప్రారంభించింది. తాజాగా భోపాల్‌లోని బీహెచ్‌ఈఎల్ గ్రౌండ్స్‌లో పూజా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇప్పటికే 'పెద్ది'నుంచి వచ్చిన రెండు పాటలు సూపర్ హిట్‌గా నిలిచి కోట్లలో వ్యూస్‌ను సొంతం చేసుకున్నాయి. ఇప్పుడు స్పెషల్ సాంగ్ రానుండడంతో అందరిలో ఆసక్తి నెలకొంది. 'పెద్ది'లో స్పెషల్ సాంగ్ హైలైట్‌గా నిలుస్తుందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో బుచ్చిబాబు తెలిపారు. ఆ పాట ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ బ్లాస్ట్ అని పేర్కొన్నారు. ఇక తాజాగా విడుదలైన 'పెద్ది' ట్రైలర్ అన్ని భాషల్లో కలిపి 63 మిలియన్ల వ్యూస్ వచ్చినట్లు టీమ్ తెలిపింది. అన్ని సోషల్ మీడియా వేదికల్లోనూ అది ట్రెండింగ్‌లో ఉందని పేర్కొంది. రామ్‌చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటిస్తోన్న ఈ సినిమాలో శివరాజ్ కుమార్, జగపతి బాబు కీలకపాత్రల్లో కనిపించనున్నారు.










# కమల్ హాసన్ పొదుపు మంత్రం

ఎకానమి సీట్లో హైదరాబాద్‌కు రాక విశ్వనాయకుడు కమల్‌హాసన్ తీసుకున్న ఓ నిర్ణయంతో ఆయన ఎంత గొప్ప నటుడో, ఆయన వ్యక్తిత్వం ఎంత గొప్పదో చెబుతూ వైజయంతీ మూవీస్ సంస్థ ఓ ట్వీట్ చేసింది. ఇటీవల కాలంలో సినిమా షూటింగ్ బడ్జెట్ కన్నా నటీనటులకు కల్పించే సౌకర్యాలు ఖర్చే ఎక్కువ అవుతోంది. మేకర్స్ అనవసరపు ఆర్భాటాల తగ్గించుకోవాలంటూ కమల్ హాసన్ ఇటీవల ఓ ప్రకటన జారీ చేశారు. అంతేకాదు దానిని ఆచరణ రూపంలోనూ చూపించారు. ఈ నేపథ్యంలో ఆయన 'కల్కి' సీక్వెల్ షూటింగ్‌కు ఎకానమి ఫ్లైట్‌లో హైదరాబాద్‌కు వచ్చారు. దీనిని ఉదహరిస్తూ వైజయంతి మూవీస్ సంస్థ ఆయనను అభినందించింది. 'ప్రస్తుతం సినిమా పరిశ్రమ నిర్మాణపరంగా ఎంతో కష్టాలను ఎదుర్కొంటోంది. ఇలాంటి సమయంలో కమల్‌హాసన్ ప్రైవేట్ చార్టర్ విమానాలు, విలాసవంతమైన ప్రయాణాలను పక్కనపెట్టి, ఎకానమి ఫ్లైట్‌లో నేరుగా షూటింగ్ సెట్‌కు వస్తున్నారు. ఆ నిర్ణయం ఆయన ఎంతటి దిగ్గజమో తెలియజేస్తోంది. చిత్ర పరిశ్రమలో అద్భుతాలు జరగడానికి ఇది మొదటి అడుగు అనుకోవచ్చు' అని ట్వీట్‌లో వైజయంతి మూవీస్ సంస్థ పేర్కొంది. ప్రభాస్ హీరోగా నాగ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి కొనసాగింపుగా కల్కి పార్ట్ 2 రూపొందుతున్న సంగతి తెలిసిందే! ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఇందులో కమల్ సుప్రీం యాస్కిన్‌గా నటిస్తున్నారు. ఈ మధ్యన కమల్, అమితాబ్‌పై కీలక సన్నివేశాలను తెరకెక్కించారు. తాజా షెడ్యూల్ కోసం కమల్ హైదరాబాద్ వచ్చారు. దీనికి సంబంధించిన ఓ ఫోటోను వైజయంతీ సంస్థ ట్వీట్ చేసింది.



# కురుప్ప వసూళ్ల సునామి

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, త్రిష జంటగా ఆర్జే బాలాజీ దర్శకత్వంలో తెరకెక్కిన మైథలాజికల్ యాక్షన్ డ్రామా 'కరుప్పు' బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట కొనసాగిస్తోంది. ఈ చిత్రం కేవలం 4 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.150 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి సంచలనం సృష్టించింది. వారాంతంలోనే కాకుండా వర్కింగ్ డే అయిన సోమవారం కూడా ఈ సినిమా థియేటర్లలో భారీ వసూళ్లను సాధించింది. అడ్వాన్స్ బుకింగ్స్ కూడా ట్రెండీగా, చాలా స్టాం÷-రగ్‌గా ఉన్నాయి. ఈ జోరు చూస్తుంటే సూర్య సినీ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా 'కరుప్పు' నిలవడం ఖాయంగా కనిపిస్తోంది. పాత రికార్డులను తిరగరాస్తూ దూసుకుపోతున్న ఈ చిత్రం త్వరలోనే రూ.200 కోట్ల క్లబ్‌లో చేరే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com

స్పోర్ట్స్

# సంజు శాంసన్ సరికొత్త రికార్డు

ఇండియన్ ప్రీమియర్ లీగ్  లో మహేంద్ర సింగ్ ధోని సుదీర్ఘకాలంగా ఏలుతున్న ఒక అరుదైన రికార్డుల లిస్టులో సంజు శాంసన్ తన పేరును లిఖించుకున్నాడు. సోమవారం చెపాక్ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్  జట్టుతో జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ ఈ అద్భుతమైన ఘనత సాధించాడు. ఒకే ఐపీఎల్ సీజన్ లో సీఎస్కే తరపున ఒక వికెట్ కీపర్ గా అత్యధిక పరుగులు చేసిన ఎంఎస్ ధోని రికార్డును ఆయన బద్దలు కొట్టాడు. ఇంతకుముందు ధోని 2013 ఐపీఎల్ సీజన్ లో 16 ఇన్నింగ్స్ ఆడి 461 పరుగులు సాధించాడు. ఈ మార్కును దాటడానికి శాంసన్‌కు మ్యాచ్ ప్రారంభంలో కేవలం 12 పరుగులు మాత్రమే అవసరం అవ్వగా, ఆయన కేవలం ఆరు బంతుల్లోనే 15 పరుగులు చేసి ఆ మైలురాయిని దాటేశాడు. హైదరాబాద్ బౌలర్ నితీష్ కుమార్ రెడ్డి వేసిన మొదటి ఓవర్ లోనే శాంసన్ ఈ స్కోరు అందుకోవడం విశేషం. రికార్డు దాటిన తర్వాత కూడా సంజు శాంసన్ తన అగ్రెసివ్ బ్యాటింగ్ శైలిని అస్సలు ఆపలేదు. రెండో ఓవర్ లో బౌలింగ్‌కు వచ్చిన ప్రఫుల్ హింగే ఓవర్ లో వరుసగా మూడు బౌండరీలు బాది స్టేడియాన్ని హోరెత్తించాడు. కేవలం 11 బంతుల్లోనే 27 పరుగులు చేసి మంచి టచ్ లో కనిపించిన శాంసన్‌ను అడ్డుకోవడానికి సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్ స్వయంగా బౌలింగ్ రంగానికి వచ్చాడు. కమిన్స్ వేసిన ఒక పవర్‌ఫుల్



యార్కర్‌ను శాంసన్ సమర్థవంతంగా డిఫెండ్ చేశాడు. ఆ తర్వాతి బంతిని కమిన్స్ ఆఫ్ స్టంప్‌కు వెలుపల వేయగా, శాంసన్ డ్రైవ్ చేయడానికి ప్రయత్నించాడు. ఆ షాట్ మిస్ అవ్వడంతో బంతి బ్యాట్ ఎడ్జ్ కు తగిలి వికెట్ కీపర్ చేతుల్లోకి వెళ్ళింది. దాంతో శాంసన్ ఇన్నింగ్స్ ముగిసింది. ఓవరాల్ గా చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో వికెట్ కీపర్ బ్యాటర్ గా ధోని రికార్డులు అన్-మ్యాచ్‌డ్ గా ఉన్నప్పటికీ, ఈ లిస్టులో ప్రముఖంగా నిలిచిన రెండో ప్లేయర్ గా సంజు శాంసన్ గుర్తింపు తెచ్చుకున్నాడు. ఐపీఎల్ లో ఒకే సీజన్ లో సీఎస్కే తరపున 100 కంటే ఎక్కువ పరుగులు చేసిన వికెట్ కీపర్లు కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారు. వారిలో మొదటి వ్యక్తి ఎంఎస్ ధోని కాగా, రెండో ఆటగాడు 2008 సీజన్ లో రాణించిన పార్థివ్ పటేల్. ఇప్పుడు ఈ 2026 సీజన్ లో సంజు శాంసన్ ఆ లిస్టులోకి చేరాడు. ప్రస్తుత ఐపీఎల్ 2026 టోర్నమెంట్ లో శాంసన్ అద్భుతమైన ఫామ్ లో ఉన్నాడు. ఆయన ఇప్పటివరకు 13 ఇన్నింగ్స్ ఆడి 47.7 సగటుతో మొత్తంగా 477 పరుగులు సాధించి ఆరెంజ్ క్యాప్ రేసులో దూసుకుపోతున్నాడు. అంతకుముందు ఎమ్ ఏ చిదంబరం స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ లో చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఈ సీజన్ లో అంతకుముందు రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్ లో హైదరాబాద్ జట్టు చెన్నైని 10 పరుగుల తేడాతో ఓడించింది. టాస్ సమయంలో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఒక ముఖ్యమైన విషయాన్ని షేర్ చేశాడు. ఫిట్‌నెస్ సమస్యల కారణంగా లెజెండరీ ప్లేయర్ ఎంఎస్ ధోని ఈ మ్యాచ్ ఆడటం లేదని స్పష్టం చేశాడు.  ధోని జట్టుతోనే ఉన్నప్పటికీ ఆడే పరిస్థితిలో లేకపోవడం వల్ల జట్టులో ఒక మార్పు చేసినట్లు రుతురాజ్ పేర్కొన్నాడు.

## ముంబై ఇండియన్స్ నుండి ఇద్దరు కీలక ఆటగాళ్లు అవుట్..!

ఐపీఎల్ చరిత్రలో ఐదుసార్లు విజేతగా నిలిచిన ముంబై ఇండియన్స్ జట్టుకు ఈ ఏడాది అస్సలు కలిసిరావడం లేదు. ఇప్పటికే ప్లేఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించిన ఈ జట్టును గాయాల సమస్యలు నీడలా వెంటాడుతున్నాయి. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, స్టార్ ఓపెనర్ క్వింటన్ డి కాక్, యువ ఆల్‌రౌండర్ రాజ్ అంగద్ బావా మిగిలిన మ్యాచ్‌లకు పూర్తిగా దూరమయ్యారు. ఈ విషయాన్ని ముంబై ఇండియన్స్ యాజమాన్యం అధికారికంగా ధృవీకరించింది. ప్రతిష్టాత్మకమైన పోరాటంలో ఇలాంటి కీలక సమయంలో ఆటగాళ్లు దూరం కావడం జట్టు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తోంది. జట్టులో అత్యంత నమ్మకమైన వికెట్ కీపర్ బ్యాటర్ అయిన క్వింటన్ డి కాక్ ఎడమ మణికట్టు తీవ్రమైన గాయానికి గురైంది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌కు ముందే అతడు ఈ నొప్పితో బాధపడ్డాడు. వైద్య నిపుణులు పరీక్షించిన తర్వాత అతడికి విశ్రాంతి తప్పనిసరని తేల్చారు. రోహిత్ శర్మ గాయపడిన సమయంలో జట్టులోకి వచ్చి అద్భుతమైన శతకంతో మెరిపించిన డి కాక్, ఇలా అర్థాంతరంగా టోర్నీ నుంచి తప్పుకోవడం ముంబై బ్యాటింగ్ విభాగానికి పెద్ద మైనస్‌గా మారింది.మరోవైపు యువ ప్రతిభావంతుడు, ఆల్‌రౌండర్ రాజ్ అంగద్ బావా సైతం దురదృష్టవశాత్తూ గాయాల బారిన పడ్డాడు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో అతడి కుడిచేతి బొటనవేలికి తీవ్రమైన గాయమైంది. పరీక్షల్లో అతడికి లిగమెంట్ తెగినట్లు నిర్ధారణ అయింది. దీనివల్ల అతడు ఈ సీజన్‌లో ముంబై తరపున తదుపరి మ్యాచ్‌లు ఆడే అవకాశం కోల్పోయాడు. యువ ఆటగాడిగా తన ప్రతిభను నిరూపించుకునే క్రమంలో అతడికి ఈ గాయం పెద్ద అడ్డంకిగా మారింది.ముంబై ఇండియన్స్ ఈ సీజన్‌లో ఆడిన 11 మ్యాచ్‌లలో ఏకంగా 8 మ్యాచ్‌లలో ఓడిపోయి పట్టికలో అడుగున నిలిచింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన ఉత్కంఠభరిత పోరాటంలో చివరి బంతికి ఓడిపోవడంతో ముంబై ప్లేఆఫ్స్ ఆశలు పూర్తిగా గల్లంతయ్యాయి. జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యా వెన్నునొప్పితో బాధపడుతుండటం, సీనియర్ ఆటగాడు సూర్యకుమార్ యాదవ్ వ్యక్తిగత కారణాల వల్ల అందుబాటులో లేకపోవడంతో గత మ్యాచ్‌లో జస్‌ప్రీత్ బుమ్రా జట్టుకు నాయకత్వం వహించాల్సి వచ్చింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కోల్‌కతా నైట్ రైడర్స్, రాజస్థాన్ రాయల్స్‌తో జరగబోయే తమ చివరి లీగ్ మ్యాచ్‌లలో ముంబై ఇండియన్స్ కేవలం తమ గౌరవాన్ని కాపాడుకోవడం కోసమే బరిలోకి దిగనుంది. కనీసం చివరి మ్యాచ్‌ల్లోనైనా గెలిచి టోర్నీని గౌరవప్రదంగా ముగించాలని అభిమానులు ఆశిస్తున్నారు. సంచలన ఆటగాళ్లతో కాగితం మీద ఎంతో బలంగా కనిపించిన ముంబై ఇండియన్స్, మైదానంలో మాత్రం ఘోరంగా విఫలమైంది. ఆటగాళ్ల ఫామ్ లేమి ఒక ఎత్తయితే, కీలక సమయంలో వెంటాడిన గాయాలు జట్టును పూర్తిగా కోలుకోకుండా చేశాయి. ఈ ఐపీఎల్ సీజన్ ముంబై జట్టుకు ఒక చేదు జ్ఞాపకంగా మిగిలిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.



## పంత్ కెరీర్ ముగిసినట్లేనా..?

ఐపీఎల్ 2026 ముగియక ముందే భారత క్రికెట్‌లో మరో భారీ ట్విస్ట్ చోటుచేసుకుంది. ఆఫ్ఘనిస్తాన్‌తో జూన్ 6 నుంచి ప్రారంభమయ్యే ఏకైక టెస్టు కోసం బీసీసీఐ ప్రకటించిన జట్టులో అత్యంత హాట్ టాపిక్‌గా మారింది రిషబ్ పంత్ డిమోషన్. టీమ్‌ఇండియా భవిష్యత్ నాయకుల్లో ఒకడిగా భావించిన పంత్‌ను టెస్టు వైస్ కెప్టెన్సీ నుంచి తప్పిస్తూ.. అనుభవజ్ఞుడు కేఎల్ రాహుల్‌కు ఆ బాధ్యతలు అప్పగించారు. ఈ నిర్ణయం ఇప్పుడు భారత క్రికెట్ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. రోహిత్ శర్మ టెస్టులకు వీడ్కోలు పలికిన తర్వాత భారత జట్టులో నాయకత్వ మార్పులు వేగంగా జరిగాయి. యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌ను టెస్టు కెప్టెన్‌గా ఎంపిక చేసిన సెలెక్టర్లు.. అప్పట్లో రిషబ్ పంత్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. కానీ ఇప్పుడు కేవలం కొద్ది కాలంలోనే పంత్ నుంచి ఆ బాధ్యతలను తీసేసి, కేఎల్ రాహుల్‌కు అప్పగించడం గమనార్హం. జూన్ 6 నుంచి ముల్లన్‌పూర్ వేదికగా ప్రారంభమయ్యే ఈ టెస్టులో శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా జట్టును నడిపించనున్నాడు. అతనికి డిప్యూటీగా కేఎల్ రాహుల్ వ్యవహరించనున్నాడు. ఈ మార్పుతో టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ భవిష్యత్ నాయకత్వంపై స్పష్టమైన సంకేతాలు ఇచ్చిందని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. రిషబ్ పంత్‌ను వైస్ కెప్టెన్సీ నుంచి తొలగించడం ఒక్కసారిగా తీసుకున్న నిర్ణయం కాదని తెలుస్తోంది. దీనికి పలు కారణాలు ఉన్నాయని బీసీసీఐ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా కెప్టెన్సీ ఒత్తిడి అతని సహజమైన దూకుడు బ్యాటింగ్‌ను ప్రభావితం చేస్తోందనే అభిప్రాయం సెలెక్టర్లలో బలపడిందని సమాచారం. ఐపీఎల్ 2026లో లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్‌గా పంత్ ప్రదర్శన తీవ్ర విమర్శలకు గురైంది. బ్యాటింగ్‌లోనూ అతను ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. కీలక మ్యాచ్‌ల్లో తీసుకున్న నిర్ణయాలు కూడా ప్రశ్నార్థకంగా మారాయి. దీంతో నాయకత్వ బాధ్యతల కంటే అతను పూర్తిగా బ్యాటింగ్‌పైనే దృష్టి పెట్టాలని బోర్డు భావించినట్లు తెలుస్తోంది. అంతేకాదు.. గతంలో దక్షిణాఫ్రికా టెస్టు సిరీస్‌లో శుభ్‌మన్ గిల్ మైదానం వెలుపల ఉన్న సమయంలో పంత్ తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించాడు. అయితే ఆ సమయంలో అతని ఫీల్డ్ సెట్టింగ్స్, బౌలింగ్ మార్పులు టీమ్ మేనేజ్‌మెంట్‌ను పెద్దగా ఆకట్టుకోలేదని సమాచారం. రిషబ్ పంత్ అంటే భారత అభిమానులకు వెంటనే గుర్తొచ్చేది గబ్బా హీరోయిక్స్. ఒంటరిగా మ్యాచ్‌ను తిప్పేసే దూకుడు. ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆడినప్పుడు పంత్ అత్యంత ప్రమాదకరమైన మ్యాచ్ విన్నర్‌గా మారతాడని బీసీసీఐ నమ్ముతోంది. అందుకే ఇప్పుడు అతనిపై ఉన్న నాయకత్వ భారం తగ్గించి, పూర్తిగా వికెట్ కీపర్-బ్యాటర్ పాత్రకే పరిమితం చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్ దిగ్గజాలు క్రమంగా టెస్టు జట్టుకు దూరమవుతున్న నేపథ్యంలో ఇప్పుడు అనుభవజ్ఞుల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ఇలాంటి సమయంలో కేఎల్ రాహుల్ జట్టులో అత్యంత అనుభవం ఉన్న ఆటగాళ్లలో ఒకడిగా నిలిచాడు. రాహుల్ ఇప్పటికే భారత జట్టుకు మూడు టెస్టుల్లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. 2022లో జోహన్నెస్‌బర్గ్‌లో దక్షిణాఫ్రికాపై భారత్‌ను నడిపించడంతో పాటు.. బంగ్లాదేశ్ పర్యటనలో కూడా నాయకత్వ బాధ్యతలు చేపట్టాడు. ప్రశాంత స్వభావం, క్లిష్ట పరిస్థితుల్లో స్థిరంగా ఆలోచించే తీరు అతనికి ప్లస్ పాయింట్‌గా మారాయి. అందుకే యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు సరైన సపోర్ట్‌గా రాహుల్‌ను సెలెక్టర్లు ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. రిషబ్ పంత్‌కు ఎదురైన ఎదురుదెబ్బ కేవలం టెస్టులకే పరిమితం కాలేదు. అతను ఇప్పటికే టీ20 సెటప్‌కు దూరమయ్యాడు. ఇప్పుడు ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న మూడు వన్డేల సిరీస్‌కు కూడా అతనికి చోటు దక్కలేదు. దీంతో మూడు ఫార్మాట్లలోనూ తన స్థానాన్ని నిలబెట్టుకోవడానికి పంత్ ఇప్పుడు భారీగా పరుగులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దేశీయ క్రికెట్, రాబోయే సిరీస్‌లలో తన బ్యాట్‌తోనే సమాధానం చెప్పాల్సిన ఒత్తిడి ఇప్పుడు పంత్‌పై స్పష్టంగా కనిపిస్తోంది.



## ఐపీఎల్ 2027లో ధోనీ ఆడటం కష్టమేనా?

ఐపీఎల్ క్రికెట్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ఫ్యాన్స్‌కు ఎంఎస్ ధోనీ అంటే ఒక ప్లేయర్ మాత్రమే కాదు, అతను ఒక ఎమోషన్. ఈ 2026 సీజన్‌లో ధోనీని మైదానంలో చూడాలి అని ఎంతో మంది ఆశపడ్డా, గాయం కారణంగా ఒక్క మ్యాచ్‌లోనూ బ్యాట్ పట్టలేదు. దీంతో అభిమానులు తీవ్ర నిరాశలో మునిగిపోయారు. అయితే సోమవారం రాత్రి చెపాక్ మైదానంలో ఒక అద్భుతమైన సీన్ హైలెట్ అయ్యింది. మ్యాచ్ ముగిసిన తర్వాత ధోనీ గ్రౌండ్‌లోకి అడుగు పెట్టడంతో స్టేడియం మొత్తం మారుమోగిపోయింది. కానీ అదే సమయంలో ఆయన తన ప్రాణ స్నేహితుడు, మాజీ సహచరుడు సురేష్ రైనాతో అన్న కొన్ని మాటలు ఇప్పుడు ఫ్యాన్స్ గుండెల్ని పిండేస్తున్నాయి. సోమవారం రాత్రి చెన్నైలోని చేపాక్ స్టేడియంలో సన్ రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య కీలక మ్యాచ్ జరిగింది. ఈ హోరాహోరీ పోరులో చెన్నై జట్టు 5 వికెట్ల తేడాతో ఎస్ఆర్‌హెచ్ చేతిలో ఓటమి పాలైంది. ఈ ఓటమితో ఫ్యాన్స్ నిరాశ చెందినప్పటికీ, మ్యాచ్ ముగిసిన తర్వాత వాళ్లకు ఒక పెద్ద సర్ ప్రైజ్ దొరికింది. ఈ సీజన్‌లో హోమ్ గ్రౌండ్‌లో సీఎస్‌కేకి ఇదే ఆఖరి మ్యాచ్ కావడంతో, ఎంఎస్ ధోనీ మైదానంలోకి వచ్చారు. టీమ్ మెంబర్స్‌తో కలిసి ఫొటోలు దిగడమే కాకుండా, స్టేడియం మొత్తం చుట్టూ తిరుగుతూ అభిమానులకు అభివాదం చేశారు. ఈ ల్యాప్ ఆఫ్ ఆనర్ చూస్తుంటే ధోనీ ఇక క్రికెట్‌కు పూర్తిగా గుడ్ బై చెప్పేస్తున్నారా అన్న అనుమానాలు ఫ్యాన్స్‌లో మొదలయ్యాయి.ఈ మ్యాచ్‌కు కామెంటేటర్‌గా వచ్చిన సురేష్ రైనా, గ్రౌండ్‌లో ధోనీని కలిసి కాసేపు ముచ్చటించారు. ఈ ఇద్దరు దిగ్గజాలు చెన్నై జట్టుకు ఎన్నో గొప్ప విజయాలు అందించారు. ఈ సందర్భంగా రైనా ఐపీఎల్ 2027లో ఆడటం గురించి ధోనీని అడిగారు. ఆ సంభాషణ వివరాలను రైనా స్వయంగా వెల్లడించారు. "నేను ధోనీతో అన్నాను.. నువ్వు ఐపీఎల్ 2026కి ఎలాగో మిస్స్ డ్ కాల్ ఇచ్చావు కాబట్టి ఇది కౌంట్ అవ్వదు, నువ్వు కచ్చితంగా వచ్చే ఏడాది ఆడాల్సిందే అని చెప్పాను. దానికి ధోనీ స్పందిస్తూ.. నా శరీరం ఇప్పుడు కొంచెం బలహీనపడింది, మునుపటిలా సహకరించడం లేదు అని అన్నాడు" అని రైనా చెప్పారు. ధోనీ నోటి నుంచి ఈ మాట వినడంతో అభిమానులు ఎమోషనల్ అవుతున్నారు.ధోనీ ఆ మాట అన్నప్పటికీ రైనా మాత్రం వదిలి పెట్టలేదు. "నువ్వు ఏం చెప్పినా మేము నమ్మం, వచ్చే ఏడాది నువ్వు ఖచ్చితంగా గ్రౌండ్‌లోకి రావాల్సిందే అని నేను ధోనీతో గట్టిగా చెప్పాను" అని రైనా నవ్వుతూ గుర్తు చేసుకున్నారు. అయితే వచ్చే ఏడాది ఆడాలా వద్దా అనేది పూర్తిగా ధోనీ వ్యక్తిగత నిర్ణయం అని, ఆయన ఎప్పుడూ పాజిటివ్‌గానే ఆలోచిస్తారని రైనా ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం టీమ్‌లోని యువ ఆటగాళ్లతో ధోనీ మంచి అనుబంధాన్ని కలిగి ఉన్నారని, ఆయన జట్టుతో కలిసి ప్రయాణించడం ప్లేయర్స్‌లో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని నింపుతోంది అని రైనా వివరించారు.మ్యాచ్ ముగిసిన తర్వాత జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో సీఎస్‌కే హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్‌కు కూడా ధోనీ భవిష్యత్తుపైనే ప్రశ్నలు ఎదురయ్యాయి. దీనిపై ఫ్లెమింగ్ స్పందిస్తూ వచ్చే సీజన్‌లో ధోనీ ఉంటారా లేదా అనేది పూర్తిగా ఫ్రాంచైజీ మేనేజ్‌మెంట్ తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది అని చెప్పారు. "ధోనీ ఈ ఏడాది మ్యాచ్‌లు ఆడకపోయినా జట్టుతోనే ఉన్నాడు. యువ ఆటగాళ్లకు గైడెన్స్ ఇవ్వడంలో ఆయన పాత్ర చాలా పెద్దది. టీమ్‌పై ఆయన ప్రభావం ఎప్పుడూ ఉంటుంది. అయితే వచ్చే ఏడాది ఆడే విషయం మాత్రం మేనేజ్‌మెంట్ చూసుకుంటుంది, నా చేతుల్లో ఏమీ లేదు" అని ఫ్లెమింగ్ క్లారిటీ ఇచ్చారు.చెన్నై సూపర్ కింగ్స్ ప్రస్తుతం ఒక మార్పు దశలో ఉంది. ధోనీ స్థానాన్ని భర్తీ చేసేలా భవిష్యత్తు తరాల కోసం కొత్త ఆటగాళ్లను జట్టులోకి తీసుకుంటున్నామని ఫ్లెమింగ్ చెప్పారు. "మేము ఈ సీజన్‌లో కొంతమంది కొత్త ప్లేయర్స్‌ను ఇంట్రడ్యూస్ చేశాము. వాళ్లు భవిష్యత్తులో సీఎస్‌కేకి కీలక ఆటగాళ్లు అవుతారని నమ్ముతున్నాము. క్రికెట్‌లో ఫలితాలను బట్టే జడ్జ్ చేస్తారు అనేది నిజం, కానీ జట్టు భవిష్యత్తు కూడా మాకు ముఖ్యమే" అని కోచ్ అభిప్రాయపడ్డారు. ధోనీ లేకపోయినా జట్టును బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు ఆయన మాటలను బట్టి అర్థమవుతోంది.ఎంఎస్ ధోనీకి ప్రస్తుతం 44 ఏళ్ల వయసు ఉంది. ఈ వయసులో ప్రొఫెషనల్ క్రికెట్ ఆడటం, అందులోనూ వికెట్ కీపింగ్ చేయడం అంత సులభం కాదు. ఈ సీజన్‌లో ఆయన గాయం కారణంగా ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోవడానికి కారణం కూడా ఇదే.

## వారి భాగస్వామ్యం వల్లే ఓడిపోయే మ్యాచ్‌లో గెలిచాం

### సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్

హెన్రీచ్ క్లాసెన్, ఇషాన్ కిషన్ మూడో వికెట్‌కు నెలకొల్పిన 75 పరుగుల భాగస్వామ్యంతోనే విజయం సాధించామని సన్‌రైజర్స్ హైదరాబాద్  కెప్టెన్ పాట్ కమిన్స్ అన్నాడు. ఈ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ కూడా కొంత వరకు కెప్టెన్సీ చేశాడని, ఈ గెలుపు క్రెడిట్ అతనికే దక్కుతుందని చెప్పాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో చెపాక్ మైదానం వేదికగా జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించి ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో ప్లే ఆఫ్స్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఈ విజయానంతరం మాట్లాడిన పాట్ కమిన్స్.. ఇషాన్ కిషన్, హెన్రీచ్ క్లాసెన్‌లపై ప్రశంసల జల్లు కురిపించాడు. బ్యాటింగ్‌కు ప్రతికూలంగా ఉన్న వికెట్‌పై అసాధారణ ప్రదర్శన కనబర్చారని కొనియాడాడు. ' ఈ విజయం చాలా సంతృప్తిని ఇచ్చింది. మేం సాధారణంగా ఆడే విధానానికి ఈ మ్యాచ్ కొంచెం భిన్నంగా సాగింది. ఈ పిచ్ బ్యాటింగ్‌కు కష్టంగా ఉంది. క్లాసెన్, ఇషాన్ కిషన్ అసాధారణమైన బ్యాటింగ్‌తో గెలిపించారు. వారి ప్రదర్శన చాలా సంతోషాన్నిచ్చింది. ఇషాన్, క్లాసెన్ అద్భుతమైన భాగస్వామ్యమే మా విజయానికి బాటలు వేసింది.ఎందుకంటే పిచ్ బ్యాటింగ్‌కు కష్టంగా ఉంది. మాకు 1-2 భాగస్వామ్యాలు అవసరమని మేం భావించాం.ఈ పిచ్‌పై కాస్త సెట్ అయిన తర్వాత బ్యాటింగ్ చేయడం కొంచెం సులువవుతుంది. మొదట్లో బ్యాటింగ్ చేయడం చాలా కష్టం. కానీ ఇషాన్-క్లాసెన్ సరైన బౌలర్లను టార్గెట్ చేసుకుని కొన్ని అద్భుతమైన షాట్లు ఆడారు. ఈ రన్ ఛేజ్‌లో బాధ్యతాయుతమైన బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చారు.గత మ్యాచ్‌లో 86 పరుగులకే ఆలౌట్ అయిన తర్వాత మా బ్యాటింగ్ గురించి చర్చించాం.



మేం బాధ్యతాయుతమైన బ్యాటింగ్‌కు అంతగా పేరుగాంచలేదు. కానీ అవసరమైనప్పుడు ఆడగలమని నిరూపించాం. అయితే మా బౌలింగ్ సమయంలోనే పిచ్ కాస్త స్లోగా ఉందని, తక్కువ ఎత్తులో బంతి వస్తున్నట్లు గమనించాం. పిచ్‌పై బంతి ఆగుతూ వచ్చినట్లు కూడా అనిపించింది. దాంతో క్రీజులోకి వెళ్లి గుడ్డిగా బ్యాటింగ్ చేయవద్దని మేం నిర్ణయించుకున్నాం. మా బ్యాటర్లు అద్భుతంగా ఆడారు. ఈ పిచ్‌పై 180 పరుగులు మంచి స్కోరే. కానీ 1-2 భాగస్వామ్యాలపైనే విజయవకాశాలు ఆధారపడి ఉంటాయి. టాస్ గురించి మేం పట్టించుకోలేదు. ఇక్కడ ఛేజింగ్ చేసిన టీమ్స్ కూడా గెలిచాయని గుర్తించాం. ప్లే ఆఫ్స్ చేరినా టాప్-2లో నిలిచేందుకు ప్రయత్నిస్తాం. ఆఖరి మ్యాచ్‌లో విజయం కోసం మా సాయశక్తులా పోరాడుతాం. అసలైన ఆట ఇప్పుడు మొదలవుతుంది. కాబట్టి జట్టుగా మరింత కష్టపడాల్సి ఉంటుంది. ఇషాన్ కిషన్ కూడా ఈ మ్యాచ్‌లో సగం వరకు కెప్టెన్సీ చేశాడు. కాబట్టి ఈ విజయంలో అతనికి మరింత క్రెడిట్ దక్కాలి. మా జట్టు ప్రదర్శన పట్ల సంతృప్తిగా ఉంది.గెలిచినా.. మెరుగుపర్చుకునే విషయాలు ఎప్పుడూ కొన్ని ఉంటాయి. మేం లైన్ అండ్ లెంగ్త్ కొద్దిగా తప్పిన ఒకట్రెండు ఓవర్లు ఉన్నాయి. పిచ్ పరిస్థితులను మేం ఇంకాస్త వేగంగా అంచనా వేసి ఉండాల్సింది. కానీ మొత్తంగా చూసుకుంటే.. ఈ ప్రదర్శన పట్ల చాలా సంతోషంగా ఉన్నాను.'అని పాట్ కమిన్స్ చెప్పుకొచ్చాడు.